అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 6-9-2023
సంపుటి : 9 | సంచిక : 247 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

ప్రపంచకప్‌కు భారత క్రికెట్ జట్టు



స్వదేశంలో మరో ప్రపంచకప్ వేటకు రేసు గుర్రాలు సిద్ధం. ఆసియా కప్‌కు ప్రకటించిన 17 మంది సభ్యుల జట్టు నుంచే ప్రపంచకప్ జట్టును ఎంచుకున్న సీనియర్ సెలక్షన్ కమిటీ.. తెలుగు తేజం తిలక్ వర్మ, పేసర్ ప్రసిద్ కృష్ణలను పక్కనపెట్టింది. మిగతా 15 మందితో కూడిన జట్టును యథాతథంగా వన్డే వరల్డ్‌కప్‌కు ఎంపిక చేసింది. భారత్ వేదికగా అక్టోబర్ 5 నుంచి ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ జరుగనుంది. వివరాలు 16లో..

బీజేపీలో భూకంపం

ఏకమవుతున్న బీఆర్ఎస్ వ్యతిరేకులు

- కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి
- కాకరేపుతున్న ఆయన కామెంట్స్
- మాజీ మంత్రి కృష్ణయాదవ్ చేరికను తిరస్కరించిన రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి
- తన నియోజకవర్గంలోనే పోటీ అభ్యర్థిని తెచ్చారని ఈటలపై ఫైర్ • అదే రోజు మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు కొడుక్కి పార్టీ తీర్థం
- ఆయనకే వేములవాడ టికెట్ అని ప్రచారం
- తుల ఉమకు చుక్కెదురు

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

బీజేపీలో రాజకీయ భూకంపం ప్రారంభమైంది. ఎన్నికలు దగ్గరపడుతున్న టైంలో పార్టీ పునాదుల నుంచి ప్రకంపనలు మొదలయ్యాయి. రాష్ట్రంలో తొలి నుంచీ ఆర్ఎస్ఎస్ ప్రేరణతో బీజేపీలో ఉన్న నేతలకు, ఆ తర్వాత వివిధ పార్టీల నుంచి వచ్చి చేరిన నాయకులకు మధ్య ఆధిపత్య పోరు తీవ్రమైంది. ముఖ్యంగా పార్టీలో ఈటల రాజేందర్ పెత్తనాన్ని కొందరు నేతలు ఆక్షేపిస్తున్నట్టు సమాచారం. దీంతో ఈటల కూడా అక్కడ మెసలలేక ఇబ్బంది పడుతున్నారని ఆయన సన్నిహితులు చెప్తున్నారు. బీఆర్ఎస్ కమ్యూనిస్టులతో కటీఫ్ చెప్పాక, బీజేపీ-బీఆర్ఎస్ బంధం ప్రజలకు అర్థమైపోయిందనీ, తాము కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రత్యామ్నాయంగా బీజేపీలో చేరితే, ఇప్పుడు ఇద్దరి మధ్య ఉన్న రహస్య అవగాహన బట్టబయలైందని మొత్తుకుంటున్నారు. దీనితో బీజేపీలో ఉంటే కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాడలేమనే నిశ్చితాభిప్రాయానికి వచ్చిన కొందరు బీజేపీ నేతలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారని తెలిసింది. బీజేపీలో చేరికల కమిటీ చైర్మెన్‌గా ఉన్న ఈటల రాజేందర్ బీఆర్ఎస్ నుంచి భారీ ఎత్తున చీలికలు తెచ్చి, నేతల్ని బీజేపీలోకి తెస్తారని ఆశిస్తే, అలాంటిదేం అక్కడ జరక్కపోవడంతో ఈటల ప్రాబల్యం, ప్రాధాన్యత తగ్గినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ పరిణామాలతో పొసక్కే ఈటల కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నారని తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఇటీవలే బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి సూటిగానే చెప్పేశారు. తనతో పాటు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జీ వివేక్, రవీంద్రనాయక్ వంటి నేతలమంతా కలిసి కాంగ్రెస్‌తో చర్చలు జరిపామని స్పష్టం చేశారు. పార్టీలో చేరతామని చెప్పిన కొందరు మాట తప్పారనీ, తాను మాత్రం కాంగ్రెస్‌లో చేరుతున్నాననీ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌ను బీజేపీలో ఉంటే ఎదుర్కోలేమనీ, ఉద్దేశ్యపూర్వకంగానే బీఆర్ఎస్‌కు బీజేపీ లోపాయికారి సహకారాన్ని అందిస్తున్నదనీ ఆరోపించారు. మరోవైపు ఈటల రాజేందర్ వ్యవహారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డికి ఇబ్బందికరంగా మారినట్టు పార్టీలో చర్చ జరుగుతుంది. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి సీ కృష్ణయాదవ్‌ను ...15లో



ఎన్డీఏకు ఇండియా జ్వరం..

ఇండియా పేరు వింటేనే బీజేపీలో కలవరం మొదలవుతున్నట్టుంది...నిన్నా మొన్నటి దాకా ఇండియా కూటమి పేరుపైనే రాజకీయం చేసిన బీజేపీ ఇపుడు దేశానికి ఆ పేరునే మార్చేయజూస్తోంది. ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని ఓవైపు ఒకేదేశం..ఒకే ఎన్నిక అంటూ బిల్లు పెట్టే అంశంపై మల్లగుల్లాలు పడుతోంది. మరోవైపు ఇండియా పేరునే మార్చేస్తే పోలా..అని ఆలోచిస్తోంది. ఆర్ఎస్ఎస్ కూడా దేశాన్ని భారత్ అనే పిలవాలని ఎప్పటినుంచో చెబుతోంది. అయినా ఇదేమీ వీరికి కొత్తకాదు. తమ రాజకీయ ప్రయోజనాలకోసం పథకాలు మొదలుకుని పట్టణాలు,నగరాల వరకూ పేర్లు మార్చేయటం తొమ్మిదేండ్లుగా వీరు చేస్తున్నదే. ఇపుడు ఏకంగా దేశం పేరునే మార్చాలనుకుంటున్నారా..?! ఇది ఇపుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?




దేశం పేరును భారత్‌గా మార్చాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై 2016లో సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇలాంటి వాటిని విచారించబోమని స్పష్టం చేసింది. ఇండియా లేదా భారత్ మీరు ఈ దేశాన్ని ఎలా పిలవాలనుకుంటే అలా పిలవండి. అని స్పష్టం చేసింది. 2020లో ఇలాంటి పిటిషనే విచారణకు వచ్చినప్పుడు దానిని కూడా అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.

రాజ్యాంగం ఏం చెబుతోంది..?



" ఇండియా.. అంటే భారత్.. రాష్ట్రాల సమాఖ్య" అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 చెబుతోంది. రాజ్యాంగం గుర్తించిన 'ఇండియా', 'భారత్' పదాలు రెండూ దేశానికి అధికారిక పేర్లేనని ఆర్టికల్ 1 స్పష్టం చేస్తోంది. అయితే.. ఇప్పుడు ప్రతిపక్షాలు ఇండియా పేరుతో కూటమిగా ఏర్పడటంతో బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుంచి ఇండియా అనే పేరుని తొలగించి కేవలం భారత్ అనే పేరును మాత్రమే ఉంచాలని భావిస్తోందా ..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

దేశం పేరును భారత్‌గా మార్చేయత్నం...!



- రాష్ట్రపతి ఆహ్వాన పత్రికలో మారిన పేరు • మండిపడిన ప్రతిపక్షాలు
- కూటమి పేరు చెబితేనే భయపడుతోందని ఎద్దేవా

న్యూఢిల్లీ : మన దేశం పేరు మారబోతోందా? ఇప్పటి వరకూ 'ఇండియా' 'భారత్'గా ఉన్న పేర్ల స్థానంలో ఇకపై భారత్ మాత్రమే ఉండబోతుదా..?. దేశ రాజధానిలో మంగళవారం జరిగిన నాటకీయ పరిణామాలను గమనిస్తే ఈ ప్రశ్నలకు 'అవును' అనే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. జీ-20 సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి భవన్ నుండి పంపిన విందు ఆహ్వానాలలో ద్రౌపది ముర్మును 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' అనకుండా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని సంభోదించారు. దీంతో దేశం పేరును మారుస్తున్నారంటూ వదంతులు వ్యాపించాయి. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడ్డాయి. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇండియా పేరును భారత్‌గా మార్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టాయి.

జీ-20 సమావేశాలను పురస్కరించుకొని విందుకు ఆహ్వానిస్తూ రాష్ట్రపతి కార్యాలయం పంపిన ఆహ్వానం సామాజిక మాధ్యమాలలో వైరల్ అయింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనకు వచ్చిన ఆహ్వాన పత్రిక ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేశారు. దాని కింద హిందీలో 'జనగణమన అధినాయక జయహే భారత్ భాగ్య విధాత' అని రాశారు. '2023 సెప్టెంబర్ 9వ తేదీ రాత్రి 8 గంటలకు జరిగే విందుకు ధర్మేంద్ర ప్రధాన్‌ను భారత్ రాష్ట్రపతి ఆహ్వానిస్తున్నారు' అని ఆ పత్రికలో ముద్రించారు.

అయితే పేరు మార్చడంపై రాష్ట్రపతి భవన్ కానీ, జీ-20 సమావేశాలను సమన్వయం చేస్తున్న విదేశాంగ శాఖ కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీనిపై రాష్ట్రపతి భవన్ వర్గాలను ఆరా తీయగా జీ-20 సమావేశాలను సమన్వయం చేస్తున్న విదేశాంగ శాఖ మాత్రమే స్పందిస్తుందని అంటూ దాటవేశారు. ఇండియాకు బదులు భారత్ పేరును ప్రభుత్వం ప్రస్తావించడం ఇది రెండోసారి. గత నెలలో మోడీ గ్రీస్‌లో పర్యటించినప్పుడు ప్రొటోకాల్ సామగ్రిపై 'ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. ఇప్పటి నుండి భారత్ అనే పదాన్నే ఉపయోగించాలని తమకు మౌఖికంగా ఆదేశాలు అందాయని సిబ్బంది తెలిపారు.

దేశంలోని 27 ప్రతిపక్ష పార్టీల కూటమి ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయన్స్)గా ఏర్పడినప్పటి నుండి ఆ పేరుపై బీజేపీ రాద్ధాంతం చేస్తూనే ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ ఓ అడుగు ముందుకు వేసి ఇండియన్ ముజాహిదీన్, ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా తమ పేర్లలో ఇండియాను చేర్చాయంటూ అక్కసు వెళ్లగక్కారు.

ప్రతిపక్షాల ఆగ్రహం

కాగా తనకు కూడా రాష్ట్రపతి భవన్ నుండి ఆహ్వానం అందిందని, అందులో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు బదులు ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని ఉన్నదని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 1ని ఆయన ప్రస్తావిస్తూ రాష్ట్రాల సమాఖ్య దాడికి గురయిందని వ్యాఖ్యానించారు. ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్, ఆర్జేడీ తదితర పార్టీలకు చెందిన ఎంపీలు బీజేపీ ప్రభుత్వంపై మండిపడుతూ ప్రతిపక్ష ఇండియా ...8లో

ఏం చేయాలి?

దేశం పేరును మార్చాలంటే రాజ్యాంగంలోని అధికరణ 1ని సవరించాలి. ఇందుకోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలి. దీనిని సభ ఆమోదించాలి. ఆర్టికల్ 1ని ప్రత్యేకంగా సవరించాలంటే సభకు హాజరైన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది అంగీకరించాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దాం

- తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దాలి
- గురుపూజోత్సవంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- 142 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం
- ఈ'సారీ' సీఎం కేసీఆర్ గైర్హాజరు



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దామని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష ప్రకారం తెలంగాణ బిడ్డలు ప్రపంచంతో ...15లో

వాన ఉధృతి

ప్రాజెక్టుల్లోకి భారీగా వరద



నిజాం సాగర్ పరవళ్లు..

- ప్రవహిస్తున్న వాగులు • పిడుగుపాటుకు ముగ్గురు మృతి
- పంటలకు ఆశాజనకం.. • వ్యవసాయ పనులు ముమ్మరం
- చిత్తడిగా రోడ్లు.. నగరాల్లో ఇబ్బందులు

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం


ఉపరితల ఆవర్తనంతోపాటు ద్రోణి ప్రభావంతో మూడ్రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కొన్ని చోట్ల వ్యవసాయ పనులు ముమ్మరమవ్వగా.. మరికొన్ని చోట్ల పొలాల్లో వరద నిండిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహంతో ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతోంది. ప్రాజెక్టుల గేట్లు తెరుచుకున్నాయి.

చెరువులు నిండుతుండగా.. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఏకధాటిగా వర్షం కురవడం వల్ల రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వర్షంతోపాటు పిడుగులు పడి జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో ముగ్గురు మృతిచెందారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా నిజాంసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో 5 గేట్లు ఎతి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీకి ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు(90.1 టీఎంసీలు) కాగా ప్రస్తుతం అదే స్థాయి నీరు నిల్వ ఉంది.నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతాల నుంచి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతండగా.. ఐదు గేట్లు ఎత్తి అదే స్థాయిలో నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా.. ప్రస్తుతం 1404.52 అడుగుల మేర నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్ట్ ఏఈ శివ తెలిపారు. మెదక్, సంగారెడ్డి ...8లో

వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి

- సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలి పార్టీ శ్రేణులకు సీపీఐ(ఎం) పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాలు పడతాయంటూ వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలనీ, వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరింది. ఈ మేరకు ఆ ...8లో

ఉద్యమం ఉధృతం చేస్తాం..

- ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకునే హక్కు పేదలకే..: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య


నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకునే హక్కు కేవలం పేదలకే ఉందని, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునే కబ్జాదారులకు వత్తాసు పలికే అధికారులకు పేదల గుడిసెలను ...15లో

నిరసనల బాట..బుజ్జగింపుల పాట

నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పరిస్థితి ఇదీ..

- రంగంలోకి ట్రబుల్ షూటర్ • తగ్గేదేలే అంటున్న అసంతృప్త నేతలు



బివిఎన్ పద్మరాజు

'మూడు నిరసనలు.. ఆరు బుజ్జగింపులు...' ఇదీ ప్రస్తుతం బీఆర్ఎస్ పరిస్థితి. సీటు దక్కని వారు, జాబితాలో తమ తమ నియోజకవర్గాల పేర్లు లేని వారు... ఆ పార్టీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. పార్టీ కోసం ఎన్నో ఏండ్లుగా పని చేస్తూ జనంలో ఉన్న నేతలు, సామాజిక పొందికల రీత్యా బలమైన ఓటు బ్యాంకును కలిగున్నామని భావిస్తున్న యువ నాయకులు సైతం ప్రస్తుతమున్న అభ్యర్థులను మార్చి తమకే టిక్కెట్లు ఇవ్వాలని కోరుతున్నారు. కానీ సీఎం కేసీఆర్ వారి మొరను ఆలకించటం లేదు. గోస చెప్పుకుందామంటే వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందుబాటులో లేరు. దీంతో ఆ నేతల్లో కొందరు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఊరూరా తిరుగుతూ తమకు టిక్కెట్ దక్కలేదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళు తున్నారు. తమ ఆవేదనను, ఆక్రందనను వెళ్లగక్కుతున్నారు. వీరిలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి...తనకు సీటు దక్కనీయలేదంటూ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డిపై తీవ్ర ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతున్నారు. ఆయన బీఆర్ఎస్ అధిష్టానంపై కోపంతో ఇటీవల అర్ధనగ్న ప్రదర్శన చేసిన సంగతి విదితమే. పక్కనే ఉన్న స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సీటు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య.. గులాబీ పార్టీపై గుస్సాతో రకరకాల ...8లో

బీజేపీ ఓటమే లక్ష్యం...

- కేరళ స్ఫూర్తితో దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలు
- పేదలకు సంక్షేమ పథకాలు వద్దన్న మోడీని గద్దె దింపాల్సిందే
- ఢిల్లీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి కేరళ ప్రజల విశేష ఆదరణ : బి వెంకట్



కొచ్చి : ఓ పక్క బడా కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలు రాయితీలిస్తూ.. మరోపక్క పేదల సంక్షేమ పథకాలే దేశాభివృద్ధికి ఆటంకమని ప్రచారం చేస్తున్న ప్రధానిని ఇంటికి సాగనంపే ఐక్య ఉద్యమాలను దేశవ్యాప్తంగా చేపడతామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. శ్రామిక ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తున్న కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికి ఆదర్శమని చెప్పారు. ఢిల్లీలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం కేంద్ర కార్యాలయ నిర్మాణానికి కొచ్చిన్‌లో ప్రజల నుంచి విరాళాలు సేకరించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నిధి వసూళ్లలో ఆయన భాగస్వామి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 25 వేల ప్రాథమిక యూనిట్లు కలిగిన కేరళ రాష్ట్రంలో 26 లక్షల సభ్యత్వం ఉన్నది. ప్రతి ప్రాథమిక యూనిట్ నుంచి రూ. 2000 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రతి సభ్యుడు నుంచి రూ.20కు తక్కువ కాకుండా ఆర్థిక సహాయాన్ని కోరుతున్నారు. ఆర్థిక వనరులతో పాటు వ్యవసాయ కార్మికుల ఇండ్లలో ఉన్న పాత వస్తువులను సేకరించాలని కేరళ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుకు అనూహ్యమైన స్పందన వచ్చింది. ప్రతి వ్యవసాయ కార్మికుల ఇండ్లలో ఉన్న పాత న్యూస్ పేపర్లు, మోటార్ సైకిళ్ళు, ఇనుప బీరువా లతోపాటు ఇతర వస్తువులను అందిస్తున్నారు. ఇవి అమ్మటం ద్వారా వచ్చిన నిధిని నుండి రూ. కోటికి ఢిల్లీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అందిస్తామని కేరళ రాష్ట్ర కమిటీ ప్రకటించటం హర్షించదగిన విషయం అన్నారు. ఏ ఒక్క కుటుంబానికి ఆర్థిక భారం కాకుండా సభ్యులందరినీ భాగస్వామిని చేస్తూ ప్రజా ఉద్యమంగా నిధి సేకరణ చేస్తున్నారు.

జీ20 సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అభివృద్ధికి ఆటంకమని చెప్పడం పేదలపై దాడి చేయడమేనని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం , అటవీ హక్కుల చట్టం లను అమలు చేయకుండా నీరు గారిచే కుట్ర చేస్తున్నది అన్నారు. అట్టడుగు వర్గాల హక్కుల కోసం దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలను నిర్వహించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో నాఫ్కో రూ.700 కోట్ల పెట్టుబడి

మంత్రి కేటీఆర్‌తో సమావేశంలో సంస్థ ప్రతినిధుల వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూఏఈ చెందిన సంస్థ నాఫ్కో రాష్ట్రంలో రూ.700 కోట్లతో అగ్నిమాపక సామాగ్రి తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్న ఆ సంస్థ కంపెనీ సీఈవో ఖాలిద్ అల్ ఖతిబ్ వెల్లడించారు. ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ దుబాయ్ పర్యటనలో భాగంగా సదరు కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఖతీబ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీ ని ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో రూ.215 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రముఖ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ గ్రూప్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు అనిల్ మెహతా, డీపీ వరల్డ్ ప్రాజెక్టు డెవలప్మెంట్ డైరెక్టర్ సాలుష్ శాస్త్రి వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రణాళికను మంత్రి సమక్షంలో వారు తెలిపారు. మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేండ్లలో తీసుకొచ్చిన వ్యాపార అనుకూల విధానాలను వారికి వివరించారు. మలబార్ గ్రూప్ సంస్థ చైర్మెన్ ఎంపీ అహ్మద్ రూ.125 కోట్ల పెట్టుబడి పెడతామనీ, రాష్ట్రంలో ఫర్నీచర్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మొత్తంగా మంత్రి దుబాయ్ మొదటి రోజు పర్యటనలో ఆయా కంపెనీలు రూ.1,040 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. సిరిసిల్ల అక్వా క్లస్టర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు లులూ గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆ కంపెనీ పెట్టుబడులతో 500 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపింది. ఆ సంస్థ ఈ ప్రాంతం నుంచి రూ. 1,000 కోట్ల అక్వా ఉత్పత్తులను సేకరించనున్నట్టు వెల్లడించింది.

ఎడిటర్స్ గిల్డ్‌పై ఎఫ్ఐఆర్ రద్దు చేయండి

- డీయూజే డిమాండ్

న్యూఢిల్లీ : ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ)కి వ్యతిరేకంగా మణిపూర్ పోలీసులు నమోదు చేసి న ఎఫ్ఐఆర్‌ను ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే) తీవ్రంగా ఖండిం చింది. ఈ ఎఫ్ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేర కు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మణిపూర్‌లో సుమారు నాలుగు నెలల నుంచి కొనసాగుతున్న హింసాకాండపై ఈజీఐ నిజ నిర్ధారణ బృందం ఇటీవల 24 పేజీలతో కూడిన ఒక నివేదికను వెల్లడించింది. ఈ నివే దికను సవాల్ చేస్తూ ఒక స్థానిక సామాజిక కార్యకర్త చేసిన ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఈ బృందంలోని సభ్యులు సీమా గుహ, సంజయ్‌కపూర్, భరత్ భూషణ్‌తో పాటు ఇజిఐ అధ్యక్షులు సీమా ముస్తాఫాపై ఎఫ్ఐఆర్ నమోదయింది. తటస్థ నిపుణులతో కూడిన ఈజీఐ ఇచ్చిన నివేదిక పక్షపాతమని ఆరోపించడం అసంబద్ధమని డీయూజే ఖండించింది.

టిస్కాబ్‌కు అవార్డులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్‌కు అవార్డుల పంట పండింది. జాతీయ స్థాయిలో 2020-21 ఏడాదికిగానూ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకుకు ప్రథమ బహుమతి, 2021-22 సంవత్సరానికిగాను ద్వితీయ బహుమతితో పాటు సహకార శిక్షణ సంస్థల విభాగంల బ్యాంక్ శిక్షణ సంస్థకు 2020-21, 2021-22 సంవత్సరాలకు ప్రథమ బహుమతులను రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీయ సమైఖ్య (ముంబై) ప్రకటించింది. అదే విధంగా దేశంలోని 351 జిల్లా సహకార బ్యాంకుల్లో కరీంనగర్ జిల్లా సహకార బ్యాంకుకు ఉత్తమ పురస్కారం, దేశంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో చొప్పదండి సంఘానికి ప్రథమ బహుమతి లభించింది. తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ పాలకవర్గ సభ్యులు ప్రెసిడెంట్ కొండూరు రవీందర్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నేతి మురళీధర్ నాయకత్వంలో ఉత్తమ సేవలు అందిస్తున్నామని ప్రజా సంబంధాల విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ తెలిపారు. అవార్డులను సెప్టెంబర్ 26న రాజస్థాన్ రాజధాని జైపూర్ ప్రదాన చేయనున్నట్టు ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

విమోచన దినోత్సవం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే..

- కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ విమోచన దినోత్సవా (సెప్టెంబర్ 17)న్ని గత సంవత్సరం మాదిరిగానే సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. 'మేరీ మాటీ మేరా దేశ్' కార్యక్రమం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓవైసీకి భయపడే సీఎం కేసీఆర్ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం తరుపున అధికారికంగా నిర్వహించడం లేదని చెప్పారు. ఎన్నికల్లో గెలవక ముందు అధికారికంగా నిర్వహిస్తామంటూ ఆయన చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని విమర్శించారు. నైజాం నియంతృత్వం నుంచి విమోచనం జరిగిన రోజు ఉత్సవాలు జరుపుకోలేని దౌర్భాగ్య పరిస్థితిలో మనం ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణ గడ్డపైనా జెండా ఎగురవేశారన్నారు. ఇప్పుడు 70 ఏళ్ల తరువాత తిరిగి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గత ఏడాది జెండా ఎగురేశారని గుర్తు చేశారు.

చేనేతను విస్మరిస్తున్న పాలకులు

మోడీ వచ్చాక సంక్షేమ బోర్డు, పథకాల రద్దు

- సహకార వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలి
- చేనేత బంధు పథకాన్ని అమలు చేయాలి
- 22న హైదరాబాద్‌లో అఖిల భారత చేనేత సదస్సు
- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెరుపల్లి సీతారాములు
- ముగిసిన తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ
- రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా వనం శాంతికుమార్, గంజి మురళీధర్ ఎన్నిక



నవతెలంగాణ- నల్గొండ కలెక్టరేట్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోంది.. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక చేనేత సంక్షేమ బోర్డును రద్దు చేయడమే కాకుండా సంక్షేమ పథకాలను రద్దు చేశారని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెరుపల్లి సీతారాములు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర రెండో మహాసభలో ఆయన మాట్లాడారు. చేనేత జీవన స్థితిగతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఏంటనే విషయాలను చర్చించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కార్మికులు కీలక పాత్ర పోషించారన్నారు. అనేక ఉద్యమాల ఫలితంగా కేంద్రంలో కొన్ని పథకాలను తెచ్చుకున్నామని, బడ్జెట్ రాబట్టుకోవడం కూడా జరిగిందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చేనేత సహకార సంఘాలు ఉండేవని, కేంద్ర ప్రభుత్వం సహకార వ్యవస్థను పూర్తిగా రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సహకార వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు జరపాలని, క్యాష్ క్రెడిట్ ఇవ్వాలని సహకార సంఘాల ద్వారా చేనేత మగ్గాలపై పని కల్పించి సరైన పద్ధతిలో కూలి పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితబంధు లాగానే మగ్గం నేసే ప్రతి కుటుంబానికీ రూ.10 లక్షలు ఇస్తూ చేనేతబంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మగ్గాలకు జియో ట్యాగ్ విషయంలో పునరాలోచన చేయాలని, మగ్గం నేసే వారిని రిజిస్టర్ చేసి చేనేత బంధును అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం చేనేతపై వేసిన జీఎస్టీని వెంటనే ఉపసంహరించుకొని సంక్షేమ బోర్డును, పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. చేనేత సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 22న హైదరాబాద్‌లో నిర్వహించే అఖిల భారత చేనేత సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా గంజి మురళీధర్, గుర్రం నరసింహ, కందగట్ల గణేష్ వ్యవహరించారు. మహాసభ ప్రారంభానికి ముందు చెరుపల్లి సీతారాములు జెండా ఆవిష్కరణ చేశారు.

తీర్మానాల ఆమోదం.. నూతన కార్యవర్గం ఎన్నిక

చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, చేనేత పెట్టుబడి సాయం కోసం దళిత బంధు తరహాలో చేనేత బంధు ప్రకటించి పది లక్షలు ఇవ్వాలని మహాసభలో తీర్మానించారు. చేనేత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం విశాల ఐక్యవేదిక ఏర్పాటు చేసి పోరాటాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ



శాంతి కుమార్



మురళీధర్

రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర అధ్యక్షులుగా వనం శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శిగా గంజి మురళీధర్, కోశాధికారిగా గుండు వెంకట నర్సు, గౌరవ సలహాదారులుగా కూరపాటి రమేష్, బడుగు శంకరయ్య, ఉపాధ్యక్షులుగా గోశిక స్వామి, కూరపాటి రాములు, వనం ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా గుర్రం నరసింహ, చెన్న రాజేష్, జి.భాస్కర్, మరో 13 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాసి కంటి లక్ష్మీనరసయ్య, వర్కల చంద్రశేఖర్, చిలుకూరి లక్ష్మీనర్స్, కర్నాటి బిక్షం, నామని ప్రభా కర్, తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు కుంభం కృష్ణారెడ్డి, గంజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదిక ఎక్కడైనా సరే... భారీగా జనాన్ని సమీకరిస్తాం

- పరేడ్ గ్రౌండ్ కాంగ్రెస్‌కు ఇవ్వకుండా బీజేపీ కుట్ర చేస్తోంది
- ఎల్బీ స్టేడియం ఇస్తారో, లేదో తెలియదు
- రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యలు
- ఐదు హామీలు, మ్యానిఫెస్టో విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ తలపెట్టిన భారీ బహిరంగ సభకు పరేడ్ గ్రౌండ్ ఇవ్వకుండా బీజేపీ కుట్ర చేస్తోందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరవుతున్న వరంగల్ సభను పరేడ్ గ్రౌండ్‌కు మార్చుతున్నట్టు ప్రకటించిందని తెలిపారు. అక్కడ సభ పెడతామంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఈ వ్యవహారం వెనుక బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర దాగుందని ఆరోపించారు. బహిరంగ సభ నిర్వహణకు ఎల్బీ స్టేడియం ఇవ్వాలంటూ అనుమతి కోరామనీ, అది కూడా ఇస్తారో, లేదో తెలియదని వాపోయారు. వేదిక ఎక్కడైనా సరే తమ లక్ష్యం పది లక్షల జనాన్ని సమీకరిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో రేవంత్ అధ్యక్షతన టీపీసీసీ అత్యవసర కార్యవర్గం సమావేశమైంది. తాజా రాజకీయాలు, ఈనెల 16న నిర్వహించబోయే సీడబ్ల్యూసీ సమావేశం, 17న బహిరంగ సభకు జనసమీకరణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో పరిణామాలు వేగంగా మారుతున్నాయన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రమాదపు అంచుకు నెట్టేసిందని విమర్శించారు. 16,17, 18 తేదీల్లో చేపట్ట బోయే పలు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చి ఏర్పాట్లను సమీక్షిస్తారని తెలిపారు. 17న బహిరంగసభలో సోనియా గాంధీ ఐదు హామీలను ప్రకటిస్తారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ పార్టీకి కుట్రదారుగా మారిందని విమర్శించారు. ఎస్పీజీ భద్రత ఉన్న నేతలు వచ్చినప్పుడు విజ్ఞతతో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. రెండవ ఆప్షన్‌గా ఎల్బీ స్టేడియం అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ కుట్ర చేసి అనుమతి ఇవ్వకున్నా.. కార్యక్రమం వాయిదా వేసేది లేదన్నారు. ఓఆర్‌ఎస్ బయట కూడా సభను ఏర్పాటు చేసుకోవడానికి కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు.

కార్యక్రమాలు

- 119 నియోజకవర్గాల్లో 119 మంది కీలక నేతలు పర్యటిస్తారు. ఆయా నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను నియమించాలి.
- ఏఐసీసీ అగ్రనేతలు 17న రాత్రి నియోజక వర్గాలకు వెళ్లి అక్కడే నిద్రించి మరుసటి రోజు ప్రాంతీయ సభల్లో పాల్గొంటారు.
- గతేడాది సెప్టెంబర్ 7న రాహుల్ జోడో యాత్ర ప్రారంభించారు.ఈ నేపథ్యంలో ఈనెల 7న మండల, జిల్లా కేంద్రాల్లో పాదయాత్రలు నిర్వహించాలి. ఉత్సవాలు జరపాలి.
- భారీ జనసమీకరణపై దృష్టి సారించాలి.

బస్టాండ్లు, హోటళ్లు, రెవెన్యూ కేంద్రాలే అడ్డా

- కాంగ్రెస్ వినూత్న సర్వే
- పారదర్శకత కోసం మండలస్థాయి నేతల ఎంపిక
- పకడ్బందీగా ఏఐసీసీ కార్యచరణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల వేళ వివిధ పార్టీలు తమ బృందాలను కిందిస్థాయికి దింపి ఓటర్ల నాటిని పట్టుకునేందుకు ప్రయత్నించడం పరిపాటి. సర్వేల ఆధారంగానే టికెట్ల కేటాయింపులూ జరుగుతాయి. కానీఓటర్ల ఆలోచన విధానంలో వస్తున్న మార్పులను పసిగట్టడంలో సర్వేలు విఫలమవుతున్నాయి. పైకి చెబుతున్నది ఒకటి, వారు ఆచరిస్తున్నది మరొకటి. మొత్తంగా రాజకీయ సర్వేల్లో ఓటరు నాడి అంతకు చిక్కకపోవడంతో రాజకీయ పార్టీల అంచనాలు తప్పి బొక్కబోర్లా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నది. ప్రజలతో మమేకమై ఓటర్ల నాడి పట్టుకునేందుకు వంద మెట్లు దిగుతున్నది. సర్వేల పేరుతో ఏసీ రూముల్లో ఉండి కాలం వృథా చేయకుండా ఓ వినూత్న సర్వేకు ఆ పార్టీ శ్రీకారం చుట్టినట్టు విశ్వసనీయ సమాచారం. అందుకు ఓటర్ టు ఓటర్ కాకుండా బస్టాండ్లు, ఫంక్షన్లు, హోటళ్లు, రెవెన్యూ కార్యాయాలను తన అడ్డాలుగా ఎంచుకున్నది. చివరకు బార్లు, రెస్టారెంట్లను కూడా వదిలిపెట్టడం లేదు. ఎక్కడ ఓ గుంపు కనిపించినా ఆ గుంపులో జొరపడి రాజకీయాలపై చర్చిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా ప్రభుత్వాల నుంచి ప్రజలు ఏం కోరుకుంటున్నారు? బీఆర్‌ఎస్ పాలనలో కొనసాగుతున్న వైఫల్యాలు, వాటి నుంచి గట్టేందుకు రానున్న ప్రభుత్వం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? ఏయే అంశాల్లో బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత ఉన్నదో తెలుసుకునేందుకు సర్వే బృందాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలుస్తోంది. అందుకు పెద్ద పెద్ద నాయకులతో సర్వే చేయించకుండా మండల స్థాయి నాయకులను ఎంచుకున్నది. మూడు రాష్ట్రాల మండలస్థాయి నాయకులను ఏఐసీసీ ఎంపిక చేసి తెలంగాణకు పంపినట్టు సమాచారం. ఉమ్మడి జిల్లాల వారీగా ఆయా టీమ్ లీడర్లు పంచుకుని సర్వేలు చేస్తున్నారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలను కాంగ్రెస్ అధిష్టానం మహారాష్ట్ర బృందానికి అప్పజెప్పింది. మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ బాధ్యతలను కర్నాటక టీమ్ తీసుకుంది. ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల బాధ్యతలు కేరళ బృందం తీసుకుంది. ఆ బృందాలకు తెలుగు అనువాదాలకు జత చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ విషయాన్ని ఏఐసీసీ అత్యంత రహస్యంగా ఉంచింది. సర్వేల నివేదికలను ఎప్పటికప్పుడు అధిష్టానానికి నేరుగా పంపేందుకు ఏర్పాట్లు చేశారు. వాటి ఆధారంగా రాష్ట్ర కాంగ్రెస్‌కు అధిష్టానం మార్గనిర్దేశం చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎప్పటికప్పుడు రాష్ట్ర నాయకులు ఫీడ్ బ్యాక్ తీసుకుంటూనే, క్షేత్రస్థాయి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బండికి హైకోర్టు జరిమానా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు హైకోర్టు జరిమానా విధించింది. రాష్ట్ర మంత్రి, కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ ఎన్నికను సవాల్ చేసిన కేసులో అడ్వొకేట్ కమిషనర్ ఎదుట హాజరై సాక్ష్యం చెప్పకుండా గడువు కోరడంతో రూ.50 వేలు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని సైనిక సంక్షేమ నిధికి చెల్లించిన తర్వాతే కమిషనర్ ఎదుట హాజరై సాక్ష్యం చెప్పాలని ఆదేశించింది. ఇప్పటికే గడువు కోరారనీ, మళ్లీ ఇప్పుడు గడువు కోరడంతో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. ఎన్నికల పిటిషన్‌లో విచారణను ముగిస్తామని హెచ్చరిక చేసింది. ఈ నెల 12న హాజరవుతారని బండి తరపున లాయర్ చెప్పడంతో ఈసారికి మాత్రమే అనుమతిస్తున్నట్టు జస్టిస్ సుమలత చెప్పారు.

2018 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి గంగుల కమలాకర్ టీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో గంగుల వాస్తవాల్ని దాచిపెట్టారనీ, ఆ ఎన్నిక చెల్లదంటూ తీర్పు ఇవ్వాలని కోరుతూ ఆయనపై బీజేపీ తరపున పోటీ చేసిన బండి సంజయ్ పిటిషన్ దాఖలు చేశారు. సాక్షుల విచారణ కోసం అడ్వొకేట్ కమిషనర్‌గా రిటైర్డ్ జడ్జి శైలజను హైకోర్టు నియమించింది.

వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి

సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలి

- పార్టీ శ్రేణులకు సీపీఐ(ఎం) పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారీ వర్షాలు పడతాయంటూ వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలనీ, వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని పేర్కొన్నారు. అనేక బస్తీలు మునిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలు కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థుల హాస్టళ్లకు నీరు చేరడంతో ఖాళీ చేయించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. చాలా ప్రాంతాల్లో మోకాలిలోతు నీరు నిలిచిపోయి ట్రాఫిక్ అస్తవ్యస్తమైందని పేర్కొన్నారు. చెరువులు, నాలాలు కబ్జాలకు గురికావడం, ప్రభుత్వానికి దీర్ఘకాలిక దృష్టి లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు. డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చినపుడు హడావుడి చేయడం కాకుండా ముంపు నివారణకు శాశ్వత పరిష్కార మార్గాల పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా చూడాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోను, ఇతర జిల్లాల్లోను పార్టీ నాయకత్వం, శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి, సహాయక కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలి

- సెస్ డబ్బులు కార్మికుల సంక్షేమానికే ఉపయోగించాలి
- తెలంగాణ భవన ఇతర నిర్మాణ వర్కర్స్ ఫెడరేషన్ నేతల డిమాండ్
- కార్మిక శాఖ కార్యాలయం వద్ద మహాధర్నా
- వెల్ఫేర్ బోర్డు సెక్రటరీ గంగాధర్‌కు వినతిపత్రం



నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులకు వెంటనే మోటార్ సైకిళ్లు ఇవ్వాలని తెలంగాణ భవన, ఇతర నిర్మాణ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దఎత్తున భవన నిర్మాణ కార్మికులు హైదరాబాద్ చిక్కడపల్లిలోని అంజయ్య భవన్ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మహాధర్నా చేశారు. వెల్ఫేర్ బోర్డు సెక్రటరీ గంగాధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరి రాములు, అధ్యక్షులు సుంకర రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి కోటంరాజు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడారు.

రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో 25 లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు కోసం సీఐటీయూ, ఇతర అనుబంధ సంఘాలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా 1996లో కార్మిక వెల్ఫేర్ బోర్డు చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం ఆధారంగా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉందన్నారు. కార్మికులు కష్టపడి బిల్డింగులు కడితే సెస్ ద్వారా రూ.4,300కోట్లు వసూలు చేశారని, అందులో కార్మికుల సంక్షేమానికి నామమాత్రమే ఖర్చు పెడుతున్నారని చెప్పారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.ఆరు లక్షల ముప్పై వేలు చెల్లిస్తున్నారని, దానిని పది లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సహజ మరణం చెందిన కార్మికులకు సంబంధించి ఆ కుటుంబానికి లక్ష రూపాయలు ఇస్తున్నారని దానిని ఐదు లక్షలకు పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా కార్మికుల శ్రమను గుర్తించి వారికి మోటార్ సైకిళ్లు అందిస్తామని హామీ ఇచ్చిందని, రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు హామీ అమలు చేయలేదని అన్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికుల పిల్లల చదువుకు రెండు లక్షల స్కాలర్‌షిప్ అందించాలని కోరారు. కార్మికుల డబ్బులను కార్మికుల సంక్షేమానికే ఖర్చు పెట్టాలని, అందుకు వెల్ఫేర్ బోర్డులో అడ్వైంచర్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్మిక నిధులు అడ్వైంచర్ కమిటీ ద్వారా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు తంబ్ సిస్టం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తంబ్ సిస్టంతో పాటు ఐ-సిస్టం ఏర్పాటు చేయాలని, తద్వారా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ ప్రకారం 25 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్స్. 7లక్షల మంది మహిళా కార్మికులకు స్కూటీలు వెంటనే అందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మహాధర్నాలో వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన కార్మికులు పాల్గొన్నారు

అదానీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

దేశంలో పెరుగుతున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం

- ప్రభుత్వ పెద్దల మద్దతుతోనే అదానీ స్వైరవిహారం
- కేంద్ర ప్రభుత్వ పాలసీలతో పేదలపై భారం
- 'అదానీ కుంభకోణం - ప్రధాని మౌనం' వెబినార్‌లో ప్రొ.అరుణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదానీ అడ్డదారి వ్యాపారాలపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు రంగు బైటపడుతుందని జెఎన్‌యు రిటైర్డ్ ప్రొఫెసర్ అరుణ్ కుమార్ అన్నారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన అదానీ కుంభకోణాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ సరిపోదని ఆయన చెప్పారు. కేంద్రంలోని ప్రభుత్వ పెద్దల మద్దతుతోనే దేశం లోపల, వెలుపల అదానీ కంపెనీ అడ్డగోలుగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వరంగ ఆస్తులను కారుచౌకగా కొల్లగొడుతుందని పేర్కొన్నారు. 'అదానీ కుంభకోణం - ప్రధాని మౌనం' అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వెబినార్‌లో ప్రొ. అరుణ్ కుమార్ మాట్లాడారు.

బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ కంపెనీ వ్యాపారం బొగ్గు, విద్యుత్, గ్యాస్, రోడ్లు, విమానాశ్రయాలకు భారీగా విస్తరించిందనీ, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో అత్యధికం అదానీకే దక్కుతున్నాయని అరుణ్ కుమార్ తెలిపారు. హిడెన్ బర్గ్ నివేదిక బహిర్గతమైన తర్వాత అదానీ షేర్లు భారీగా పడిపోయిన సమయంలో కూడా ఆ కంపెనీ పబ్లిక్ ఆఫర్ ప్రకటిస్తే ఊహించనివిధంగా స్పందన వచ్చిందన్నారు. దీని వెనక ఏ చీకటి శక్తులున్నాయో నిగ్గు తేల్చడంలో నిఘా సంస్థలు సమర్థవంతంగా పనిచేయలేదని ఆరోపించారు. చిన్న కంపెనీలపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి వాటిని అదానీ కంపెనీకి కారుచౌకగా విక్రయించేలా చీకటి వ్యాపారం జరుగుతోందని, దాని వెనక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నదని బలమైన వాదనలు వినిపిస్తున్నాయని చెప్పారు. నల్లధనం విదేశాలకు తరలించి దాన్ని తిరిగి మనదేశానికి తీసుకొచ్చి విదేశీ పెట్టుబడిగా అదానీ కంపెనీలు చూపుతున్నాయని పేర్కొన్నారు. అదానీ షేర్ల విలువ కృత్రిమ పెరుగుదలలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయనీ, దానికి బ్యాంకులను కూడా వాడుకుంటున్నారని వివరించారు. రాజకీయ నేతలు, పెట్టుబడిదారుల అపవిత్ర కూటమితో ఆశ్రిత పెట్టుబడి దారీ విధానం దేశంలో పేట్రేగిపోతోందనీ, పెట్టుబడిదారి వర్గాలకు అనుకూలంగా ప్రభుత్వ పాలసీలను రూపొందిస్తున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఏ దేశానికి వెళ్లినా ఆదేశాల నుంచి ఆస్తులు కారుచౌకగా అదానీకి దక్కుతున్నాయనీ, ఆస్ట్రేలియా, ఇజ్రాయేలు, శ్రీలంక, ఇండోనేషియా దేశాల నుంచి అదానీకి దక్కిన కాంట్రాక్టుల్లో అదే నిజమైందని చెప్పారు. అదానీ పోర్టులో వేల కోట్ల విలువైన డ్రగ్స్ దొరికితే దానిపై విచారణ సంస్థలు నిగ్గుతేల్చలేదన్నారు. కేంద్ర పెద్దలతో ఉన్న దగ్గర సంబంధాల వల్లే అదానీ అక్రమ వ్యాపారాల్లో స్వైరవిహారం చేస్తున్నారని విమర్శించారు.



హిడెన్‌బర్గ్ నివేదిక బయటకు రావడంతో అదానీ షేర్లు రూ. 2700 పడిపోతే..ఆసమయంలోనే ఆ కంపెనీ ఎఫ్‌బివో(పబ్లిక్ ఆఫర్) ఓపెన్ చేస్తే జిందాల్, ఎయిర్‌టెల్, ఇతర మార్కెట్ పెద్దలు ఆ షేర్లను రూ. 3200 కొనుగోలు చేసి అదానీకి రూ.20వేల కోట్లు కూడబెట్టారని తెలిపారు. అదానీ ఎఫ్‌బివో జయప్రదం అయిందని చెప్పుకునేందుకే ఇండియా కార్పోరేట్ కంపెనీలపై ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. ఇదంతా జరిగిన తర్వాత కూడా అదానీకి మేలు చేసేలా ఎఫ్‌బివో రద్దు చేశారని గుర్తు చేశారు. అదానీ అక్రమ వ్యవహారాలు దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంపై ప్రభావం చూపుతున్నా నిఘా, విచారణ సంస్థలు ఎందుకు మౌనంగా ఉంటున్నాయో ఆలోచన చేయాలన్నారు. దేశానికి విదేశీ పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. కేంద్ర విధానాలు పేదలపై పెను భారం మోపుతున్నాయనీ, పెట్టుబడిదారుల ఆస్తులు పెరగడానికే అవి దోహద పడుతున్నాయని వివరించారు. దేశ ప్రజల సంపదనంతా కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నం వేగంగా జరుగుతోందనీ, దీనివల్ల చిన్న మధ్యతరగతి సన్నకారు కంపెనీలు దివాలాతీసి పెద్ద కంపెనీలు బలపడుతున్నాయన్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్ల వల్ల చిన్న వ్యాపారులు దెబ్బతింటున్నారని చెప్పారు. అసంఘటిత రంగాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదనీ, కేంద్రం చెప్పే ఆర్థిక లెక్కలన్నీ కల్పితాలేనని ప్రొ.అరుణ్ కుమార్ వెల్లడించారు. ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ వెబినార్‌ను సమన్వయం చేశారు.

పంచాయతీ, మున్సిపల్ శాఖలతో సమన్వయం

- కేసులెక్కువగా ఉంటే ఓపీ సేవలు పెంచాలి
- ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి : వర్షాల నేపథ్యంలో మంత్రి హరీశ్ రావు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పెరగకుండా నివారణకు పంచాయతీ, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆశాలు, ఏఎన్‌ఎంలు, మెడికల్ ఆఫీసర్లతోమంత్రి నెలవారీ సమీక్ష టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కాన్ఫరెన్సులో హెల్త్ సెక్రెటరీ రిజ్వీ, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ శ్రీనివాసరావు, అన్ని జిల్లాల డీఎంహెచ్వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అన్ని స్థాయిల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనీ, వైద్యసేవలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలనీ, డెలివరీ డేట్‌కు ముందుగానే గర్భిణులను ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. పాము, కుక్కకాటుకు మందులను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఆగస్టులో ప్రభుత్వాస్పత్రుల్లో రికార్డు స్థాయిలో 76.3 శాతం డెలివరీలు జరిగాయని మంత్రి తెలిపారు.

నేత్రదానానికి ముందుకు రండి

అంధత్వ నివారణలో భాగస్వాములు కండి : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో డాక్టర్ రాజలింగం

- డాక్టర్లు, నర్సులు, వైద్యవిద్యార్థులు, ఆప్టోమెట్రిస్టుల నేత్రదాన ప్రతిజ్ఞ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్, ప్రొఫెసర్ వి.రాజలింగం పిలుపునిచ్చారు. ప్రజలు భాగస్వాములైతేనే అంధత్వ నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. 38వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం హైదరా బాద్‌లోని సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో నిర్వహించిన నేత్ర దాన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 150 మంది డాక్టర్లు, నర్సులు, వైద్యవిద్యార్థులు, అప్టోమెట్రిస్ట్‌ల చేత నేత్రదానం చేస్తామని రాజలింగం ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం నేత్రదానానికి ముందుకు వచ్చిన వారి నుంచి రాతపూర్వక సమ్మతిని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 25న ప్రారంభమైన పక్షోత్సవాలు సెప్టెంబర్ 8తో ముగుస్తాయని వెల్లడించారు.

నేత్రదానం చేయ కుండా ప్రజల్లో నెలకొన్న మూఢ నమ్మకాలు, సాంస్కృతిక, సంప్రదాయిక అడ్డంకులను అధిగమించేలా ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్టు తెలిపారు. ర్యాలీలు, వైద్య విద్యార్థుల్లో క్విట్, వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, పోస్టర్ తదితర విభాగాల్లో పోటీలు పెట్టి ప్రోత్సహించినట్టు తెలిపారు. ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 8న నేత్రదానంపై అవగాహన కల్పించే స్కిట్ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. సరోజినీ దేవి కంటి ఆస్పత్రిలో నేత్రదానం కోసం రెండేండ్ల నుంచి రెండు వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. అయితే ఈ ఏడాది 56 మంది నేత్రదానం చేయగా 52 మందికి కంటిచూపు వచ్చిందని తెలిపారు.

ఏడాదికి 2.50 లక్షల కార్నియాలు అవసరం

ప్రతి ఏడాది కంటిపొరల (కార్నియా) మార్పిడి ద్వారా చికిత్స పొందేందుకు 2.50 లక్షల మంది ఎదురు చూస్తున్నారని సరోజినీ దేవి కంటి ఆస్పత్రి కార్నియా విభాగం అధిపతి డాక్టర్ కేశవరావు తెలిపారు. అయితే ప్రతి ఏడాది సేకరిస్తున్న కార్నియాల సంఖ్య 25 వేల నుంచి 30 వేలు మించడం లేదని చెప్పారు. రాష్ట్రంలో కార్నియాలు అవసరమైన వారి సంఖ్య దాదాపు 50 వేల పైచిలుకు ఉంటుందని చెప్పారు. పుట్టిన బిడ్డ మొదలు 90 ఏండ్ల ముసలివారి వరకు ఎవరైనా నేత్రదానం చేయవచ్చని సూచించారు. హెచ్ఐవీ, క్యాన్సర్ రోగులు, రెటీనా పాడైపోయిన వారు తప్ప నేత్రదానానికి అందరూ అర్హులేనని స్పష్టం చేశారు. నేత్రదానం చేస్తే రెండు జీవితాలు జీవించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మోదినీ, ఆర్ఎంఓలు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ నజాఫీ బేగం, డాక్టర్ మాలతి క్రిస్టీనా తదితరులు పాల్గొన్నారు.

- డాక్టర్, ప్రొఫెసర్ కేశవరావు

సంపాదకీయం

అన్నీ మాటలే

మహిళా అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుందని మన ప్రధాని అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలో చెబుతుంటాడు. మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఊదరగొడుతుంటాడు. చెబుతున్నట్టుగానే గత దశాబ్ద కాలంలో మహిళల భద్రత కోసం ప్రభుత్వం అనేక పథకాలు, చట్టాలు

> మహిళల కోసం ఎన్నో పథకాలు, చట్టాలు, కార్యక్రమాలు చేపడుతున్నామని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పకుంటున్నది. ఆచరణలో ఏమాత్రం చిత్తశుద్ధిని చూపటం లేదు. వాటికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదు. నిర్భయ, సంబల్ వంటివి మహిళలకు భద్రతను అందిస్తాయనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. కావాల్సిందల్లా వీటి అమలులో చిత్తశుద్ధి. ప్రభుత్వం వీటికి అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు వాటిని సరిగా ఖర్చు చేయడంపై దృష్టి సారించాలి. గతంలో జరిగిన పొరబాట్లను గుర్తించి వాటిని సరిచేయాల్సిన అవసరం ప్రభుత్వంపైనే ఉంది.

ప్రవేశపెట్టింది. నిర్భయ, బేటీ బచావ్ బేటీ పఢావ్, నారీ అదాలత్, మహిళా పోలీస్ వాలంటీర్, ఉమెన్స్ హెల్ప్‌లైన్, వన్ స్టాప్ సెంటర్ ఇవన్నీ ఇందులో భాగంగా తెచ్చినవే. కానీ ఇవేవీ అమలుకు నోచుకోవడమూ లేదు. వీటిలో దేనికీ అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంలేదని తాజా లెక్కలు చెబుతున్నాయి. ఇక మహిళా భద్రత, ఆమె అభివృద్ధి, దేశ పురోగతి ఎలా సాధ్యమో మోడీనే చెప్పాలి.


మహిళల కోసం ప్రత్యేక పోలీస్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు 'నిర్భయ' పేరిట కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. ఏడాది కేడాది కేటాయింపుల్లో బీజేపీ ప్రభుత్వం దీనికి కోతలు పెడుతూనే ఉంది. పోనీ కేటాయించిన నిధులనైనా సరిగా ఖర్చు చేస్తున్నారా అంటే అదీలేదు. ఈ ఏప్రిల్ 23 నాటికి ఈ నిధికి రూ.12,008.5 కోట్లు దీని కోసం కేటాయించారు. కానీ రూ.4,923 కోట్లు మాత్రమే విడుదల చేశారు. అందులోనూ రూ.2,521 కోట్లే ఖర్చు చేశారు. అంటే విడుదల చేసిన నిధులలో సగం మాత్రమే ఖర్చు పెట్టారు.



ఇక మహిళల రక్షణ, సాధికారత కోసమంటూ మోడీ ప్రభుత్వం 'వన్ స్టాప్ సెంటర్' పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించింది. దీనికి రూ.160 కోట్లు ఖర్చు చేసింది. అయితే దీన్ని ఆ తర్వాత మహిళా భద్రత కోసం తెచ్చిన మిగిలిన అన్ని పథకాలతో కలిపేసింది. వీటన్నింటినీ కలగలిపి గత ఏడాది 'సంబల్' అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని కోసం రూ.587 కోట్లు కేటాయించారు. ఖర్చు చేసింది మాత్రం రూ.183 కోట్లు. తర్వాతి ఏడాది ఈ కేటాయింపులను కూడా కుదించారు. పథకాలన్నీ కలగలిపి ఉండటంతో ఏ పథకానికి ఎంత కేటాయించారో, ఎంత ఖర్చు చేస్తున్నారో అంతుపట్టడం లేదు. అంతేకాదు పథకాల అమలుపై అధికారులు కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ(నల్సా) ఆ మధ్యకాలంలో న్యాయస్థానానికి ఓ నివేదికను సమర్పించింది. దీని ప్రకారం గృహహింస చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా 11.93లక్షల కేసులు నమోదయ్యాయి. గత ఏడాది ఆగస్టు నాటికి వాటిలో 4.71లక్షల కేసులు పెండింగులో ఉన్నాయి. బాధిత మహిళలకు సకాలంలో న్యాయం అందడంలేదని ఈ లెక్కలు చూస్తే అర్థమవుతోంది.

ఇలా ఎన్ని పథకాలు, చట్టాలు తెచ్చినా మహిళలకు రక్షణ కల్పించలేకపోతున్నారు. ఆడపిల్ల పట్ల వివక్ష రూపుమాపలేకపోతున్నారు. లింగపరమైన అసమానత గత ఏడాది ప్రపంచ సూచీలో 146దేశాలకు గానూ మన దేశం 135వ స్థానంలో ఉంది. అంటే మన దగ్గర అసమాతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక సమానపనికి సమాన వేతనమనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు పెచ్చరిల్లుతున్నాయి. 'వికీ' (ఉమెన్స్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండ్రస్టీ) అధ్యయనం ప్రకారం భారతీయ ఉద్యోగినుల్లో యాభై శాతానికిపైగా మగాళ్ళ వికృత చేష్టలకు గురవుతున్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి పదేండ్ల కిందట పురుడు పోసుకున్న ప్రత్యేక చట్టం క్షేత్రస్థాయిలో వట్టిపోతోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో తాజా నివేదిక ప్రకారం ప్రతి లక్ష జనాభాలో మహిళలపై నేరాల రేటు 2020లో 56.5 ఉంటే 2021లో 64.5కు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2021లో మహిళలపై లైంగిక దాడులు, సామూహిక లైంగిక దాడులకు పాల్పడటంతో పాటు వారిని హతమార్చిన ఘటనలు 293 జరిగాయి. ఇలా దేశంలో మహిళలపై అకృత్యాలు, అఘాయిత్యాలు, వేధింపులు పెరిగి పోతున్నాయి. లైంగిక వేధింపుల కేసులు భారీగానే నమోదవు తున్నాయి. అంతేకాదు ఎక్కడ ఎలాంటి విచ్ఛిన్నకర సంఘటనలు జరిగినా మొదట బలవుతోంది మహిళలే. మణిపూర్ మారణ హోమంలో ఎంత మంది మహిళలు బాధితులుగా మారారో చూశాం. వీటిపై ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించిందే లేదు.

మహిళల కోసం ఎన్నో పథకాలు, చట్టాలు, కార్యక్రమాలు చేపడుతున్నామని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఆచరణలో ఏమాత్రం చిత్తశుద్ధిని చూపటం లేదు. వాటికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదు. నిర్భయ, సంబల్ వంటివి మహిళలకు భద్రతను అందిస్తాయనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. కావాల్సిందల్లా వీటి అమలులో చిత్తశుద్ధి. ప్రభుత్వం వీటికి అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు వాటిని సరిగా ఖర్చు చేయడంపై దృష్టి సారించాలి. గతంలో జరిగిన పొరబాట్లను గుర్తించి వాటిని సరిచేయాల్సిన అవసరం ప్రభుత్వంపైనే ఉంది. మహిళా భద్రత అనేది మాటల్లో కాదు చేతల్లో చూపించాలి. అప్పుడే మహిళల కోసం రూపొందించిన పథకాలు, కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తాయి.



నిశ్శబ్ద శక్తిరూపం... పుస్తకం!

పుస్తకం హస్తభూషణమే కాదు మస్తిష్క వికాసం కూడా అని మనకు తెలుసు. పుస్తక పఠనం ఓ చక్కని అలవాటు. జ్ఞాన భాండాగారంగా పూజించబడే పుస్తకాలను సరస్వతి రూపాలుగా కొలుస్తాం. పుస్తకం విశ్వాన్ని పరిచయం చేస్తుంది, వింతలు, విడ్డూరాలను విప్పి చూపుతుంది. పుస్తకం మానవాళి మేధోశక్తిని పోషిస్తుంది. పుస్తకం అక్షరాల కుప్ప కాదు, జ్ఞాన జ్యోతిని వెలిగించే ఇంధనం. పుస్తకం మనో నేస్తం, సమాజోద్ధరణకు ఊతం. ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, నూతన ఆవిష్కరణాగ్నికి ఆజ్యం పోసేది పుస్తక పఠనమే. లోక రీతు, శాస్త్ర ప్రగతులు, సాంకేతిక జిలుగులు, అజ్ఞానాన్ని పారద్రోలే మహోజ్వల వెలుగులను నింపగల మహాశక్తివంతమైంది పుస్తకమే కదా! జ్ఞాన లోతులను పరిచయం చేస్తూ, ప్రపంచ సమస్యలకు సరైన సమాధానం ఇవ్వగల మేధో నిధి పుస్తకమే. పుస్తక ప్రాధాన్యతను గుర్తించి పుస్తక పఠనానికి జీవనశైలిలో సింహభాగం కేటాయించడాన్ని ప్రోత్సహించే కృషిలో భాగంగా ప్రతి యేటా 06 సెప్టెంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా "జాతీయ పుస్తక పఠన దినోత్సవం (నేషనల్ రీడ్ ఏ బుక్ డే)" పాటించుట జరుగుతోంది.

గ్రంథాలయాల సందర్శన, వ్యక్తిగత గ్రంథాలయాన్ని నిర్మించుకోవడం, పుస్తక పఠన సంఘాలను ఏర్పాటు చేసుకోవడం, విలక్షణ పుస్తకాల సేకరణ చేసే అభిరుచిని కలిగి ఉండడం, స్నేహితులు పుస్తకాలను మార్చుతుంటూ చదువుకోవడం, పుస్తక పఠన ప్రాధాన్యతలను వివరించడం, పుస్తక పఠన పోటీల నిర్వహణ, పాఠశాలల్లో పుస్తక పఠనాన్ని ఆదరించడం, పుస్తకాన్ని జీవితకాల నేస్తంగా భద్రపరుచుకోవడం లాంటి అంశాలను జాతీయ పుస్తక పఠన దిన వేదికల్లో విద్యార్థుల ముందు చర్చించాలి. 1990లో హోవర్డ్ బెర్గ్ రికార్డు స్థాయిలో నిమిషానికి 25వేల పదాలు చదవడంతో అత్యంత వేగంగా చదివిన వ్యక్తిగా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నారు. సాధారణ పాఠకులు నిమిషానికి 300 వరకు పదాలు చదువగలుగుతారు. అన్నీ జోన్స్ అనబడే పాఠకురాలు హారీ పోట్టర్ పుస్తకాన్ని నిమిషానికి 4,200 పదాల వేగంతో 47 నిమిషాల్లో చదివి ప్రపంచ పఠన బహుమతిని గెలుచుకున్నారు. మన పిల్లలు ఘనకార్యం చేసినప్పుడు ఓ మంచి పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడాన్ని తల్లిదండ్రులు పాటించాలి. పుస్తక పఠనాభిరుచితో మేధో వ్యాయామం జరిగి చురుకుగా తయారవుతారు. వాడవాడలా పుస్తక క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. పుస్తకాలు అపూర్వ వినోద, విజ్ఞాన కోవెలలుగా భావించబడాలి. పుస్తకాన్ని పది మందికి అందుబాటులో ఉంచుట ద్వారా విజ్ఞాన వితరణకు దోహదపడిన వారమవుతాం. అది జ్ఞాపకశక్తిని పెంపొందించుట, ఏకాగ్రతను సాధించుట, మానసిక ఒత్తిడిని కలిగించకుండా చేస్తాయి. ఇంకా జీవన సంక్లిష్టతలను అధిగమించడం, మేధావిగా రాణించడం, సృజనను పెంపొందించడం, జ్ఞాపకశక్తిని పెంచడం, అజ్ఞానాన్ని తరిమేయడం పుస్తక పఠనంతో కలుగుతాయి. జీవన లక్ష్యాలను అధిగమించడం, జీవనోపాధిని పొందడం, కుటుంబ సభ్యులను విద్యావంతులుగా మార్చడం, సహానుభూతిని పోషించడం, నిద్ర సమస్యలు తొలగడం వంటివి జరుగుతుతాయి. విద్యావంతుడిగా గుర్తింపు పొందడం, మెదడు చురుకుదనం పెరగడం, ప్రేరణ కలిగించడం, నైపుణ్యాలను పొందడం, పలు ప్రశ్నలకు సమాధా నాలు లభించడం, మంచి స్నేహితులను పొందగలగడం లాంటి అనేక ప్రయోజనాలు ఉంటాయి.

నేటి నానో, డిజిటల్ విప్లవయుగంలో పుస్తక పఠనాభిరుచి పలుచబడుతోంది. చదవడం మానేసి టీవీ, గూగుల్ సైట్స్ చూసే కల్చర్‌ను అలవర్చుకుంటున్నారు. బుక్ కల్చర్‌ను నిర్లక్ష్యం చేస్తూ లుక్ కల్చర్‌కు అలవాటు పడుతున్నారు. గూగులమ్మ కన్న పుస్తక సరస్వతే మిన్న అని విద్యార్థులకు వివరించాల్సిన అవసరం ఉంది. దాన్ని ఎంతవరకు ఉపయోగిం చాలో అంతవరకు ఉపయోగించాలి. కానీ ఎక్కువసేపు పుస్తక పఠనం చేయాలి. జ్ఞాన సంపదను తరతరాలకు అందజేస్తున్న పుస్తకాలు మనకు అపూర్వ ఆస్తులుగా నిలపాలి. పుస్తకాన్ని నమ్మినవారు, పుణీతులైనారు. అక్షరాలు కొలువైన పుస్తకాలు సమాజ ప్రగతిరథాలుగా మారాలి. ప్రపంచ మానవాళిని అక్షరాస్యులుగా, విద్యా వంతులుగా మార్చగలిగే నిశ్శబ్ద శక్తిరూపం పుస్తకమే అని గమనించి పుస్తక పఠనాన్ని మహాయజ్ఞంగా కొనసాగించాలి.

(నేడు 'జాతీయ పుస్తక పఠన దినం')

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

మన క్షిపణులు చైనాను భయపెడతాయా?

చంద్రయాన్-3 విజయవంతం కావటంతో యావత్ దేశం మన ఇస్రో శాస్త్రవేత్తలను వేనోళ్ల కొనియాడు తున్నది. ఊరందరిదీ ఒక దారైతే ఉలిపికట్టెది మరో దారి అన్న సామెత తెలిసిందే. మన ఇస్రో విజయాన్ని కూడా మతకళ్లతో చూసే బాపతు రెచ్చిపోతున్నది. మన దేశంలో మిసైల్ మహిళగా పేరు తెచ్చుకున్న కేరళకు చెందిన టెసీ థామస్ గురించి సామాజిక మాధ్యమంలో తాజాగా ఒక పోస్టును పెట్టారు. యునైటెడ్ బ్రాహ్మిన్స్ ఫ్రెండ్స్(ఆల్ ఇండియన్ బ్రాహ్మిన్ కమ్యూనిటీస్)కు చెందిన ఒకరు పెట్టిన ఆ పోస్టులో ఉన్న అంశం ఏమంటే అగ్ని క్షిపణి రూపకర్త టెసీ థామస్ అనీ ఆమె నుదుట బొట్టు, దాని మీద చిన్న గంధపు గీత ఉందని రాశారు. ఆమె క్రిస్టియన్ అయిన ప్పటికీ హిందూ సాంప్రదాయాన్ని పాటిస్తున్నట్లు చెప్పటం దీని లక్ష్యం. క్షిపణి రూపకర్తలలో ప్రముఖురాలు ఆమె అనటంలో ఎవరికీ పేచీ లేదు. అందరూ అభినందించాల్సిన అంశమే. బీజేపీ ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు పొందిన కంగన రనౌత్ చంద్రయాన్-3 విజయం గురించి స్పందించారు. అందరికీ ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభ పాటవాలు కనిపిస్తే ఆమె వేరే విధంగా చూశారు. మహిళా శాస్త్రవేత్తలు ఉన్న ఒక ఫొటోను తన ఇనస్టాగ్రామ్‌లో పోస్టు చేసి వారంతా బిందీ, సింధూరాలు, తాళిబొట్లు ధరించి ఉన్నారని, ఉన్నత ఆలోచనలు, సాధారణ జీవితాల భారతీయతకు ప్రతీకలని పేర్కొన్నారు. ఇలా చెప్పటం ద్వారా బొట్టు లేనివారు కాదని ఆమె జనాలకు సందేశం ఇవ్వదలచుకున్నారు. దాని తరువాతే టెసీ థామస్ బొట్టు, చందనం గురించి బ్రాహ్మణ సంఘాలు పోస్టు పెట్టాయి. రెండవ అంశం ఏమంటే 145 కోట్ల చైనీయుల గుండెల్లో భయం పుట్టించిన మహిళ అని చెప్పారు. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అణువార్ హెడ్‌తో చైనాలోని ఏ ప్రదేశాన్నైనా కచ్చితత్వంతో ఢీకొట్టగల అగ్ని-5 క్షిపణి రూపకర్త టెసీ థామస్ అని రాశారు.(ఆమె క్రిస్టియన్ అయినప్పటికీ బ్రాహ్మణ క్రైస్తవురాలని, అందుకే బ్రాహ్మణ సంఘాలు ఆమె గురించి రాసినట్లు సామాజిక మాధ్యమంలో కొందరు స్పందించారు) ఆ క్షిపణిని 2018లోనే పరీక్షించారు, మిలిటరీకి అందచేశారు, ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఏమిటి?

> ఏ దేశమైనా మిలిటరీ ఖర్చును పెంచి అది జనాల మీద భారం,జీవితాలు మెరుగుపడే అవకాశం లేదన్నది అనేక దేశాల అనుభవం చెబుతున్నది. ఉగ్రవాదం కారణంగా పక్కనే ఉన్న శ్రీలంక తన వనరులన్నింటినీ ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు గాను మిలిటరీని విపరీతంగా పెంచింది. ఉగ్రవాదులను నిర్మూలించినా వెంటనే దాని మిలిటరీ ఖర్చు వెంటనే తగ్గదని తేలింది. మనతో గిల్లికజ్జాలు పెట్టుకొనే పాకిస్థాన్ తలసరి ఖర్చు మనకంటే ఎక్కువే. అది ఇప్పుడు ఆర్థికంగా ఎంత దివాళా తీసిందో, ఎన్ని ఇబ్బందులు పడుతున్నదో చూస్తున్నదే.

"అన్నీ వేదాల్లోనే ఉన్నాయష" అని చెప్పిన వారే ఇప్పుడు శాస్త్రవేత్తలకు మతం, కులం ఆపాదించుతున్న తీరును చూస్తున్నాం. వారిలో ఎవరైనా బొట్టు పెట్టుకోలేదో దేశవ్యతిరేక మతాల ముద్రవేస్తారు. వాటిని పక్కన పెడితే చంద్ర యాన్ విజయం, అగ్ని క్షిపణితో మన మిలిటరీ సామర్థ్యం పెరుగుతుందన్నది స్పష్టం. కానీ చైనీయులకు భయం పుట్టించిందని చెప్పటం అవసరమా? అసలది నిజమా? అతిశయోక్తులు మాత్రమే. అంతరిక్ష ప్రయోగాల్లో మనం ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది, క్షిపణుల రంగంలోనూ అదే పరిస్థితి. తాజా సమాచారం ప్రకారం జూలై రెండవ వారంలో గ్లోబల్ ఫైర్ పవర్(జిఎఫ్‌పి) అనే సంస్థ మిలిటరీ బల రాంకులు-2023 ప్రకారం శక్తివంతమైన పది దేశాల్లో వరుసగా అమెరికా, రష్యా, చైనా, భారత్, బ్రిటన్, దక్షిణ కొరియా, పాకిస్థాన్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ ఉన్నాయి. నూటనలభై దేశాలలో అత్యంత బలహీనమైన దేశాల మిలిటరీలో భూటాన్ తొలి స్థానంలో ఉంది. ఈ రాంకులు ప్రతి ఏడాదీ మారుతుంటాయి. గతేడాది తొలి నాలుగు స్థానాల్లో ఉన్న దేశాల్లో ఇప్పుడు ఎలాంటి మార్పు లేదు. గతేడాది ఎనిమిదో స్థానంలో ఉన్న బ్రిటన్ తాజాగా ఐదవ స్థానంలోకి వచ్చింది. పాకిస్థాన్ తొలిసారిగా మొదటి పదిలో ఏడవ స్థానం పొందింది. ఇక ఈ రాంకులు ఇచ్చేందుకు అన్ని దేశాలు అంగీకరించిన ఒక ప్రామాణిక సంస్థ ఏదీ లేదు. ఉదాహరణకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వచ్చిన వార్తల ప్రకారం అమెరికాకు చెందిన ఫెయిర్ బృందం రాంకులను యుఎస్ న్యూస్ ప్రకటించింది. దాని ప్రకారం అత్యంత శక్తివంతమైన మిలిటరీలో చైనాకు రెండవ, భారత్‌కు 14స్థానం ఇచ్చారు. వీటిని తయారు చేసింది అమెరికా సంస్థలు, అక్కడి ఆయుధ తయారీదారుల హస్తం దీని వెనుక ఉన్నట్లు కనిపిస్తున్నది. చైనాతో పోల్చితే భారత్ ఎంతో వెనుకబడి ఉంది కనుక ఆయుధాలను మరింతగా కొనాలని వత్తిడి తెచ్చే ఎత్తుగడ ఉందన్నది స్పష్టం. ఎందుకంటే అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వెంట తన ఆధీనంలోని భూ భాగంలో గతంలో ఎప్పుడో నిర్మించిన గృహాల స్థానంలో చైనా కొత్తవాటిని నిర్మిస్తే ఇంకే ముంది అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా వారు గ్రామాలను నిర్మిస్తున్నట్లు మన దేశాన్ని తప్పుదారి పట్టించేందుకు అమెరికా సంస్థలు చూసిన సంగతి తెలిసిందే. మన దేశం ప్రపంచంలో అన్ని దేశాలు దిగుమతి చేసుకుంటున్న ఆయుధాల్లో పదకొండుశాతం వాటాతో ప్రథమ స్థానం కలిగి ఉండగా చైనా 4.6శాతమే కలిగి ఉంది. అంటే ఆయుధాల కోసం ఇతర దేశాల మీద ఆధారపడటం తక్కువగా ఉంది. గ్లోబల్ ఫైర్ పవర్ సంస్థ పేర్కొన్న సమాచారం ప్రకారం మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న చైనా-భారత్ మిలిటరీ బలాల పోలిక దిగువ విధంగా ఉంది.



ఎం. కోటేశ్వరరావు
8331013288

అంశం	చైనా	భారత్
ర్యాంకు	3	4
అందుబాటులో జనం	76,16,91,468	65,31,29,600
మిలిటరీకి అర్హులు	62,48,69,113	51,55,55,492
ఏటా మిలిటరీ వయస్సువారు	1,97,47,552	36,23,837
రక్షణ బడ్జెట్, బి.డాలర్లు	230	50.2
విమానాలు	3,284	2,210
యుద్ధ విమానాలు	1,199	577
హెలికాప్టర్లు	913	807
విమానాశ్రయాలు	507	346
యుద్ధ టాంకులు	4,950	4,614
యుద్ధ నౌకలు	730	295
వి.వాహకనౌకలు	3	2
హెలికాప్టర్ నౌకలు	3	0
జలాంతర్గాములు	78	18
డెస్ట్రాయర్లు	50	11
రేవులు	22	13
స్వయంచలిత ఆర్టిలరీ	2,720	100
రాకెట్ ఆర్టిలరీ	3,140	960
సాయుధ శకటాలు	14,130	8,600

భారత్ వద్ద మిగ్-21 రకం 107, మిగ్-29 రకం 66 ఉన్నాయి. చైనా వద్ద స్వంత తయారీ జె-11 రకం 442, జె-7 రకం 388, జె-18 రకం 96, యస్‌యు-30 రకం 121 ఉన్నాయి. బహుముఖ పాత్ర పోషించే యుద్ధ విమానాలు మన దేశం దగ్గర సుఖోయ్ -30 రకం 272, మిరేజ్ 49, మిగ్ - 29 రకం 36, రాఫెల్ 26, తేజస్వి 22, కమోవ్ 14 మొత్తం 393 ఉన్నాయి. అదే చైనా వద్ద అన్ని రకాలు కలసి 1,130 ఉన్నాయి. మన దగ్గర మిలిటరీ డ్రోన్లు 12 ఉండగా, చైనా వద్ద 151ఉన్నాయి. రాఫెల్ 4.5 తరం విమానాలను మనం కొనుగోలు చేయగా, దాని కంటే మెరుగైన స్వంత తయారీ 5వ తరం జె-20 విమానాలు చైనా వద్ద ఉన్నాయి.మిలిటరీ ఆయు ధాలకు సంబంధించి ప్రపంచ సంస్థలు చెప్పే అంకెలు కొన్ని భిన్నంగా ఉన్నప్పటికీ మిలిటరీ బలాబలాల ధోరణులు తెలుసుకొనేందుకు ఉపయోగ పడతాయి. వరల్డ్ పాపులేషన్ రివ్యూ 2023 అంచనా ప్రకారం చైనా వద్ద 350, పాకిస్థాన్ దగ్గర 165, మనదగ్గర 156 అణ్వాయుధాలు ఉన్నాయి. అణ్వాయుధాలను ఉపయోగించబోమని భారత్ -చైనా ప్రకటించాయి. అందువలన ఎవరి దగ్గర ఎంత ఎక్కువ దూరం ప్రయాణించే క్షిపణులు ఉన్నప్పటికీ వాటితో అణ్వాయుధాలను ప్రయోగించే అవకాశం లేదు. ఎవరైనా దాన్ని ఉల్లంఘించి అణుదాడులకు పాల్పడితే ఎవరూ మిగలరు. అందువలన మన అగ్ని క్షిపణిని చూసి చైనా వారు గానీ వారి వద్ద 12 నుంచి 15వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించే డిఎఫ్-41క్షిపణులను చూసి మన జనం భయపడుతున్నారా అంటే లేదు.మన అణుక్షిపణి పరిధి ఏడువేల కిలోమీటర్లని మన శాస్త్రవేత్తలు ప్రకటించిన సంగతి తెలిసిందే. మన దేశంతో సహా అన్ని దేశాలూ అలాంటివి మరింత వేగంతో, ఎక్కువ దూరం ప్రయాణించేందుకు నిరంతరం పరిశోధనలు జరుపుతూనే ఉంటాయి.



> సైబర్ నిఘాలో అమెరికా ప్రపంచ ఛాంపియన్‌గా ఉంది. అమెరికాకు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ సమాచార వ్యవస్థ ద్వారా రష్యా సేనల సమాచారం గురించి ఎప్పటికప్పుడు ఉక్రెయిన్‌కు అందచేస్తున్న సంగతి తెలిసిందే. దాని ద్వారా మనతో సహా ఏ దేశ సమాచారాన్నైనా అమెరికా తెలుసుకోవచ్చు. దీని మాతృసంస్థ ఎలాన్ మస్క్ అధిపతిగా ఉన్న స్పేస్ ఎక్స్ కంపెనీ ఇప్పటి వరకు 3,580 చిన్న ఉపగ్రహాలను పంపి 53 దేశాలకు సమాచారాన్ని అందచేస్తున్నది, వాటిని పన్నెండువేలకు పెంచాలని కూడా చూస్తున్నది. అంతరిక్షంలో అమెరికా ఆధిపత్యానికి ఇదొక నిదర్శనం.

ఒకరు బాంబులు విసురుతుంటే రెండోవారు గులాబ్ జాములు అందిస్తూ స్పందించేంత ఉత్తములు ఈ రోజుల్లో ఎవరూ ఉండరు. అలా ఉండాలన్నా ఉండనివ్వరు. శత్రుదేశాల ఉపగ్రహాల మీద దాడి చేసేందుకు అవసరమైన ఆయుధాలను చైనా రూపొందిస్తున్నట్లు, ఇతర దేశాల ఉపగ్రహాలను అదుపులోకి తెచ్చే సత్తా ఉన్నదని సిఐఏ నివేదించినట్లు బహిర్గతమైన అమెరికా గూఢచార, ఇతర కీలక పత్రాల్లో ఉంది. చైనా ఆయుధాల గురించి సిఐఏ పత్రాలను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికలో పేర్కొన్నారు. స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ(సిప్రి) విడుదల చేసిన 2022 వార్షిక నివేదికలో ప్రపంచంలో మిలిటరీ ఖర్చు కొత్త రికార్డు నెలకొల్పినట్లు పేర్కొన్నది. అంతరిక్షం, సైబర్ రంగాలలో అమెరికా ముందున్నది. తాజాగా చంద్రయాన్-3 విజయం, ఇతర ఉపగ్రహాల ప్రయోగాలతో మన దేశం కూడా ధీటుగా ఉండేందుకు అవకాశాలు పెరుగుతున్నాయి. సైబర్ నిఘాలో అమెరికా ప్రపంచ ఛాంపియన్‌గా ఉంది. అమెరికాకు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ సమాచార వ్యవస్థ ద్వారా రష్యా సేనల సమాచారం గురించి ఎప్పటికప్పుడు ఉక్రెయిన్‌కు అందచేస్తున్న సంగతి తెలిసిందే. దాని ద్వారా మనతో సహా ఏ దేశ సమాచారాన్నైనా అమెరికా తెలుసుకోవచ్చు. దీని మాతృసంస్థ ఎలాన్ మస్క్ అధిపతిగా ఉన్న స్పేస్ ఎక్స్ కంపెనీ ఇప్పటి వరకు 3,580 చిన్న ఉపగ్రహాలను పంపి 53 దేశాలకు సమాచారాన్ని అందచేస్తున్నది, వాటిని పన్నెండువేలకు పెంచాలని కూడా చూస్తున్నది. అంతరిక్షంలో అమెరికా ఆధిపత్యానికి ఇదొక నిదర్శనం.

అమెరికా, అది ఎగదోస్తున్న దేశాలు ఇటీవలి కాలంలో మిలిటరీ ఖర్చు పెంచటం, కొత్త కూటములను కడుతుండటంతో మన దేశం, చైనా కూడా తన ఖర్చును పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్టాక్‌హోమ్ సంస్థ పరిగణనలోకి తీసుకున్న అంశాల ప్రకారం ప్రపంచంలో 40దేశాలు గణనీయంగా ఖర్చు చేస్తున్నాయి. వాటిలో మన దేశం మూడవ స్థానంలో ఉండగా మన పొరుగునే ఉన్న పాకిస్తాన్ 24వదిగా ఉంది. ఏ దేశమైనా మిలిటరీ ఖర్చును పెంచి అది జనాల మీద భారం,జీవితాలు మెరుగుపడే అవకాశం లేదన్నది అనేక దేశాల అనుభవం చెబుతున్నది. ఉగ్రవాదం కారణంగా పక్కనే ఉన్న శ్రీలంక తన వనరులన్నింటినీ ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు గాను మిలిటరీని విపరీతంగా పెంచింది. ఉగ్రవాదులను నిర్మూలించినా వెంటనే దాని మిలిటరీ ఖర్చు వెంటనే తగ్గదని తేలింది. మనతో గిల్లికజ్జాలు పెట్టుకొనే పాకిస్థాన్ తలసరి ఖర్చు మనకంటే ఎక్కువే. అది ఇప్పుడు ఆర్థికంగా ఎంత దివాళా తీసిందో, ఎన్ని ఇబ్బందులు పడుతున్నదో చూస్తున్నదే. మన దేశంలో ఉన్న కొంత మంది చైనాను బూచిగా చూపి మిలిటరీ బడ్జెట్‌ను గణనీయంగా పెంచాలని చెప్పటం వెనుక అమెరికా మిలిటరీ కార్పొరేట్ లాబీ ఉందన్నది స్పష్టం. మన జిడిపితో పోలిస్తే చైనా ఐదురెట్లు ఎక్కువ.అందువలన దానితో మిలిటరీ ఖర్చులో మనం పోటీ పడాలంటే వనరులన్నింటినీ మళ్లించాల్సి ఉంటుంది. అది జరిగితే ఆర్థికవృద్ధి కుంటుపడుతుంది. అలాగని మన రక్షణ ఏర్పాట్లను నిర్లక్ష్యం చేయనవసరం లేదు.

ఉమ్మడి పోరాటాలు ఒక చారిత్రక అవసరం

ఒక భోజనానికి అయ్యే ఖర్చు గత ఐదేళ్లలో 67శాతం పెరిగితే చెల్లించబడుతున్న సగటు వేతనాలు 37శాతం పెరిగాయని హిందూ దినపత్రిక ఆగస్టు 30వ తారీఖున సమగ్ర వివరాలతో కూడిన కథనాన్ని ప్రచురించింది. ఉప్పు, పప్పు, కారము, మిరియాలు, బియ్యం, గోధుమలు వంటి అనేక వస్తువులను వాటి గత విలువలను ప్రస్తుత విలువలను ప్రచురిస్తూ కథనాన్ని అందించడంతో ఒక భోజనానికి 67శాతం పెరిగిందని నమ్మశక్యంగానే ఉన్నది. అయితే 37శాతం వేతనాలు పెరిగాయి అనేది కూడా ఒక సమగ్ర అధ్యయనం తర్వాతనే ప్రచు రించారు. కానీ ఐదేండ్ల క్రింద ఉపాధిలో చేరిన ఒక మధ్య తరగతి ఉపాధిదారు లందరికీ కూడా 37శాతం పెరిగే అవకాశాలు తక్కువే. ఆ మధ్యలో మరో నివేదిక ప్రకారం గతేడాది 8.30కోట్ల మందికి కొత్త ఉపాధి లభిస్తే ఆరున్నర కోట్ల మందికి ఉన్న ఉపాధి ఊడిపోయింది. అయితే ఈ ఉపాధి పోయినవాళ్లెవరూ ఆ ఎనిమిదిన్నర కోట్ల మందిలో లేరన్నది వాస్తవం అని తెలిసినప్పుడు, మరి ఈ ఆరున్నర కోట్ల మంది ప్రస్తుతం ఏం చేస్తున్నట్లు? అందులో చాలా మంది గతంకంటే తక్కువ జీతానికి పనిచేస్తున్నట్లు, మిగతావాళ్లు కొత్త ఉపాధి వేటలో ఉన్నట్లు అని అదే నివేదిక తెలిపింది! ఉపాధి కోల్పోయిన వాళ్లు కష్టాలను అనుభవిస్తుంటే యాజమాన్యం మాత్రం సుఖంగా ఉన్నది. అనగా సృష్టించబడినటువంటి సొమ్మును సృష్టికర్తలైన కార్మికులకు సమంగా ఇవ్వకపోవడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందన్నది వాస్తవం. అందుకే సంపద సృష్టికర్తలంతా ఒక్కటై దీన్ని ఎదుర్కోవడమే ప్రస్తుత లక్ష్యం.



జి. తిరుపతయ్య
9951300016

అయితే నినాదాలు, ధిక్కారాలు ఒంటరిగా చేసే పరిస్థితులు కూడా కొన్ని చోట్ల తప్పా దాదాపు నేడు కష్టతరమవు తున్నవి. ఎందుకంటే సెక్టోరల్‌గా ఒకే సంస్థల్లో, ఒకే సందర్భంలో పనిచేసే కార్మికుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతున్నది. సంఘటిత రంగం రోజురోజుకు కుంచించుకుపోతున్నది. అసంఘటిత రంగంలో స్వభావరీత్యా సెక్టో రల్‌గా పోరాటాలు సదరు కంపెనీపై అంత ప్రభావాన్ని చూపే పరిస్థితి లేదు. అంతేకాకుండా ఒకప్పటికి ఇప్పటికీ వచ్చిన మార్పు ఏమంటే, వివిధ సెక్టార్లలో జరిగే స్థానిక పోరాటాలు యాజమాన్యంపై గతంలో ప్రభావం చూపేవి, ఫలితాలు వచ్చేవి. కానీ ఈ రోజుల్లో ప్రయివేటు కంపెనీలు లేదా సెక్టార్లలో కూడా అక్కడి స్థానిక కార్మికుల పోరాటాలకు మేనేజ్‌మెంట్ మాత్రమే స్పందిస్తే సరిపోవడం లేదు. ప్రభుత్వ విధానం కూడా మేనేజ్‌మెంట్ స్పందనను అడ్డుకుంటుంది లేదా అడ్డుకట్ట వేస్తుంది. అంటే ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయకుండా కేవలం వివిధ సెక్టార్లలోని మేనేజ్‌మెంట్లతో మాత్రమే తలపడితే కావలసిన ఫలితాలకి అవకాశం లేదు. అనగా ప్రభుత్వాలే యాజమాన్యాలను కాపాడు తున్నాయి లేదా యాజమాన్యాలకు వంత పాడుతున్నాయి. తద్వారా కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉన్నది. వెరసి అర్థం చేసుకోవలసింది ఏమిటంటే... రంగాలు, సంఘాలతో నిమిత్తం లేకుండా యాజ మాన్యాలపై మాత్రమే పోరాడితే ఉపయోగం లేదు.అందుకే ప్రభుత్వ విధానాలపైనే తిరుగుబాటు చేయాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి. కార్మిక వర్గం మాత్రమే కాకుండా సంపద సృష్టిలో భాగస్వామ్య మవుతున్న కర్షకులతో కూడా కలిసి ఐక్య పోరాటాలకు మరింత పదును పెట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

భారత కార్మిక, కర్షకవర్గం గత 40ఏండ్లలో 22సార్లు జాతీయస్థాయిలో సమ్మెలు,హర్తాళ్లు నిర్వహించింది. కొన్ని సంవత్సరాలలో మహాపడావ్‌ల పేరు మీద, మరికొన్ని సంవత్సరాలలో దేశవ్యాప్త బంద్‌ల పేరుమీద, ప్రాము ఖ్యత కలిగిన సందర్భాలలో జాగరణలు, నిరాహార దీక్షలు వంటి వాటి ద్వారా క్రమం తప్పకుండా కార్మిక కర్షక గోసను తెలుపుతూ వస్తున్నది. దీని ఫలితంగానే సరళీకరణ విధానాల అమలు వేగం తగ్గిందని చెప్పవచ్చు. ఈ సంవత్సరం 2023లో కూడా అఖిల భారత స్థాయిలో కార్మిక కర్షక వర్గ ప్రతినిధులంతా కలిసి ఆగస్టు 24వ తేదీన జాతీయ కన్వెన్షన్ ఢిల్లీ టాల్కటోరా స్టేడియంలో నిర్వహించి, భవిష్యత్తు పోరాటాల ప్రణాళికను విడుదల చేశారు. దేశంలోని మొత్తం కార్మిక వర్గంలో 53శాతం మందికి సాంఘిక భద్రత పరమైన వెసులుబాట్లు లేవు. అనగా వీరందరికి ప్రావిడెంట్ ఫండ్ గాని, మెడిక్లెయిమ్ సదుపాయం గాని, ఇతర గ్రూప్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు ఏవి లేవు. ఎన్నో ఏండ్ల నుంచి క్రమం తప్పకుండా జరుగుతున్న పోరాటాలు ఈ అంశంలో విధాన రూపకర్తలను ప్రభావితం చేయలేకపోయాయి. సంక్షేమ రాజ్యం అనే భావనను తుడిచిపెట్టేలా సీనియర్ సిటిజన్లకు, మహిళలకు, వికలాంగులకు, ఆటగాళ్లకు కల్పించే రాయితీలన్నీ కూడా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది.

హంగర్ ఇండెక్స్‌లో 107వ స్థానంలో ఉన్న దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిస్తే ఆహార భద్రత దాదాపు సాధించవచ్చునని అనేక కమిటీలిచ్చిన రిపోర్టులను కేంద్రం బుట్టదాఖలు చేసింది. స్వతంత్ర



భారత్‌కు వయస్సు ముప్పాతిక నిండినా, అక్షరాస్యతలో ముప్పాతిక శాతం సాధించలేకపోయాం. అందరికీ సొంతిండ్లు లేవన్న సంగతి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న గృహ వసతి స్కీమ్‌లను బట్టి తెలుస్తోంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు సంబంధించిన ఇన్‌కంటాక్స్ రాయితీలను రద్దు చేసుకుంది. ఏటేటా కోరుతున్న కనీస వేతనాల డిమాండ్ మొత్తం పెరుగుతున్నది కానీ ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి, సాలుకోసారి జరగవలసిన లేబర్ కాన్ఫరెన్స్ ఇప్పటిదాకా ఒక్కసారి కూడా నిర్వహించలేదు. పని హక్కును ప్రాథమిక హక్కులలో కలపమని డిమాండ్ చేస్తుంటే జాతీయ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచేలా కేటాయింపులు తగ్గిస్తున్నారు. సమగ్రమైన బీమాను కల్పించే క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ స్కీం వంటి వాటిని వదిలిపెట్టి, కార్పొరేట్లకు మేలు గొలిపే ప్రైమ్ మినిస్టర్ ఫసల్ బీమా యోజన వంటి వాటిని తీసుకొచ్చారు. రైతుల పోరాట ఫలితంగా నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటూ ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి కేంద్రం సుముఖంగా లేదు. 29 కార్మిక చట్టాల స్థానంలో సిద్ధం చేయబడిన నాలుగు లేబర్ కోడ్‌లను అమలుపరిస్తే కార్మికుల హక్కులు పూర్తిగా కాలరాయబడతాయి. నూతన పెన్షన్ విధాన ప్రతిఫలాలు పూర్తిగా అసంబద్ధంగా ఉన్నవి. దాని ద్వారా లభించే మొత్తం ఏ మాత్రం సరిపోవడం లేదు. అందుచేత ఎన్‌పిఎస్‌ను పూర్తిగా రద్దు చేయడమే గత్యంతరం. భారత ఖజానాకు నిధులు అవసరమే. అయితే ఆ ఖజానాను నింపుకోవడానికి అత్యంత ధనవంతులపైన పన్నులు వేయకుండా పరోక్ష పనుల ద్వారా సామాన్యులను మరింత పిండి పిప్పి చేయడమే లక్ష్యంగా విధానాలు సాగుతున్నవి. అంతేకాకుండా రాజ్యాంగ విలువలకు ఏమాత్రం గౌరవం ఇవ్వకుండా ఏకపక్ష ధోరణితో కేంద్రం వ్యవహరిస్తోంది. ఇక చివరిగా చెప్పాలంటే ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణే ప్రధాన ధ్యేయంగా కేంద్రం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్యను 27 నుండి 12కు కుదించింది. ఇన్సూరెన్స్ రంగంలో వాటాల ఉపసంహరణ చేసి ఒక గందరగోళ వాతావరణానికి తెరతీసింది. ఇలాంటి విధానాలతో పాటు పైన పేర్కొన్న సాదారణ అంశాలను సెక్టోరల్‌గా వ్యతిరేకిస్తే ఫలితాలకు అవకాశం తక్కువ. అందుచేత కార్మిక కర్షకులంతా కలిసి ఉమ్మడిగా నినదించడమే ప్రధాన కర్తవ్యం. నిరంతరం నిప్పు రాజేయకుంటే పాలకులు అదే అదునుగా నిమ్మకు నీరెత్తినట్టు ఉండటమే కాకుండా మరిన్ని కార్మిక కర్షక వ్యతిరేక నిర్ణయాలు చేస్తారు. అందుకే ఆగస్టు 24న జరిగిన జాతీయ కన్వెన్షన్ ఈ కింది నిర్ణయాలను తక్షణ కర్తవ్యాలుగా ప్రకటించింది. 1.అక్టోబర్ మూడవ తేదీ ఏరోజైతే కర్షకులు పోరాటం చేస్తున్న లకింపూర్ కేరి అనే ప్రదేశంలో కేంద్రం మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు తన వాహనంతో రైతులను తొక్కి చంపాడు ఆరోజు బ్లాక్ డే నిరసన దినంగా దేశమంతా పాటించాలి. 2. రాజ్యాంగాన్ని పూర్తిగా లెక్క చేయడం లేదు కాబట్టి రాజ్యాంగ దినోత్సవంగా పరిగణింపబడుతున్న నవంబర్ 26వ తేదీని తీసుకొని 28 వరకు దేశ వ్యాప్తంగా రాత్రింబవళ్లు మహాపడావ్ నిర్వహించాలి. 3. రానున్న డిసెంబర్, జనవరి మాసాల్లో దేశవ్యాప్త ఐక్య నిరసన పోరాట కార్య క్రమాలకు కార్మిక వర్గం అంతా సిద్ధంగా ఉండాలి. రంగాల వారి పోరాటాలతో బాటు విశాల వేదికగా రూపుదిద్దు కుంటున్న ఈ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా పరిమితమైన సమస్యకు ప్రాముఖ్యత కల్పించి అందరి నినాదాలతో సాధించుకునే అవకాశాలు చాలా ఎక్కువ ఆ దిశగా అడుగులేయడమే కష్టజీవుల కర్తవ్యం.

క్రమశిక్షణారాహిత్యాన్ని సహించం

- శిక్షణ పొందబోయే కానిస్టేబుళ్లకు డీజీపీ హెచ్చరిక

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : శిక్షణా సమయంలో కొత్త కానిస్టేబుళ్ల క్రమ శిక్షణారాహిత్యం, దుష్ప్రవర్తనకు పాల్పడితే ఏ మాత్రమూ సహించబోమని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ హెచ్చరించారు. శిక్షణా సమయంలో వీరు క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడకుండా నిఘా వేసి ఉంచాలని పోలీసు ట్రెనింగ్ కాలేజీ(పీటీసీ)ల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చారు. మంగళవారం రాష్ట్రంలోని 29 పోలీసు ట్రెనింగ్ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లకు కొత్త కానిస్టేబుళ్లకు ఇవ్వబోయే శిక్షణకు సంబంధించి ఒక్కరోజు వర్క్‌షాప్‌ను డీజీపీ కార్యాలయంలో నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండండి

- నష్టం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి
- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో విస్తారమైన వర్షాలు పడతాయంటూ వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయనీ, వచ్చే మూడు రోజులపాటు అవి కొనసాగనున్న క్రమంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా అన్ని శాఖలూ సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్ పరిస్థితులను సమీక్షించారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లోని చెరువులు, కుంటలు నిండి ఉన్నాయనీ, ఆయా చెరువులకు గండ్లు పడడం, తెగిపోకుండా ఉండేందుకు తగు రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉధృతంగా ప్రవహించే కాజ్-వేలు, కల్వర్టులు, వంతెనల వద్ద ముందు జాగ్రత్త చర్యగా తగు భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. భారీ వర్షాలు, వరదలతో జరిగే నష్టాన్ని నివారించేందుకు సంబంధిత మండల స్థాయి రెవెన్యూ, పీఆర్ తదితర అధికారులతో రెగ్యులర్ టెలీ-కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షించాలని కోరారు. ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల కోసం స్థానిక అగ్నిమాపక, పోలీసు బృందాలను మోహరించాలని తెలిపారు. వర్షం, వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి బాధిత కుటుంబాలకు సహాయక శిబిరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వారికి ఆహారం, మంచినీరు, వైద్య తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆమె ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో లోతట్టు ప్రాంతాల్లో తగు ముందస్తు ఏర్పాట్లను చేయడంతోపాటు, మ్యాన్-హోళ్లపై కప్పులు తెరవకుండా నగర వాసులను చైతన్య పర్చాలని తెలిపారు. సమీక్షలో డీజీపీ అంజనీ కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రజత్ కుమార్, అర్వింద్ కుమార్, సునీల్ శర్మ, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జలమండలి ఎండీ దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లు సమర్పించండి

- రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం సిద్దిపేట జిల్లా ముట్రాజ్‌పల్లిలో భూసేకరణకు సంబంధించి గెజిట్ సవరణ నోటిఫికేషన్‌కు చెందిన ఫైళ్లను సమర్పించాలని హైకోర్టు రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. కోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం 102 ఎకరాల సేకరణ నిమిత్తం 2021, జనవరి 31న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను బాలాజీ స్పిన్నర్స్ సవాల్ చేసిన రిట్‌ను సింగిల్ జడ్జి డిస్మిస్ చేయడంతో అప్పీల్ దాఖలు చేసింది. దీనిని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ డివిజన్ బెంచ్ విచారించింది. నోటిఫికేషన్ పబ్లిష్‌కు చెందిన పత్రాలు అందజేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది.

జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర ప్రారంభం-దక్షిణ మధ్య రైల్వే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండో జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్రకు 11వ భారత్ గౌరవ్ టూరిస్ట్ సదరన్ సర్క్యూట్ రైలు సికింద్రాబాద్ నుంచి మంగళవారం ప్రారంభమైనట్టు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తమిళనాడు, కేరళలోని ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు ఈ యాత్ర ఉద్దేశించింది. ఈ యాత్రలో ప్రయాణికులకు తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులను కవర్ చేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఆపరేషన్ మేనేజర్ బి.నాగ్యా, ఐఆర్సీటీసీ గ్రూప్ జీఎం పి.రాజ్ కుమార్ తెలిపారు.

కోర్టు ధిక్కరణ కేసులో జైలు శిక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోర్టు ధిక్కరణ కేసులో రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మండలం మంచిరేవుల గ్రామంలోని విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ రత్నారెడ్డి, నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ పి.సత్యబాబులకు హైకోర్టు జైలు శిక్ష విధించింది. ఆరు నెలల జైలు, రూ.రెండు వేలు చొప్పున జరిమానా విధించింది. అప్పీల్ కోసం తీర్పు అమలును పది రోజులు సస్పెన్షన్‌లో ఉంచింది.రెండు ఎకరాల లీజు భూమిలో నిర్మాణాలకు అనుమతులు చేయడంతో మున్సిపాల్టీ నోటీసులు ఇచ్చింది.

నీటితోనే తెలంగాణ అభివృద్ధి

ఐటీ, ఇతర పరిశ్రమలు అందుకే వస్తున్నాయి : రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ వి. ప్రకాష్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

విస్తారంగా అందుబాటులోకి వచ్చిన జల వనరులతోనే రాష్ట్రానికి ఐటీతోపాటు ఇతర పరిశ్రమలు తరలివస్తున్నాయని తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మెన్ వి. ప్రకాష్ అన్నారు. నీటితోనే ఆర్థిక ప్రగతితోపాటు వ్యవసా యాభివృద్ధి కనిపిస్తున్నదని చెప్పారు.

మంగళవారం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆర్థిక కమిటీ ఆధ్వర్యంలో 'జలసంరక్షణ-పౌర సంఘాల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దీనికి ఆ కమిటీ అధ్యక్షులు డాక్టర్ గంగాధర్ రావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నీటికి, విద్యుత్‌కు ఎప్పుడూ కొరత ఉండేదన్నారు. కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల మూలంగా రాష్ట్రానికి ప్రాధాన్యత పెరిగిందన్నారు. ఐటీ, విద్యుత్, వ్యవసాయ సంబంధిత పరిశ్రమలు భారీగా వస్తున్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి నీరు ప్రధాన వనరుగా ఉందని చెప్పారు. ప్రతినీటిబొట్టు ఒడిసి పట్టాల్సిన అవసరం ఉందనీ, భూగర్భజలాలను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి నీటి సమస్యలు రాకుండా ఉండాలంటే తప్పకుండా పొదుపు చేయాలని కోరారు. వాలంటీర్ల ద్వారా నీటిపొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తక్కువ నీటితో ఎక్కువ పంటలను సాగుచేసేలా సమాయత్తం కావాలని చెప్పారు. ఒక కిలో బియ్యం పండించాలంటే కనీసం ఐదు వేల లీటర్ల నుంచి ఎనిమిది వేల లీటర్ల వరకు నీరు అవసరమవు తుందని చెప్పారు. అలాగే మిల్లెట్లు పండించాలని కేవలం 500 లీటర్లు సరిపోతాయని వివరిం చారు. ఒకపూట వరికి బదులు మిల్లెట్లు అలవాటు చేసుకోవాలని చెప్పారు. దీంతో ఆరోగ్యంతోపాటు నీటి పొదుపు సాధ్యమవుతుందన్నారు. ఈ కార్య క్రమంలో సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, రిటైర్డ్ ఇంజినీర్స్ ఫోరం కార్య దర్శి బి.శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, వాతావరణ వేత్త మధులిక చౌధరి, ఆర్థిక కమిటీ గౌరవ కార్యదర్శి జీవీ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామోదరను సన్మానించిన మందకృష్ణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)శాశ్వత సభ్యుడిగా నియమించినందుకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయనకు శాలువా కప్పి అభినందించారు.

స్వచ్ఛంద సేవ పేరుతో రూ.35 కోట్లు స్వాహా

- నిందితుడిని అరెస్టు చేసిన సీఐడీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

స్వచ్ఛంద సేవ పేరిట దాతల నుంచి రూ.35 కోట్లను సేకరించి స్వాహా చేసి పరారైన నిందితుడిని సీఐడీ అధికారులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. సీఐడీ డీజీ మహేశ్ భగవత్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట్‌కు చెందిన ఉమాకాంత్ ఆధ్యాత్మిక రంగంలో తాను పని చేస్తున్నానని అందులో భాగంగా గోశాలలను నిర్వహించటం, వృద్ధాశ్రమాలను నడిపించటం, ఇతర ఆధ్యాత్మిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నానని దాతల నుంచి నిధులను సేకరించాడు. ముఖ్యంగా, ఆస్మాన్‌గఢ్‌కు చెందిన శివప్రసాద్‌తో పాటు మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి రూ.35 కోట్ల మేరకు విరాళాలు సేకరించాడు.

ఎడిటర్స్ గిల్డ్‌పై ఎఫ్ఐఆర్ రద్దు చేయండి
డీయూజే డిమాండ్

న్యూఢిల్లీ : ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ)కి వ్యతిరేకంగా మణిపూర్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (డీయూజే) తీవ్రంగా ఖండించింది. ఈ ఎఫ్ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మణిపూర్‌లో సుమారు నాలుగు నెలల నుంచి కొనసాగుతున్న హింసాకాండపై ఈజీఐ నిజ నిర్ధారణ బృందం ఇటీవల 24 పేజీలతో కూడిన ఒక నివేదికను వెల్లడించింది. ఈ నివేదికను సవాల్ చేస్తూ ఒక స్థానిక సామాజిక కార్యకర్త చేసిన ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఈ బృందంలోని సభ్యులు సీమా గుహ, సంజయ్‌కపూర్, భరత్ భూషణ్‌తో పాటు ఇజిఐ అధ్యక్షులు సీమా ముస్తాఫాపై ఎఫ్ఐఆర్ నమోదయింది. తటస్థ నిపుణులతో కూడిన ఈజీఐ ఇచ్చిన నివేదిక పక్షపాతమని ఆరోపించడం అసంబద్ధమని డీయూజే తన ప్రకటనలో ఖండించింది.

అమెరికాలో జాతీయ రహదారికి
భారత సంతతి పోలీస్ అధికారి పేరు

వాషింగ్టన్ : అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఒక జాతీయ రహదారికి భారత సంతతికి చెందిన పోలీసు అధికారి రోనిల్ సింగ్ పేరు పెట్టారు. న్యూమాన్‌లోని హైవే 33 యొక్క విస్తరణకు 'కార్పోరల్ రోనిల్ సింగ్ మెమోరియల్ హైవే' అని పేరు పెట్టి, దీనిని ప్రకటించే సూచికను స్టువర్ రోడ్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రోనిల్ సింగ్ 2011 జులైలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరారు. 2018 డిసెంబర్ 26న విధుల్లో ఉన్న సింగ్‌ను ఒక అక్రమవలసదారుడు కాల్చి చంపాడు.

పేదలకు వరం జీవో 58

- ఇంటి స్థలాల పట్టాలు

పంపిణీ చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

నిరుపేదలకు వరం జీవో 58 అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 18వ వార్డు సుందరయ్యనగర్‌లో 95 మంది పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేదకూ అందించామన్నారు. గూడు లేని వారు ఎన్నోఏండ్ల నుంచి అభద్రతాభావంతో ఉన్నారని చెప్పారు. సుందరయ్యనగర్ ప్రజల 20 ఏండ్ల కల ఈ రోజు నెరవేరిందన్నారు. మారో విడతలో 45 మందికి ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ వెంకట్రావ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, వైస్‌చైర్మెన్ పుట్టా కిషోర్, కౌన్సిలర్ మాలోతు కమల చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

370వ అధికరణ రద్దుపై సుప్రీం తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తున్న రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై తీర్పును సుప్రీం కోర్టు మంగళవారం రిజర్వ్ చేసింది.16 రోజుల పాటు సుదీర్ఘంగా సాగిన విచారణ అనంతరం ప్రధానన్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది.సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, గోపాల్ సుబ్రమణియం, రాజీవ్ ధావన్, జఫర్ షా, దుష్యంత్ దావె ప్రభృతులు సాగించిన రీ జాయిండర్ వాదనలను బెంచ్ ఆలకించింది. తీర్పు రిజర్వు చేసిన నేపథ్యంలోనూ పిటిషనర్లు లేదా ప్రతివాదుల తరపున హాజరయ్యే న్యాయవాదులెవరైనా రాతపూర్వకంగా పిటిషన్ దాఖలు చేయదలచుకుంటే రాబోయే మూడు రోజుల్లో చేయాలని సుప్రీం కోర్టు సూచించింది. అయితే ఆ పిటిషన్ రెండు పేజీలకు మించరాదని తెలిపింది.

బీసీలంతా బీఆర్ఎస్‌ను ఓడించాలి:టీడీపీ



నవతెలంగాణ-హైదరాబాద్

బడుగు బలహీన వర్గాలు బీఆర్ఎస్ పార్టీని ఓడించాలని టీడీపీ పిలుపునిచ్చింది. పటేల్ పట్వారి వ్యవస్థను రద్దుచేసి పేదవారికి రెండు రూపాయలకు కిలో బియ్యం, పక్కా గృహాలు కట్టించిన తెలుగుదేశం పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని తెలుగుదేశం జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు అధ్యక్షుడుగా ముంజ వెంకట రాజ్యం గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మించిన రోజు తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడం గొప్ప పరిణామమన్నారు. 42 ఏండ్ల క్రితమే తెలుగుదేశం పార్టీ పుట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తరగతులకే కాకుండా , వెలమ, రెడ్డి, వైశ్య వారికి కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. అనాడు కాంగ్రెస్ పాలకులు ప్రధాన మంత్రి పర్యటనలో సీఎంను అవమానించిన ఘటనలు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలో ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు జక్కిలి ఐలయ్య యాదవ్, అజ్మీరా రాజు నాయక్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు సంధ్యపోగు రాజశేఖర్, యం .బిక్షపతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘం ప్రమాణం

టీడీపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా ముంజ వెంకటరాజ్యం గౌడ్, ఉపాధ్యక్షులుగా పుల్లయ్య, అప్పారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, బాలరాజు, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీదేవి, కోశాధికారి రమేష్ బాబు ప్రమాణ స్వీకారం చేశారు.

ఆదిత్య ఎల్-1 రెండవ కక్ష్య పెంపు
విన్యాసం విజయవంతం : ఇస్రో

బెంగళూరు : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సూర్యునిపై పరిశోధనకు ప్రయోగించిన ఆదిత్య ఎల్ -1 విజయవంతంగా దూసుకుపోతున్నది. ఆదిత్య ఎల్ 1 రెండవ భూకక్ష్య పెంపు విన్యాసాన్ని పూర్తి చేసినట్టు ఇస్రో ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఈ విన్యాసం పూర్తయిందని తెలిపింది. ఈ ఆపరేషన్ సమయంలో మారిషస్, బెంగళూరు, పోర్ట్‌బ్లెయిర్‌లోని ఐఎస్‌టీఆర్ఏసీ/ఇస్రో స్టేషన్లు ఉపగ్రహాన్ని ట్రాక్ చేశాయని ఇస్రో ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఆదిత్య ఎల్-1 282కి.మీ 40,225కి.మీకి చేరుకుంది.

అయితే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు మరో మూడు సార్లు కక్ష్యను పెంచాల్సి వుంది. తదుపరి విన్యాసాన్ని సెప్టెంబర్ 10 తెల్లవారుజామున 2.30 గంటలకు షెడ్యూల్ చేసినట్లు తెలిపింది. సెప్టెంబర్ 18న చివరి విన్యాసం తర్వాత ఆదిత్య ఎల్-1 వర్తులాకార కక్ష్య అయిన లాంగ్రేంగియన్ పాయింట్ 1కి చేరేందుకు సిద్ధమవుతుంది. ఈ కక్ష్యలోకి ప్రవేశించడానికి నాలుగు నెలల వ్యవధి పట్టనుంది.

పెరుగుతున్న బాల కార్మికులు !



ఐక్యరాజ్య సమితి హెచ్చరిక

న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా చదువు మానేసి బలవంతంగా పనిలోకి దిగుతున్న పిల్లల సంఖ్య పెరుగుతోందని ఐక్యరాజ్య సమితి మంగళవారం హెచ్చరించింది. లైంగికంగా దోపిడికి గురవుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోందని పేర్కొంది. అంతర్జాతీయంగా ఆర్థిక సమస్యలు చుట్టుముడుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తిరోగమనం నెలకొందని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) డైరెక్టర్ జనరల్ గిల్బర్ట్ హంగ్బో తెలిపారు. ద్రవ్యోల్బణం పెరగడంతో పాటూ కోవిడ్ ప్రభావం కూడా తోడవడంతో ప్రజల జీవన వ్యయం పెరిగి పోయిందని, దాంతో పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారాయని ఆయన బిబిసికి తెలిపారు. ఇప్పుడు గనక మనం సరైన చర్యలు తీసుకోని పక్షంలో, వేగంగా నిర్ణయాలు తీసుకోనట్టైతే సమస్య ఇంకా ముదురుతుందని అన్నారు.

2020 ప్రారంభంలో దాదాపు 16లక్షల మంది పిల్లలు బాల కార్మికులుగా మారారని ఐక్యరాజ్య సమితి డేటా పేర్కొంది. ఈ పరిస్థితులను మార్చేందుకు అంతర్జాతీయంగా జరుగుతున్న కృషి 20 ఏండ్లలో మొదటిసారిగా స్తంభించిందని అన్నారు.

రోజుకు ఒక పూట కూడా భోజనం దొరకని కుటుంబాలు వున్నాయని, అటువంటి కుటుంబాల్లోని పిల్లలు చివరకు బాల కార్మికులుగా రూపాంతరం చెందుతున్నారని అన్నారు. తమ కుటుంబ అవసరాల కోసం పిల్లలను లైంగిక వ్యాపారంలోకి దించే వారూ కూడా వున్నారని అన్నారు. కెన్యాలోని మొంబసాకి చెందిన 14ఏళ్ళ బాలిక తన కుటుంబ అవసరాల కోసమే పడుపు వృత్తిలోకి దిగిందని బీబీసీ తన వార్తా కథనంలో పేర్కొంది. కోవిడ్ సమయంలో ఇవేవీ లేకపోవడంతో రోజు గడవడం కష్టమైపోయిందని తెలిపింది. అందరి పిల్లల్లా తన బిడ్డ కూడా స్కూలుకు వెళ్లాలని కోరిక వుంటుందని, కానీ బతుకు గడిచే పరిస్థితి లేకపోవడంతో ఇలా పనిలోకి దింపడం తప్పడం లేదని ఆ తల్లి వాపోయింది.

అన్ని దేశాల్లోనూ ఈ బాల కార్మికుల సంఖ్య పెరుగుతోందని, వ్యవసాయం, గనులు, నిర్మాణ రంగాలతో సహా అన్ని చోట్లా ఈ సమస్య వుందని హంగ్బో చెప్పారు.

ఒక్క మాటలో చెప్పాలంటే మనం చాలా సంక్లిష్టమైన దశలో వున్నామని హంగ్బో చెప్పారు. దారిద్ర్యమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. ప్రభుత్వాలు మరింత క్రియాశీలంగా వ్యవహరించాల్సిన అవసరం వుందన్నారు.

ఆ ఆలోచనే ప్రమాదకరం

- నూతన రాజ్యాంగంపై న్యాయ నిపుణుల మనోగతం
- నియంతృత్వాన్ని కోరరాదని హితవు

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలో అమలవుతున్న రాజ్యాంగం వలసవాదుల కాలం నాటిదని, అందుకే నూతన రాజ్యాంగ రచన అవసరమని ఇటీవల కొందరు వాదిస్తున్నారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజ్యాంగం బ్రిటిష్ పాలన నాటిదే అయినప్పటికీ అందులోని విషయాలన్నింటినీ చెడ్డవిగా భావించాల్సిన అవసరం లేదు. వాస్తవానికి 1935వ సంవత్సరం నాటి భారత ప్రభుత్వ (జీఓఐ) చట్టం అత్యద్భుతమైనదని బీఆర్ అంబేద్కర్, బెనెగల్ నర్సింగ్ రావు, రాజేంద్ర ప్రసాద్, కేఎం మున్షీ సహా పలువురు ప్రముఖులు అభివర్ణించారు. ఈ చట్టం ఆధారంగానే భారత నూతన రాజ్యాంగాన్ని రచించాలని వారు సూచించారు. ఎందుకంటే అది బాగా ఆలోచించి రాసిన పత్రం. వలసవాదుల కాలం నాటి చట్టాన్ని అంగీకరించడం అంటే మన పురాతన సంప్రదాయాలను అవమానించినట్లుగా భావించకూడదు. దానిని వివేకవంతమైన, ఆచరణాత్మక మైన చర్యగానే చూడాల్సి ఉంటుంది.

రాజ్యాంగ రచనకు 1935వ సంవత్సరపు జీఓఐ చట్టమే ఆధారమైనప్పటికీ అందులో కొన్ని మార్పులు చేశారు. ఉదాహరణకు రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు. వేర్వేరు రకాల ఓటర్ల పద్ధతికి స్వస్తి చెప్పారు. 1935వ చట్టంలోని కొన్ని అంశాలు మనకు అనుకూలంగా ఉన్నాయి. భారతీయులకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ సరిపోయింది. అదే పాకిస్తాన్, శ్రీలంక దేశాలు అధ్యక్ష తరహా పాలన వైపు వెళ్లి అనేక సమస్యలు



ఎదుర్కొ న్నాయి. ఆ ప్రయోగం నుండి ఆయా దేశాలు ఇప్పటికీ కోలుకోలేదు. నెదర్లాండ్స్, ఇజ్రాయిల్ దేశాలలో అస్థిరతను గమనిస్తే మనం చాలా నయమని అర్థమవుతుంది.

మార్పులు మంచివే

రాజ్యాంగాన్ని సవరించడం కష్టమే కానీ అసాధ్యమేమీ కాదు. అయితే కొన్ని సవరణలను ప్రభుత్వాలు మంద బలంతో తమకు అనుకూలంగా చేసు కున్నాయి. అది వేరే విషయం. రాజ్యాంగాన్ని సమూలంగా మారేసి కొత్తగా రాయాలన్న ఆలోచనే ప్రమాదకరమని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దక్షిణ అమెరికాలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి రాజ్యాంగాన్ని తిరగరాస్తున్నారు. అయితే దానివల్ల జరుగుతున్న అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. మన రాజ్యాం గం ఎంతో గొప్పగా ఉన్నదని, అందులో లోపాలే లేవని చెప్ప లేము. కానీ దానిలో అక్కడక్కడా మార్పులు చేసుకొని సరి దిద్దుకునే అవకాశం ఉంది. అంతేకానీ రాజ్యాంగాన్ని మొత్తంగా రద్దు చేసి, నూతన రాజ్యాంగ రచన చేస్తే పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయి.

ఇష్టారాజ్యం అంటే కుదరదు

రాజ్యాంగాన్ని మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరించవచ్చు. అంతమాత్రాన ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే నడవదు. రాజ్యాంగాన్ని సవరించి భారతదేశాన్ని అమెరికా అనో లేదా మరో దేశమనో ప్రకటించగలమా ? ఎంపీలు తమ సంతానాన్ని ఆ పదవికి వారసులుగా ప్రకటించగలరా ? భారతావని రిపబ్లిక్ దేశం. దానిని నియంతృత్వ దేశంగా ప్రకటించడం పార్లమెంటుకు కూడా సాధ్యం కాదు.

కొన్ని అంశాలకు సంబంధించి కాలానుగుణంగా వచ్చే మార్పులను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగాన్ని సవరించవచ్చు కానీ దాని మౌలిక స్వభావాన్ని మార్చడం అసంభవం. రాజ్యాంగాన్ని తరచూ మారుస్తున్న దేశాలు సమస్యల సుడిగుండంలో పడి కొట్టుకుంటున్నాయి. ఫ్రాన్స్‌లో ప్రతి యాభై సంవత్సరాలకు, లాటిన్ అమెరికాలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి రాజ్యాంగాలను మారుస్తున్నారు. మార్పు అనేది అనివార్యమే కానీ ఆ సవరణలు కొన్ని అంశాలకే పరిమితం కావాలి.

త్రిపురలో రెచ్చిపోయిన బీజేపీ గూండాలు

ఉప ఎన్నికల్లో దౌర్జన్యకాండ

న్యూఢిల్లీ : త్రిపురలో మంగళవారం జరిగిన రెండు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల్లో బీజేపీ గూండాలు దౌర్జన్యకాండ సాగించారు. కొంత మంది పోలీసులు, పరిపాలన అధికారులను అడ్డం పెట్టుకుని అసాధారణ భయోత్పానక వాతావరణాన్ని సృష్టించారు. ఆదివారం బాక్సానగర్, ధన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. ఈ రెండు నియోజకవర్గాలకు పోలింగ్ రోజున దొంగ ఓట్లు వేయడం, రిగ్గింగ్ చేయడం కోసం ఈ నెల 3వ తేదీ రాత్రి నుంచే ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలను బీజేపీ గూండాలు తీసుకుని వచ్చారు. మంగళవారం రోజున వీరంతా హింసాకాండకు తెగించారు. ఈ హింసాకాండ ఎంత తీవ్ర స్థాయిలో సాగిందంటే బాక్సనగర్ నియోజకవర్గంలో కేవలం 16 మంది సీపీఐ(ఎం) ఏజెంట్లు, ధన్‌పూర్‌లో 19 మంది సీపీఐ(ఎం) ఏజెంట్లు మాత్రమే తమ తమ బూత్‌ల్లో బాధ్యతలు నిర్వహించగలిగారు. ఈ రెండు నియోజకవర్గంలో మిగిలిన అన్ని బూత్‌లలోనూ బీజేపీ గూండాలు చొరబడి సీపీఐ(ఎం) ఏజెంట్లను బలవంతంగా బయటకు గెంటేశారు. అక్రమాలకు పాల్పడ్డారు.

దొంగ ఓట్లు వేశారు. ప్రతిపక్ష పార్టీ మద్దతుదారుల్ని కనీసం బూత్‌ల సమీపంలోకి కూడా వెళ్ల నివ్వలేదు. అనేక ప్రాంతాల్లో ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై బీజేపీ గూండాలు భౌతిక దాడులకు పాల్పడ్డారు. అధికారులు బీజేపీ గూండాలను నిలువరించడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. బీజేపీ గూండాల హింసాకాండ నేపథ్యంలో రెండు నియోజకవర్గాల్లోనూ మళ్లీ కొత్తగా పోలింగ్ నిర్వహించాలని సీపీఐ(ఎం) త్రిపుర డిమాండ్ చేసింది..

మిగిలిన చోట్ల ప్రశాంతం

త్రిపుర మినహా మిగిలిన ఐదు రాష్ట్రాల్లో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు మంగళవారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పశ్చి బెంగాల్‌లోని ధప్గురి, ఉత్తరాఖండ్‌లోని బగేశ్వరి, కేరళలోని పుతుపల్లి, ఉత్తరప్రదేశ్‌లోని ఘోసి, జార్ఖండ్‌లోని దుమ్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. కేరళలోని పుతుపల్లి నియోజకవర్గంలో ఉమెన్ చాందీ మృతితో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఉమెన్ చాందీ కుమారుడు చాందీ ఉమెన్ పోటీ చేస్తుండగా, సీపీఐ(ఎం) అభ్యర్థిగా జైక్ సి థామస్ పోటీలో ఉన్నారు. ఈ నియోజవర్గంలో సాయంత్రం 5 గంటల సమయానికి 55 శాతం ఓటింగ్ నమోదయింది.

బిజినెస్

సిబిల్ స్కోర్ తక్కువున్నా గృహ రుణాలు

- ఎస్‌బీఐ వెల్లడి
- పండగ సీజన్‌పై దృష్టి



న్యూఢిల్లీ: గృహ రుణగ్రహీతల పట్ల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అత్యంత సానుకూల నిర్ణయం తీసుకుంది. ఖాతాదారులకు సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నప్పటికీ ఇంటి కోసం అప్పు ఇవ్వాలని నిర్ణయించింది. అదే విధంగా సిబిల్ స్కోర్ మెరుగ్గా ఉన్న వారికి వడ్డీలో రాయితీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. వచ్చే పండగ సీజన్‌లో ఈ విభాగంలో మరింత దూసుకుపోవడానికి తాజా నిర్ణయం దోహదం చేయనుందని ఎస్‌బీఐ ఆశాభావం వ్యక్తం చేసింది. సాధారణంగా ఖాతాదారులకు సిబిల్ స్కోర్ తక్కువగా ఉంటే బ్యాంక్‌లు అప్పులివ్వడానికి వెనుకడుగు వెస్తాయి. కానీ.. ఎస్‌బీఐ అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకోవడం విశేషం. సిబిల్ స్కోర్ (151- 200) తక్కువగా ఉన్న వారికి, లేదంటే.. అసలు క్రెడిట్ స్కోర్ లేని ఖాతాదారులకు గృహ రుణాలు, టాప్ అప్ రుణాలు కూడా ఇవ్వాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. అదే విధంగా టాప్‌అప్ రుణాలపై 65 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రాయితీ కల్పించనున్నట్టు పేర్కొంది.

ఇప్పటికే ఇంటి రుణం తీసుకున్న వారు టాప్‌అప్ రుణాలు తీసుకోవడానికి అర్హులు. దీని కోసం మళ్లీ ప్రత్యేక డాక్యుమెంటేషన్ అవసరం ఉండదు. ఒక విధంగా ప్రస్తుత ఇంటిపైనే అదనపు అప్పు పొందడం. టాప్ అప్ రుణాలు పొందాలనుకునే ఖాతాదారుల సిబిల్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉంటే 45 బేసిస్ పాయింట్ల వరకు రాయితీ పొందవచ్చు. వీరికి 9.10 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంటుంది. క్రెడిట్ స్కోర్ 700-749, 151-200 ఉన్న ఖాతాదారులు 45 బేసిస్ పాయింట్ల వరకు సబ్సీడీని పొందడంతో 9.30 శాతానికి టాప్‌అప్ రుణం తీసుకోవచ్చు. ఎలాంటి క్రెడిట్ స్కోరూ లేని వారికీ 65 బేసిస్ పాయింట్లు రాయితీ ఇస్తున్నారు. అదే విధంగా గృహ రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు రూ.2 వేలు నుంచి రూ.10 వేల మధ్య ఉంటాయి. జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఎస్‌బీఐ బ్యాంకు నిర్వహించే ఈ క్యాంపెయిన్‌లో సిబిల్ స్కోర్ 750పైగా ఉన్న వారికి 55 బేసిస్ పాయింట్ల వరకు రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించింది. దీంతో 8.60 శాతానికే గృహ రుణం పొందవచ్చు. ఇప్పటికే అమ్మేందుకు సిద్ధంగా (రెడీ టు మూవ్) ఉన్న ఇళ్లను కొనుగోలు చేయాలనుకున్న వారి సిబిల్ స్కోర్ 700 పైగా ఉంటే పైన పేర్కొన్న రాయితీల కంటే అదనంగా 20 బేసిస్ పాయింట్ల మేర రాయితీ పొందవచ్చని ఎస్‌బిఐ తెలిపింది. దీంతో క్రెడిట్ స్కోర్ 750 కంటే ఎక్కువగా ఉన్నట్లయితే 8.40 శాతానికి, 700-749 మధ్య ఉంటే 8.50 శాతానికి గృహ రుణాలు పొందడానికి వీలుంది.

లంచం కేసులో
గెయిల్ ఉన్నతాధికారి అరెస్ట్

- కెబి సింగ్‌ను విచారిస్తున్న సీబీఐ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద గ్యాస్ సరఫరాదారు గెయిల్ ఇండియాలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్ట్) కెబి సింగ్ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో ఆయన్ను సీబీఐ అరెస్ట్ చేసి విచారిస్తోంది. ఈ కేసులో వడోదరకు చెందిన అడ్వాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ సురేందర్ కుమార్‌తో సహా మరో నలుగురిని అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టులలో రూ.50 లక్షలు తీసుకుని కొందరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహారించారనే లంచం కేసులో కెబి సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం నుంచి అంగుల్, విజయపూర్ నుంచి ఔరయ్య అనే రెండు పైప్‌లైన్ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించినందుకు లంచం చెల్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. లంచం మార్పిడికి సంబంధించి సీబీఐకి సమాచారం అందడంతో సోమవారం నుంచి విచారణ ప్రారంభించి అరెస్టులు చేసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ, నోయిడా, విశాఖపట్నంలోని పలు ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

నిధుల సమీకరణలో ముత్తూట్ ఫిన్‌కార్ప్


హైదరాబాద్ : ముత్తూట్ ఫిన్‌కార్ప్ సంస్థ నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీ) చేయడం జారీ ద్వారా రూ.400 కోట్ల వరకు సమీకరించాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. రూ.100 కోట్ల తొలి విడత జారీ చేసి.. మరో రూ.300 కోట్ల గ్రీన్ షూ అప్షన్‌తో కలిపి మొత్తంగా రూ.400 కోట్లు నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. రూ.1,000 ముఖ విలువ ఉండే ఎన్‌సీడీలు సెప్టెంబర్ 14 వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. 24 నెలల నుంచి 96 నెలల వరకు కాలావ్యవధి ఉండే వీటిపై రాబడి రేటు 8.65 శాతం నుంచి 9.43 శాతం దాకా ఉంటుందని వెల్లడించింది.

ద్వితీయ శ్రేణుల నుంచే అర్జీలు

- ఉమ్మడి కరీంనగర్ బీజేపీలో కనిపించని స్ట్రాంగ్ లీడర్
- ఒకట్రెండు చోట్ల తప్ప బలమైన అభ్యర్థులు కరువు
- గత ఎన్నికల్లో హుజూరాబాద్, మంథనిలో నోటాకొచ్చిన ఓట్లూ రాని వైనం
- పోటీపై స్పష్టత లేని కరీంనగర్ ఎంపీ సంజయ్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఈసారి ఎన్నికల్లోనూ బీజేపీ పోటీనిచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గత ఎన్నికల్లో ఒకట్రెండు చోట్ల తప్ప మిగిలిన స్థానాల్లో మూడు, నాలుగు స్థానాలు సహా కనీసం 'నోటా'కు వచ్చిన ఓట్లూ సాధించలేకపోయింది. ఇప్పుడు కూడా బలమైన అభ్యర్థులు కనిపించడం లేదు. కరీంనగర్ ఎంపీ సంజయ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారో స్పష్టత లేదు. మరోవైపు బీఆర్ఎస్ నుంచి బలమైన నేతగా ఎదిగిన ఈటల ప్రస్తుతం బీజేపీలో ఉండటం, ఆయనకు వచ్చే ఓట్ల శాతమే ఇప్పుడు ఆ పార్టీకి ప్లస్ కానుంది. ఉమ్మడి కరీంనగర్‌లో గత ఎన్నికల్లో కమలం పార్టీకి వచ్చిన ఓట్లు, ఇతర అంశాలపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం.కరీంనగర్ నుంచి బండి సంజయ్ 2014, 2018 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైనా తనపై గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచారు. తరువాత 2019లో వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన ఆయన ప్రస్తుతం ఎక్కడి నుంచి పోటీ చేస్తారో స్పష్టత లేదు. అయితే, కరీంనగర్ స్థానాన్ని వదులుకుని ఎల్బీనగర్, వేములవాడ, సిరిసిల్ల స్థానాల నుంచి పోటీ చేస్తారనే వార్తలు వస్తున్నాయి. అయితే, వాటిపైనా ఆయన అనుచరుల్లోగానీ, పార్టీ శ్రేణుల్లోగానీ కనీస స్పష్టత కరువైంది.



హుజూరాబాద్‌లో 'ఈటల' బలమే..

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఈటల రాజేందర్ బలమే ఇప్పుడు కమలం పార్టీ తమ బలమని చెప్పుకునేందుకు ప్లస్ పాయింట్‌గా మారింది. 2018 సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన ఈటల రాజేందర్‌కు లక్షా 4వేల 840 ఓట్లు వస్తే.. కాంగ్రెస్ అభ్యర్థి పాడి కౌశిక్‌కు 61,121ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ నోటాకు 2867ఓట్లు రాగా, స్వతంత్ర్య అభ్యర్థి బరిగె గట్టయ్యకు 2660 ఓట్లు వచ్చాయి. బీజేపీ నుంచి పోటీ చేసిన పుప్పాల రఘుకు 1683ఓట్లు మాత్రమే వచ్చాయి. కమలం పార్టీ ఐదో స్థానంలో నిలిచింది. అక్కడ ఏనాడూ 2వేల ఓట్లు కూడా సాధించని బీజేపీకి రాజేందర్ చేరికతో బలం వచ్చినట్టయింది. అక్కడ రాజేందర్ బలమే తప్ప ఆ పార్టీకి ఓటింగ్ లేదని విశ్లేషకులు అంటున్నారు.

మిగిలిన 11స్థానాల్లోనూ బలహీనంగానే..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ నెలకొనే అవకాశం ఉంది. ఎక్కడా బీజేపీ పోటీనిచ్చే పరిస్థితి లేదనే చెప్పొచ్చు. అన్ని స్థానాల్లో ద్వితీయశ్రేణి నాయకులు, పెద్దగా ప్రజల్లో పేరూ లేని నాయకులే ఆ పార్టీ టిక్కెట్ ఆశిస్తుండటం గమనార్హం. గత ఎన్నికల్లో కరీంనగర్ మినహా ఏ నియోజకవర్గంలోనూ కనీసం 5వేల ఓట్లు కూడా సాధించలేకపోయింది. ప్రస్తుతం వేములవాడలో చెన్నమనేని కుటుంబం నుంచి వికాస్‌రావు, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్మెన్ తుల ఉమ బీజేపీ టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. వారు కొంత పేరున్న లీడర్లు అయినా.. గత ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన ప్రతాప రామకృష్ణకు 6,592ఓట్లు మాత్రమే వచ్చి మూడో స్థానంలో నిలిచారు. తరువాత చొప్పదండిలో 2014లో ఎమ్మెల్యేగా గెలిచి 2018లో బీజేపీ నుంచి పోటీ చేసిన తుల ఉమకు 15వేల ఓట్లు మాత్రమే వచ్చి మూడో స్థానంలో నిలిచారు. ధర్మపురిలో కేవలం 447ఓట్ల తేడాతోనే కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై ఓడిపోగా.. ఇక్కడ బీజేపీ అభ్యర్థి అంజయ్యకు 5272ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఆ పార్టీ నాలుగో స్థానంలో నిలిచింది. మానకొండూర్‌లో కూడా బీజేపీ అభ్యర్థి నాగరాజుకు 4356ఓట్లు మాత్రమే వచ్చి నాలుగో స్థానానికి పరిమితమైంది. ఇక్కడ సమాజ్‌వాది ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థికి 13,610ఓట్లు రావడం గమనార్హం. హుస్నాబాద్‌లో తెలంగాణ ఇంటి పార్టీ నుంచి పోటీ చేసిన తిరుపతిరెడ్డికి 4556 ఓట్లు రాగా కనీసం ఈ పార్టీతోనూ బీజేపీ పోటీపడలేక 4309ఓట్లు మాత్రమే సాధించింది. సిరిసిల్లలో బీఎస్పీతోనూ పోటీపడలేక 3243ఓట్లు మాత్రమే వచ్చిన బీజేపీకి నాలుగో స్థానమే దక్కింది. జగిత్యాలలో కూడా 4817 ఓట్లు మాత్రమే పోలైన బీజేపీ మూడో స్థానానికి పరిమితమైంది. కోరుట్లలో కొంత మెరుగ్గా 16వేల ఓట్లు సాధించినా.. ఇక్కడా మూడో స్థానమే పదిలమైంది. పెద్దపల్లి నియోజకవర్గంలో బీజేపీ సీనియర్ నేత గుజ్జుల రామకృష్ణారెడ్డికి కూడా 9375ఓట్లు మాత్రమే వచ్చాయి. మంథనిలో కమలం పార్టీ పరిస్థితి మరీ దారుణంగా ఉందని చెప్పొచ్చు. గత ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ, సమాజ్‌వాదీ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలనూ తట్టుకోలేకపోయింది. ఇక్కడ 1876 ఓట్లు మాత్రమే పోలై ఐదో స్థానానికి పరిమితమైంది. రామగుండం నియోజకవర్గంలో 1553 ఓట్లు మాత్రమే సాధించిన బీజేపీ అభ్యర్థి బల్మూరి వనిత ఆరో స్థానంలో నిలిచారు.

మణిపూర్‌లో మితిమీరిన హక్కుల ఉల్లంఘన

విద్వేష ప్రసంగాలతో హింసాకాండ

- ఐరాస నిపుణుల ఆందోళన



న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండలో మానవ హక్కుల ఉల్లంఘన మితిమీరిపోయిందని ఐక్యరాజ్యసమితి నిపుణుల బృందం ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై పాలకుల స్పందన సరిగా లేదని విమర్శించింది. మణిపూర్‌లో పరిస్థితి తీవ్రంగా ఉన్నదని అంటూ లైంగిక హింస, ఆటవిక హత్యలు, గృహ విధ్వంసాలు, బలవంతపు నిర్బంధాలు, అమానుష ప్రవర్తన పెచ్చు మీరిపోయాయని మండిపడింది. ఈ మేరకు 18 మందితో కూడిన మానవ హక్కులనిపుణుల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది. ఐరాస మానవ హక్కుల మండలిలో పని చేస్తున్న ప్రత్యేక విలేకరులలో పలువురు ఈ బృందంలో సభ్యులుగా వ్యవహరించారు. 'మణిపూర్‌లో హింసాకాండ పెచ్చరిల్లింది. సామూహిక లైంగికదాడులు చేయడం, వీధుల్లో మహిళల్ని నగ్నంగా ఊరేగించడం, దారుణంగా కొట్టి చంపడం, సజీవ దహనం చేయడం వంటి దారుణాలు అనేకం జరిగాయి. సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టేలా విద్వేష ప్రసంగాలు చేస్తూ హింసను ప్రేరేపించారు. కుకీ మైనారిటీలు... ముఖ్యంగా మహిళల్ని లక్ష్యంగా చేసుకొని వేధింపులకు తెగబడ్డారు. న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు నిజ నిర్ధారణ కోసం మణిపూర్‌కు బృందంగా వెళితే వారిని వేధించారు. వాస్తవాలు తెలుసుకునేందుకు వెళ్లిన ఎడిటర్స్ గిల్డ్ పాత్రికేయుల పైనే కేసులు పెట్టారు. చివరికి మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ సైతం ఎడిటర్స్ గిల్డ్‌నే దూషించారు. మణిపూర్‌లో జరిగింది ప్రభుత్వ ప్రేరేపిత హింసాకాండేనని తేల్చిన మహిళా సమాఖ్య సభ్యుల పైన కూడా కేసులు పెట్టారు' అని నిపుణుల బృందం తెలిపింది. మణిపూర్ హింసపై కేంద్రం స్పందన కూడా సరిగా లేదని నిపుణుల బృందం ఎత్తిపొడిచింది. కాగా నిపుణుల బృందం ప్రకటన అవాంఛనీయం, ఊహాజనితం అని కేంద్రం వ్యాఖ్యానించింది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించింది.

హైదరాబాద్ అతలాకుతలం

నీట మునిగిన కాలనీలు, అపార్టుమెంట్లు, అండర్ పాస్‌లు

- మైసమ్మగూడలో అపార్టుమెంట్ల మొదటి అంతస్తుల్లోకి మురుగు నీరు
- నాలాలో కొట్టుకుపోయిన బాలుడు
- జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షం బీభత్సం సృష్టించింది. నగరంలో పలుచోట్ల సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. అనేక ప్రాంతాల్లో కాలనీలకు కాలనీలు మురుగు నీటితో నిండాయి. బాచుపల్లిలో నాలుగేండ్ల బాలుడు మూత లేని మ్యాన్‌హోల్‌లో పడి నాలాలో కొట్టుకుపోయి మృతిచెందాడు. పలు బస్తీల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. లింగంపల్లి అండర్ పాస్ వద్ద భారీగా వర్షం నీళ్లు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. నాలాలు పొంగి ప్రవహించాయి. రోడ్లు చెరువులను తలపించాయి. ఒకే రోజు 18 సెంటీమీటర్ల వర్షం కురవడంతో పటేల్ చెరువు తెగిపోయింది.మేడ్చల్ జిల్లాలో పలు కాలనీలు, అపార్టుమెంట్లు నీట మునిగాయి. గణేష్‌నగర్, చింతల్, అయోధ్యనగర్, మైసమ్మగూడలో దాదాపు 25 అపార్టుమెంట్లలోని మొదటి అంతస్తులు నీటమునిగాయి. ఆ ప్రాంతంలో కాలేజీలు, హాస్టళ్లు ఉండటంతో అప్రమత్తమైన జీహెచ్ఎంసీ సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందాలు మోటార్ల సహాయంతో నీటిని తోడేశారు. విద్యార్థులను ప్రొక్లెయిన్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొని.. సమస్యలు లేకుండా ప్రయత్నించారు.

లాల్ బంగ్లాలో వరద

బేగంపేట్‌లోని లాల్‌బంగ్లా భవనం వరద నీటిలో మునిగిపోయింది. సెల్లార్ పూర్తిగా నీట మునగడంతో దాదాపు 20కి పైగా షాప్‌లు నీటిలోనే ఉండిపోయాయి. పలు ప్రాంతాల్లో దుకాణాల్లోకి నీరు చేరడంతో వస్తువులు, డాక్యుమెంట్లు, ఫర్నీచర్ పూర్తిగా తడిచాయి. వర్షం.. నీటి వల్ల ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.

వర్క్ ఫ్రమ్ హోమ్ బెటర్..

వర్షాల కారణంగా ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం, సాయంత్రం వేళల్లో సమస్య మరింత తీవ్రంగా ఉండటంతో అప్రమత్తమైన పోలీస్ అధికారులు ఐటీ యాజమాన్యాలకు కీలక సూచన చేశారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

మెట్రో స్టేషన్ నుంచి కిలోమీటర్ల మేర వాహనాలు

మెట్రో స్టేషన్ ఉన్న ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఆయా ప్రాంతాల్లో మెట్రోస్టేషన్ల వద్ద మోకాలి లోతు నీరు ఉండటంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. మూసాపేట్ మెట్రో స్టేషన్ కింద వరద నీరు నిలువడంతో ఎర్రగడ్డ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వైపు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మూసాపేట్ మెట్రో స్టేషన్ నుంచి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

మేయర్ తీరుపై ఆగ్రహం

భారీ వర్షాల నేపథ్యంలో నగరవాసులను అలర్ట్ చెయ్యడంలో జీహెచ్ఎంసీ పూర్తిగా విఫలమైందని మేయర్ తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వర్షం కారణంగా అనేక కాలనీలు నీటమునిగినా మేయర్ అక్కడి వరకు వెళ్లకుండానే ఫొటో ఎగ్జిబిషన్‌కు వచ్చినట్టు వచ్చి వెళ్లారని విమర్శిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో అధికారులు హై అలర్ట్ జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జీహెచ్ఎంసీ డిజాస్టర్ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. వందలాది కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

భారీ వర్షాల నేపథ్యంలో చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. మియాపూర్ సర్కిల్‌లో తెగిపోయిన పటేల్ చెరువును మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. జీహెచ్ ఎంసీ పరిధిలో ఉన్న చెరువుల వద్ద వరద పరిస్థితిని గమనించి అప్రమత్తంగా ఉండి లోతట్టు ప్రాంతాలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కుత్బుల్లాపూర్‌లో...

జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురుస్తుండటంతో జంట జలాశయాలకు వరద పోటెత్తింది. ఇప్పటికే నిండు కుండల్లా ఉన్న హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు, ఉస్మాన్‌సాగర్ రెండు గేట్లను అధికారులు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. దీంతో మూసీ నదిలో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. చాదర్‌ఘాట్ లోయర్ బ్రిడ్జి సమీపంలో కాలనీవాసులను ఇండ్లు ఖాళీ చేయాలని ఆదేశించారు. మూసారం బ్రిడ్జి వద్ద వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నాలాలో పడి బాలుడు మృతి

హైదరాబాద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ పరిధిలో మంగళవారం ఉదయం నాలాలో పడి బాలుడు మృతి చెందాడు. వర్షాలతో నాలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో ఎన్ఆర్ఐ కాలనీకి చెందిన బాలుడు మిథున్‌రెడ్డి (4) బయటకు వెళ్లగా.. మూతలేని మ్యాన్‌హోల్‌లో పడిపోయాడు. తల్లిదండ్రులు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంటల తరబడి పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ల ఆధారంగా బాలుడు నాలాలో పడి కొట్టుకుపోయినట్టు గుర్తించారు.

తల నరికితే రూ.10 కోట్లు

ఎవరూ రాకపోతే.. ఆ పని నేనే చేస్తా : యూపీ స్వామిజీ వార్నింగ్

- తగ్గేదేలేదు..ఎవరికీ భయపడను..
- నా తల దువ్వుకోవటానికి రూ.10 దువ్వెన చాలు..: తమిళనాడుమంత్రి ఉదయనిధి స్టాలిన్



చెన్నై: సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగుతోంది. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ స్వామీజీ ఉదయనిధిపై బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మానికి వ్యతి రేకంగా వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి తలపై రూ.10 కోట్ల రివార్డు ప్రకటించారు. ఆ పని ఎవరూ చేయడానికి ముందుకు రాకపోతే.. తానే చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ బెదిరింపులపై ఉదయనిధి స్పందిస్తూ.. 'నా ప్రాణాలకు ముప్పు ఉంది. నా తల కోసం రూ. 10 కోట్లు అవసరం లేదు. నా తల దువ్వుకోవడానికి పది రూపాయల దువ్వెన సరిపోతుంది. నాకోసం అంత మొత్తం వెచ్చించాల్సిన అవసరం లేదు. ఇలాంటి బెదిరింపులు మాకు కొత్తేమి కాదు. ఎవరి బెదిరింపులకు భయపడను. తమిళనాడు ప్రజల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టిన వ్యక్తి (కరుణానిధి) మనవడిని నేను 'అంటూ స్వామీజీ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. ఇదిలా ఉండగా సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడటాన్ని ఆపేది లేదని ఉదయనిధి స్పష్టం చేశారు. అందరికీ అన్నీ దక్కాలన్నదే ద్రావిడ మోడల్ ఉద్దేశమని తెలిపారు. ఈ వ్యవహారంలో తనపై ఎలాంటి కేసులు వేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు స్పష్టం చేశారు.

నిరసనల బాట..బుజ్జగింపుల పాట

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆయన త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. దీంతోపాటు సిరిసిల్ల, సిద్ధిపేటలో మత్స్యకారులు, ముదిరాజ్‌లు కలిసి ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆ రెండు నియోజకవర్గాల్లో అత్యధిక ఓటు బ్యాంకు కలిగి, బలమైన సామాజిక వర్గంగా ఉన్న తమకే టిక్కెట్ కేటాయించాలంటూ వారు పట్టుబడుతున్నారు. పటాన్‌చెరు నియోజక వర్గం లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నీలం మధు కూడా కారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేశారు. అనేక ఏండ్లుగా బీఆర్ఎస్ అభివృద్ధి కోసం పని చేస్తూ, అనునిత్యం ప్రజల్లో ఉంటున్న తనను కాదని వేరే వారికి టిక్కెట్ కేటాయించటంపై ఆయన సీరియస్‌గా ఉన్నారని ఆ నియోజకవర్గ నేతలు చెబుతున్నారు. ప్రస్తుత అభ్యర్థిని మార్చి.. కచ్చితంగా టిక్కెట్ తనకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పోటీలో ఉండి తీరతానంటూ ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని రామేశ్వరం బండ, గుమ్మడిదలతోపాటు అనేక గ్రామాల ప్రజలు తనకు మద్దతునిస్తున్నారంటూ మధు వివరించారు. జహీరాబాద్ టిక్కెట్‌ను ఆశించిన ఢిల్లీ వసంత్... బీఆర్ఎస్ అధిష్టానంపై తనదైన పద్ధతుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం 'మట్టి మనుషుల మనోగతం-భూమి పుత్రుల ఆకలి కేక' అంటూ జహీరాబాద్‌లో చక్కెర కర్మాగారం అంశంపై వినూత్న రీతిలో కార్యక్రమం చేపట్టారు. దళిత బంధు కింద ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో కర్మాగారాన్ని కొనేద్దామంటూ ఆయన ప్రతిపాదిం చారు. లబ్దిదారులను షేర్ హోల్డర్లుగా మార్చాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు విన్నవించారు.

ఇలా రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ సీటు దక్కని ఆశావహులు తమదైన పద్ధతుల్లో ధిక్కార స్వరాలు వినిపిస్తున్నారు. టిక్కెట్ దక్కిన నేతలకు వీరిని ప్రసన్నం చేసుకోవటం ఓ సవాలుగా మారింది. వీరి బుజ్జగింపులు పని చేయకపోవటంతో సీఎం కేసీఆర్...ట్రబుల్ షూటర్ హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. ఆయన ఇప్పటికే పటాన్‌చెరు, నర్సాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, ఆలంపూర్, జనగాం తదితర ప్రాంతాల్లోని నేతలతో మంతనాలు జరిపారు. అక్కడి 'రెబల్స్'ను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీకి, సీఎం కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్న నేతలను అసంతృప్తుల ఇండ్లకు పంపి, వేడిని చల్లార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ వారు మాత్రం 'తగ్గేదేలే' అంటున్నట్టు సమాచారం. అధికార పార్టీ నుంచి సీటొస్తే ఓకే.. లేదంటే, ఏదో ఒక పార్టీ నుంచి, అదీ కుదరకపోతే స్వతంత్రులుగానైనా బరిలోకి దిగుతామంటూ హెచ్చరిస్తుండటం గమనార్హం.

ఎన్డీఏకు ఇండియా జ్వరం..

(మొదటిపేజీ తరువాయి)

కూటమిని చూసి కేంద్రం ఆందోళన చెందుతోందని చెప్పారు. తాము ప్రతిపక్ష కూటమికి ఇండియా పేరు పెడితే ప్రభుత్వం దేశం పేరైన ఇండియానే మార్చాలని చూస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల ఐక్యతా బలాన్ని బీజేపీ గుర్తించిందని, అందుకే ఇండియా అనే పేరు వింటేనే భయపడుతోందని ఎత్తిపొడిచారు. ఎన్నికల్లో బీజేపీని ఇండియా ఇంటికి సాగనంపుతుందని చెప్పారు. ఇండియా కూటమిని చూసి కలవరపడిన బీజేపీ ఇప్పుడు దేశం పేరును మార్చేందుకు సిద్ధపడిందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. 'రేపు మేము మా కూటమి పేరును భారత్‌గా మార్చుకుంటే భారత్ పేరును కూడా మారుస్తారా?' అని ప్రశ్నించారు. ఇండియాను చూసి బీజేపీ భయపడుతోందని, ఆ పార్టీవి చిల్లర రాజకీయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. 'భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 చెబుతోంది. ఇండియా పేరు వింటేనే బీజేపీ భయపడుతోంది. దానివి చిల్లర రాజకీయాలు. మోడీజీ...ప్రయత్నించండి. జుడేగా భారత్...జీతేగా ఇండియా' అని ఆయన ట్వీట్ చేశారు.

ప్రతిపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టి కేవలం కొన్ని వారాలే అయిందని, అంతలోనే బీజేపీ ఆహ్వాన పత్రికల్లో ఇండియా పేరును భారత్‌గా మార్చేసిందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా చెప్పారు. తమ నుండి ఇండియాను కానీ, భారత్‌ను కానీ మోడీ లాగేసుకోలేరని అన్నారు.

వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షంతో జనజీవనం పూర్తిగా స్తంభించిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని పేర్కొన్నారు. అనేక బస్తీలు మునిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలు కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యార్థుల హాస్టళ్లకు నీరు చేరడంతో ఖాళీ చేయించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. చాలా ప్రాంతాల్లో మోకాలిలోతు నీరు నిలిచిపోయి ట్రాఫిక్ అస్తవ్యస్తమైందని పేర్కొన్నారు. చెరువులు, నాలాలు కబ్జాలకు గురికావడం, ప్రభుత్వానికి దీర్ఘకాలిక దృష్టి లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు. డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. వరదలు వచ్చినపుడు హడావుడి చేయడం కాకుండా ముంపు నివారణకు శాశ్వత పరిష్కార మార్గాల పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా చూడాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోను, ఇతర జిల్లాల్లోను పార్టీ నాయకత్వం, శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి, సహాయక కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

వాన ఉధృతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్

వాతావరణశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరుతోంది. మూలవాగు, మోయ తుమ్మెద వాగు పొంగిపొర్లుతోంది. ఎస్ఆర్ఎస్పీ, కడెం డ్యాం నుంచి పెద్ద ఎత్తున వరద జిల్లాకు చేరు తుండగా.. మధ్యమానేరు, దిగువ మానేరు సహా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్న క్రమంలో మంగళవారం ఉదయం వరకు సిరిసిల్ల, తంగళ్లపల్లి, వేములవాడ మండలాల్లో 12 సెంటీ మీటర్ల వర్షం కురిసింది.

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

దిగువమానేరు డ్యామ్ పూర్తి స్థాయిలో నిండింది. మధ్యమానేరు నుంచి 32వేల క్యూసెక్కులు, మోయ తుమ్మెద వాగు నుంచి 20వేల క్యూసెక్కుల వరద కొనసాగుతుండగా.. ఆ ప్రాజెక్టు 6 గేట్లు రెండు ఫీట్ల మేర ఎత్తి దిగువకు 18వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం నీటి మట్టం 21 టీఎంసీలు కాగా మరో రెండు టీఎంసీల నీరు వచ్చి చేరితే మరిన్ని గేట్లు తెరుస్తామని అధికారులు పేర్కొన్నారు. మధ్యమానేరు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి, మూలవాగు ద్వారా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 5గేట్లు ఎత్తి దిగువకు ఎల్ఎమ్‌డికిలోకి నీళ్లు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం డ్యాం నుంచి 10415 క్యూసెక్కులు, ఎస్ఆర్ఎస్పీ నుంచి 85,840 క్యూసెక్కులు, ఇతర వాగులు, వంకల నుంచి మొత్తంగా 2లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

నల్లగొండ జిల్లా కేతపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి దిగువ మూసీలోకి 3525 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి 1055 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 643.60 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి ఉండటంతో పరిస్థితిని ఎప్పటికికప్పుడూ సమీక్షిస్తున్నామని డీఈఈ చంద్రశేఖర్ ఏఈఈ ఉదయ్ కుమార్ మమత చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రుద్రవెల్లి మూసీ బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ప్రభావం భారీగా ఉండటంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు బీబీనగర్ - పోచంపల్లి వెళ్లే రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. బ్రిడ్జి రెండు వైపులా ముళ్ళకంచె, భారీకేడ్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కాళేశ్వరం వద్ద గోదావరి నది ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద లక్షల కూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

చిట్యాలలో ఇద్దరు మహిళా కూలీలు, కాటారంలో ఒకరు

నవతెలంగాణ-చిట్యాల

పిడుగుపాటుకు జయశంకర్-భూపా లపల్లి జిల్లాలో ముగ్గురు ప్రాణం కోల్పో యారు. మరో నలుగురికి గాయాలయ్యా యి. వివరాల్లోకెళ్తే చిట్యాల మండల కేంద్రం రాంనగర్ కాలనీకి చెందిన చిలువేరు సరిత(40), నేర్పాటి మమత(30) మరి కొంత మంది కూలీలు ఓ రైతు పొలంలో మిరప నారు నాటేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఉరుములతో కూడిన వర్షం పడటంతో కూలీలంతా సమీపంలోని చెట్టు కిందకు వెళ్లగా ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో చిలువేరు సరిత, నేర్పాటి మమత అక్కడికక్కడే మృతిచెందారు. పర్లపల్లి భద్రమ్మ, ఆరేపల్లి కొమరమ్మ, మైదం ఉమ, శివకు తీవ్రగాయాలయ్యాయి. వారిని మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అలాగే, కాటారం మండలం దామరకుంట గ్రామానికి చెందిన కౌలు రైతు గూడూరి రాజేశ్వర రావు(46) వరి పొలంలో కలుపు తీస్తుండగా పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మహాదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళా బిల్లు కోసం కేంద్రంపై ఒత్తిడి తెండి

- పలు పార్టీలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 47 పార్టీలను కోరారు. అందుకోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయా పార్టీల నేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయా పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులకు ఆమె లేఖలు రాశారు. దేశానికి మహిళా బిల్లు చాలా కీలకమని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అమలు చారిత్రక అవసరమని తెలిపారు. దీంతో ప్రజాస్వామ్యం పరిపూర్ణమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తన లేఖపై ఎన్ సీపీ, జేడీయూ, సమాజ్ వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ స్పందించాయని కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు

గుజరాత్ లో నకిలీ ఆధార్, పాన్ కార్డుల తయారీ ముఠా .. ఇద్దరు అరెస్ట్


గాంధీనగర్ : ఆధార్, పాన్ కార్డులను ఫోర్జరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నకిలీ పత్రాలతో బ్యాంకు రుణాలను పొందినట్టు ప్రయివేటు బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నకిలీ ఉదంతం వెలుగులోకి వచ్చిందని మంగళవారం అధికారులు తెలిపారు. దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వెబ్ సైట్ ద్వారా సుమారు రెండు లక్షలకు పైగా ఆధార్, పాన్ కార్డులతో పాటు ఓటర్ ఐడీ కార్డులను ఫోర్జరీ చేసినట్టు వెల్లడించారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు

(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,160	▼ 160
22 క్యారెట్లు	- 55,150	▼ 150
కిలో వెండి	- 79,000	▼ 1000



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 134
రిటైల్ (లైవ్)	రూ. 156
స్కిన్‌తో	రూ. 226
స్కిన్‌లెస్	రూ. 257

ఘనంగా బోడ్రాయి ఉత్సవాలు



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేటలో బోడ్రాయి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ కార్యదర్శి దండెం రాంరెడ్డి, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దండెం రాంరెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని మనస్పూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



నవతెలంగాణ-తుర్కయంజాల్

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పురపాలిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పురపాలికలోని లోతట్టు ప్రాంతాలలో క్షేత్ర పరిశీలన చేసి, పరిస్థితులపై అరా తీశారు. అత్యవసర పరిస్థితుల్లో కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం ఫోన్ నెంబర్లు 9550438213, 9966995842లను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, జవాన్లు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలి



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

ఎల్బీనగర్ నియోజకర్గ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి..రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్‌కు సూచించారు. హయత్‌నగర్ ఎం.ఆర్.ఓ. కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలపై సరూర్ నగర్, హయత్ నగర్ రెవెన్యూ అధికారులతో సర్వే చేయించాలని కలెక్టర్‌కు సూచించారు. 93/1 సర్వే నెంబర్ మన్సూరాబాద్ నందు రెండు ఎకరాల ఇరవై గుంటల స్థలం ఉండాలి.. కానీ గతంలో సర్వే చేసినప్పుడు 20 గుంటలు మాత్రమే ఉందని తేలిందన్నారు. దానిమీద సమగ్ర సర్వే చేసి నివేదిక తెప్పించుకోవాలని అన్నారు. అలాగే లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ నందు ఇరిగేషన్ శాఖ ఇప్పటికే సర్వే చేశారని గుర్తుచేశారు. కానీ నివేదిక ఇవ్వడంలో ఆలస్యం జరుగుతుందని..కావున వెంటనే నివేదిక తెప్పించుకొని తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. 118 జీవోలో కొన్ని రకాల ఇబ్బందులు ఎదురవ్వడం జరుగుతుందన్నారు. ఖాళీ స్థలాలు ఉన్న వారు ప్రభుత్వానికి డబ్బులు కట్టారని, వారి దగ్గరకు ఎంక్వైరీ కోసం ఎవరు రాలేదని, కావున ఈ విషయం మీద అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. అలాగే 255 సర్వే నెంబర్ నందు రైతుల భూములు గతంలో హెచ్.ఎం.డీ.ఏ.డెవలప్మెంట్ చేస్తా అని చెప్పి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు చేయలేక పోయిందని చెప్పారు. కావున రైతులు తమ భూమిని సొంతంగా దున్నుకునే విధంగా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అలాగే ధాతునగర్ కాలనీ నందు యూ.ఎల్.సీ.విషయం నందు తుది నిర్ణయం తీసుకోవాలని కోరారు. నందనవనం నందు కబ్జా అయిన డబల్ బెడ్ రూమ్స్ నందు అసలైన లబ్దిదారులు ఉండడం జరిగింది..కావున అసలైన లబ్దిదారులకు ఇండ్లు ఇవ్వాలన్నారు. ఈ ఇండ్లను లాటరీ పద్ధతిలో ఎవరికి కేటాయించవొద్దు అని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే పైన పేర్కొన్నటువంటి పలు సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పలువురు ఆర్.డి.ఓ.లు, ఎం.ఆర్.ఓ.లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పలు డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పలు కాలనీ వాసులు, నాయకులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



- మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బలాల

నవతెలంగాణ -సంతోష్ నగర్

యువత చెడు మార్గాల్లో పయనించకుండా.. అన్ని మార్గాల్లో రాణించాలని ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలోని చౌని డివిజన్ పెషావర్ హోటల్ ఎదురుగా మెరిడియన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ప్రారంభించిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి కార్పొరేటర్ ఎండి సైఫుద్దీన్ షఫీతో కలిసి మంత్రి, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఉన్న నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేటు కంపెనీలు, సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన జాబ్ మేళాను సద్వినియోగించుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకోవాలన్నారు. నిరుద్యోగ యువత మనస్థాపానికి గురి కాకుండా కృషి పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. మహిళల కోసం ప్రత్యేక జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అనంతరం నియోజకవర్గం స్థానిక అభ్యర్థులకు ఎంపికైన వారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు



నవతెలంగాణ - ధూల్ పేట్

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న పర్యవేక్షణలో ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, ఎస్ఈ, ఈఈలు, డీఆర్ఎఫ్, మన్సూన్ ఎమర్జెన్సీ బృందాలతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ చార్మినార్ జోన్ పరిధిలోని మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్లలో జలమయమైన పలు లోతట్టు ప్రాంతాల్లో ఉదయం నుంచి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రౌండ్ ది క్లాక్ అందుబాటులో..

భారీ వర్షాల నేపథ్యంలో చార్మినార్ జోన్ పరిధిలో మన్సూన్ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి..రౌండ్ ది క్లాక్ సిబ్బందిని అందుబాటులో ఉంచి, డీఆర్ఎఫ్, మన్సూన్ ఎమర్జెన్సీ బృందాలతో అవసరమైన సహక చర్యలు చేపడుతున్నామని జోనల్ కమిషనర్ టీ.వెంకన్న తెలిపారు. భారీ వర్షాలతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాల్లో సామర్థ్యానికి మించి నీటిమట్టం పెరగడంతో నీటి పారుదల శాఖ అధికారులు పలు గేట్లను ఎత్తి వేసి దిగువ ప్రాంతాలకు నీటిని వదిలినట్లు చెప్పారు. మూసి నది పరివాహక ప్రాంతాల్లో నివాసముండే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు ఏమైనా సమస్యలు తలెత్తితే జోనల్ కార్యాలయంలో రౌండ్ ది క్లాక్ ఏర్పాటు చేసిన ప్రత్యేక మన్సూన్ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ (040-29560671) నెంబర్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపడతారని అన్నారు. ఈ పర్యవేక్షణలో ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు జయంత్, నరసింహ, షనవాజ్, డీడీ నాయక్, రాజేందర్ రెడ్డి, రవికుమార్, అధికారులు, డీఆర్ఎఫ్, ప్రత్యేక మన్సూన్ బృందాలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - ఎల్బీనగర్

కొలను శివారెడ్డి నగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ కమిటీ నాయకులు కోరారు. కొలను శివారెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు.. కాలనీలో వాటర్ లైన్ కనెక్షన్, డ్రైనేజ్, సీసీ రోడ్డు, తదితర సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెలే త్వరలోనే సమస్యలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొలను నరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ వీఆర్ నందగోపాల్ రెడ్డి, ట్రెజరర్ బోగా చంద్రయ్య, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు ఖాదర్ బాషా పాల్గొన్నారు.

సిద్దాల శ్రీలతకు బెస్ట్ టీచర్ అవార్డు



నవతెలంగాణ - మీర్ పేట్

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులో లార్డ్స్ హై స్కూల్ జిల్లెలగూడకు స్థానం దక్కింది. గణిత శాస్త్రం బోధిస్తున్న లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ సిద్దాల శ్రీలతను రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ టీచర్ అవార్డుతో సత్కరించింది. ఈ అవార్డును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం శ్రీలతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి, ఎమ్మెల్యే జయపాల్ యాదవ్, లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సిద్ధాల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ లోతట్టు ప్రాంతాలలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ బానోత్ సుజాతా నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో వర్షాభావ పరిస్థితుల వలన అత్యవసర సేవల కోసం మాన్ సూన్ టీం, డి.ఆర్.ఎఫ్ టీం టోల్ ఫ్రీ నంబర్లను (9949068219,9441749486) సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కార్పొరేటర్ వెంట జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి ఉన్నారు.

నందు ఆర్మీ అకాడమీతో భవిష్యత్‌కు బాటలు



- జడ్పీటీసీ ఉప్పల్ వెంకటేష్ గుప్త

నవతెలంగాణ- చైతన్యపురి

నందు ఆర్మీ అకాడమీతో భవిష్యత్‌కు మంచి బాటలు పడుతాయని తలకొండపల్లి జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్త అన్నారు. నందు ఆర్మీ అకాడమీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా సెలెక్ట్ అయిన 62 ఎస్ఐలను మంగళవారం చైతన్యపురిలోని ఓ ఫంక్షన్ హాల్లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గుప్త మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకొని, జ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే విజయం సాధించగలుగుతారని చెప్పారు. విద్యార్థి దశ నుండే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం నందు ఆర్మీ అకాడమీ డైరెక్టర్ నందు నాయక్ మాట్లాడుతూ తమ అకాడమీలో దాదాపు 2000 మంది శిక్షణ తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన 500 ఎస్ఐ పోస్టులలో తమ దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు 62 మంది ఎస్ఐ ఉద్యోగాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, సర్పంచ్ గోపాల్ నాయక్, కానిస్టేబుల్ తావురియ నాయ క్, సరూర్నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్, రమేష్, మాధవన్, ఆర్మీ కోఆర్డినేటర్ వెంకటేష్, నందు ఆర్మీ కోచ్ సిరి పాల్గొన్నారు.

పలు పీఎస్‌లను తనిఖీ చేసిన రాచకొండ సీపీ



నవతెలంగాణ - హయత్‌నగర్

రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్, మేడిపల్లి, ఉప్పల్, నాగోల్, మీర్‌పేట్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్మెట్, సరూర్ నగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్లను రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ సోమవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్లలో రాత్రిపూట విధుల్లో ఉన్న సిబ్బంది, పెట్రోల్ కార్లు, బ్లూ కోల్ట్స్, కానిస్టేబుల్ ఇతర స్థాయిల అధికారుల పనితీరు పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రాత్రి పూట విధుల్లో మరింత శ్రద్ధగా పనిచేయాలని, తద్వారా స్మగ్లింగ్ వంటి వివిధ రకాల అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవచ్చని అన్నారు. అత్యవసర సహాయం కోసం వచ్చే ఫోన్ కాల్స్‌కు తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది సమర్థవంతంగా పని చేసేలా మానిటర్ చేస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు.

బాధ్యత కలిగిన వృత్తి.. అధ్యాపక వృత్తి

- ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయ విభాగం మాజీ డిన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



నవతెలంగాణ-వనస్థలిపురం

సమాజంలో బాధ్యత కలిగిన వృత్తి అధ్యాపక వృత్తి అని ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయ విభాగం మాజీ డిన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్.. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ బోధన ద్వారా సమాజంలో అనేక మార్పులు తీసుకురావచ్చు అని అన్నారు. కళాశాల సెక్రెటరీ గంపల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకుల మధ్య సత్సంబంధాలు ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ఆర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత, పూర్వ అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలో అధ్యాపకులు లక్ష్మి, స్వాతి, శైలజ, అనిత, ప్రభాకర్ రావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల పాత్ర వెలకట్టలేనిది

- బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం



నవతెలంగాణ- చైతన్యపురి

తొలి వైద్యులుగా, వాయిద్య కారులుగా, క్షురకులుగా సమాజ ప్రగతిలో నాయీ బ్రాహ్మణుల పాత్ర వెలకట్టలేనిది అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రాం భవనంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం దశాబ్ది ఉత్సవ నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ క్షురక వృత్తిదారులుగా సమున్నతంగా సేవలు అందించిన మంగళ్ల / నాయీ బ్రాహ్మణులకు ఈ సమాజం ఎప్పటికీ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఆధునిక వైద్యం, సాంకేతికత అందుబాటులో లేని రోజులలో అనేక మొండి వ్యాధులకు చికిత్సలు అందించిన, గర్భిణులకు పురుడు పోసిన చరిత్ర ఉందన్నారు. మంగళ వాయిద్యాలతో సైతం రోగ నివారణ చేసిన తొలి తరం వైద్యులు, శాస్త్రవేత్తలు, సౌందర్య నిపుణులు నాయీ బ్రాహ్మణులే అని కొనియాడారు. సెలూన్లకు ఉచితంగా 250యూనిట్ల విద్యుత్, బీసీ బంధు పథకంతో రూ.లక్ష ఆర్థిక చేయూతనందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాసమల్ల బాలకిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్, గడాల రాజు, ఆనందాస్, చంద్రశేఖర్, జయసింహ, వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ సిహెచ్ శ్రీనివాస్, విక్రమ్, త్యాగరాజు, నర్సింగ్, వినోద్ కుమార్, అశోక్, అంజలి, అంజయ్య, వెంకటేష్, రవికుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ కుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



నవతెలంగాణ - ధూల్ పేట్

పాతబస్తీ బండ్లగూడ మండలం పరిధిలోని పయోనీర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) బియ్యం సంతోష్ కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి చేతుల మీదుగా సంతోష్ కుమార్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బండ్లగూడ మండల డిప్యూటీ విద్యాశాఖ అధికారి ముఖరం మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ ఐఓఎస్‌లు రామ్మోహన్, జైనాబ్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు



- సీపీఐ(ఎం) పార్టీ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్

నవతెలంగాణ- సంతోష్ నగర్

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని సీపీఐ(ఎం) పార్టీ డివిజన్ కార్యదర్శి కృష్ణ నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జంగంమేట్ డివిజన్లో సీపీఐ(ఎం) పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపైన అనేక భారాలు మోపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం పరిపాలన చేస్తూ..ప్రజల మధ్య మత, కుల చిచ్చు పెడుతుందని ఆరోపించారు. నిత్యావసర ధరలను పెంచడం వలన సామాన్య ప్రజల జీవనం చాలా దుర్భరంగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నిరసనలో సీపీఐ(ఎం) పార్టీ నాయకులు శ్రీను, మహేష్, నాగేష్, సంతోష్, నవీన్, భరత్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన రఘుమారెడ్డి



నవతెలంగాణ- సంతోష్ నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయ పాలక మండలి చైర్మన్‌గా నల్ల రఘుమారెడ్డి ఇటీవల ఎన్నికయ్యారు. దేవాదాయ, ధర్మాదాయ ఉప కమిషనర్ టి.శేఖర్, రంగారెడ్డి జిల్లా ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్‌లు మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస శర్మతో కలిసి ఆలయంలో నల్ల రఘుమారెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు చైర్మన్ నల్ల రఘుమారెడ్డిని గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి, సురేందర్ రెడ్డి, తిరుమలేశ్, ఆనందకుమార్ గౌడ్, మధుసాగర్, బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్త, ఎం యాదగిరి, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బీసుకుంట్ల సతీశ్ గౌడ్, శైలజ, సురేశ్ గౌడ్, కల్యాణ్ చక్రవర్తి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా అంశాలపై సమగ్ర సమీక్ష



నవతెలంగాణ- సంతోష్ నగర్

రాబోయే ఎన్నికలు, గణేష్ ఉత్సవాలు, మిలాద్ వంటి తదితర అంశాలపై సిటీ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్..సిటీ సెక్యూరిటీ వింగ్ ఇతర కార్ యూనిట్లలో భద్రతా అంశాలు, విస్తరణ సంసిద్ధతపై మంగళవారం సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాయుధ బలగాల మోహరింపు, లాజిస్టిక్స్, ఫ్లీట్ మేనేజ్‌మెంట్ మొదలైన వాటి నుండి హైదరాబాద్ సిటీ పోలీసుల పనితీరు కోసం ఏర్పాట్లు, శాంతి భద్రతల నిర్వహణ, ముఖ్యమైన ఇన్‌స్టాలేషన్లు, ముఖ్య అతిథులకు భద్రత తదితర విషయాలపై చర్చించారు. తర్వాత మౌంటెడ్ పోలీస్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ అతను 46 గుర్రాలు, 26 కుక్కల ఆరోగ్య పరిస్థితులను వ్యక్తిగతంగా అడిగి మరి తెలుసుకున్నారు. సమీక్షలో సిటీ సెక్యూరిటీ వింగ్, హెూంగార్డ్స్, మౌంటెడ్ యూనిట్లు, డాగ్ స్క్వాడ్‌లు, వివిధ విభాగాలు ఉన్నాయి.

ప్రొఫెసర్ కోదండ రామ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- బడంగ్ పేట్

తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండ రామ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ హార్డ్ వేర్ పార్క్ వ్యతిరేక పోరాట సమితి జే.ఏ.సి. చైర్మన్ రామేశ్వర్ రావు, కన్వీనర్ దార సత్యంతో పాటు కొందరు..నాంపల్లి పార్టీ కార్యాలయంలో కోదండ రామ్‌ను కలసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత జన్మదిన శుభాకాంక్షలు తెలిపి..కేక్ కట్ చేశారు.



నవతెలంగాణ- బడంగ్ పేట్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్ రెడ్డి..మహేశ్వరం అసెంబ్లీ నియోజవర్గానికి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయాలని కోరుతూ రాష్ట్ర హైకమాండ్‌కు మంగళవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాయంలో దరఖాస్తు చేసుకున్నారు.

వ్యక్తి అదృశ్యం..పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-జవహర్ నగర్

టీ తాగుతానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం... కాప్రా మండలం జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో పబ్బతి రాణిమ్మ, భర్త రంగస్వామి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆగస్టు 27న రాణెమ్మ తండ్రి గుండి మద్దిలేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల, బాపన కొట్కూరు గ్రామం నుంచి పని నిమిత్తం జమ్మిగడ్డలోని తన కూతురు వద్దకు వచ్చాడు. ఈ నెల 4న రాత్రి 10గంటల సమయంలో బయటకు వెళ్లి టీ తాగి వస్తానని చెప్పి వెళ్లిన గుండి మద్దిలేటి(55) తిరిగి రాలేదు. అతడి ఆచూకి కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. దీంతో కూతురు రాణిమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు మతిస్థిమితం సరిగ్గాలేదని తెలిపారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమావేశం



నవతెలంగాణ-కాప్రా

గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవడానికి పోలీస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రాధిక చౌరస్తాలోని స్వాగత్ గ్రాండ్ హెూటల్లో గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి జోన్ డీసీపీ, కుషాయిగూడ ఏసీపీ, చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మారాథాన్ రన్నింగ్‌లో ఆర్ఐ విజయం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మారాథాన్ రన్‌ను విజయం సాధించిన ఆర్‌ఐని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అభినందించారు. ఎన్ఎండీసీ, హైదరాబాద్ రన్నర్స్ సంయుక్తంగా ప్రతి ఏడాది నగరంలో మారాథాన్ రన్ నిర్వహిస్తారు. హైదరాబాద్ సిటీ రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కన్నం మధు మారాథాన్ రన్నింగ్ పోటీలో పాల్గొన్నారు. 42.2 కిలోమీటర్ల పరుగును కేవలం 4గంటల 50 నిమిషాల్లోనే పూర్తి చేసిన మధు విజేతగా నిలిచారు. వరసగా ఐదోసారి విజేతగా నిలువ డంతో బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీపీ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఇతరులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎంఎల్ఆర్ఐటీ' విద్యార్థుల ప్రతిభ

- మొబైల్ యాప్ రూపకల్పన
- జాతీయ స్థాయిలో రెండో బహుమతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు రూపొందించిన మొబైల్ యాప్‌కి జాతీయ స్థాయిలో గూగుల్ కంపెనీ నిర్వహించిన పోటీల్లో రెండో బహుమతి లభించింది. కాలేజీకి చెందిన విద్యార్థులు టీ-హబ్, ఐఎస్‌బీలోని ది/నడ్జ్ ఫోరమ్ సహకారంతో గూగుల్ సహ-హెూస్ట్ చేసిన ప్రతిష్టాత్మక హ్యాకథాన్ Hack4Change @ charcha '23'లో తమ సత్తా చాటి బహుమతి గెలుచుకున్నారు. ఈ 24-గంటల హ్యాకథాన్‌లో ఎంఎల్ఆర్ఐటీ కాలేజీ విద్యార్థులు 270 అత్యుత్తమ జట్లతో పోటీ పడ్డారు. భారతీయ రైతులకు పంటల త్పాదకతను విప్లవాత్మకంగా మార్చడమే వీరి లక్ష్యం. ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా ఉపగ్రహ చిత్రాల సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా పంట దిగుబడి పెంచి నాణ్యతను కూడా సాధించడానికి వీలు అవుతుంది. విద్యార్థులు తమ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శించి రూ.లక్ష నగదు బహుమతిని పొందారు. విస్తారమైన టాలెంట్ పూల్ నుంచి ఎంఎల్ఆర్ఐటీ కాలేజీకి చెందిన ముగ్గురి బృందం, మహమ్మద్ కామిల్ మీర్జా, అరుణ్ ఆదిత్య, తనిష్క్ అగర్వాల్ బృందాలు సీఎస్ఐటీ 3వ సవత్సరం విద్యార్థులు. ఇది తమ కాలేజీ విద్యార్థుల నైపుణ్యానికి నిదర్శనం అని కాలేజీ సెక్రెటరీ, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, విభాగ అధిపతిలు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బలరాంతో కలిసి అభిందిచారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తమ కాలేజీలో 12 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులను మొదటి సంవత్సరం నుంచి వినూత్న ఆలోచనలను ప్రోత్సహిస్తూ వస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు విద్యార్థులు. పాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్స్ హెడ్ రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను ప్రజలు నమ్మరు : బండారి



నవతెలంగాణ-కాప్రా

ప్రతి పక్షనాయకులు చెప్పే మాటలను నమ్మబోరని బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం కమలానగర్, హౌసింగ్ బోర్డు కాలనీలోని వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ చేరారు. వారికి బీఎల్ఆర్ గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు మరోసారి సీఎం కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కరుడు గట్టిన బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతుండడంతో జాతీయ పార్టీలు బేజారు అవుతున్నాయని ఎద్దేవా చేశారు. రెండో స్థానం కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయని వివరించారు. పార్టీలు ముఖ్యం కాదని, అభివృద్ధే ముఖ్యమని తెలిపారు. ప్రతి పక్షాలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆ పార్టీలను నమ్మితే గోసపడుతారని సూచించారు. అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. అధికారంలోకి రావడానికి అమలు కాని మాటలను చెబుతున్నారని, ఆయా పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మహేష్, ఉదయ్ కిరణ్ రెడ్డి, కృష్ణ, సురేష్, రాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన విద్యార్థులు ఓటు నమోదు చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్



నవతెలంగాణ-కీసర

18ఏండ్లు నిండిన విద్యార్థులు ఓటు నమోదు చేసుకోవాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని కేజీఆర్ కళాశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అర్హులైన విద్యార్థులు తప్పని సరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. మార్పులు చేర్పులు ఉంటే ఫారం నంబర్8లో నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు అవగాహనా సదస్సులో విద్యార్థులు భాగస్వా మ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పీవీ రమణారావు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, విజయ్ కుమార్, బీఎల్‌వో సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాల ప్రచార రథం ప్రారంభం



నవతెలంగాణ-ఉప్పల్

కాంగ్రెస్ పార్టీ అమలు చేసే పథకాల ప్రచార రథాన్ని ఉప్పల్ నియోజకర్గం కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి మంగళవారం జెండాఊపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రకటించిన డిక్లరేషన్లను, పథకాలను ఉప్పల్ నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లోని ప్రతి గడపగడప కూ చేరవేసేలా ఈ ప్రచార రథాలను రూపొందించామనిన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుధాకర్ కాలేరు జైనవీన్, గణేష్ నాయక్, సంజయ్ జెన్, మాదర్ వలీ, సుధాకర్ శెట్టి, కంది శ్రావణ్ రెడ్డి, వంజరి సంతోష్, మైనార్టీస్ వైస్ చైర్మెన్ జహీరుద్దీన్, ఉప్పల్ డివిజన్ మైనార్టీస్ చైర్మెన్ గజ్జల రాజు, విన్ను, నవీన్ నాయక్, గిరి, మల్లేష్, మధు, గొల్లూరి ప్రభాకర్, రాహుల్‌గౌడ్, మహిళా నాయకురాలు మున్నీ బేగం, సుజాత నాయక్, లక్ష్మి, మాలతి, యశ్వంత్, సునీల్, రవి, మదన్, అల్లు, అజీజ్, కార్తీక్, పవన్, రాజ్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకకు హాజరైన బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాఘవరెడ్డి పుట్టిన రోజు వేడుకలకు బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మంగళవారం హాజరయ్యారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, దత్తు, పెంటయ్య గౌడ్, బేతాళ బాలరాజు, లయన్ నాగన్న, లయన్ సురేశ్ కుమార్, మధుకర్ రెడ్డి, రమాదేవి,హేమలత తదితరులు ఉన్నారు.

ఘట్‌కేసర్‌లో బస్టాండ్ కోసం స్థలం పరిశీలన



నవతెలంగాణ-ఘట్కేసర్

దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులు జిల్లా బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఘటకేసర్ మున్సిపల్ కమిషనర్‌తో కలిసి మంగళవారం బస్టాండ్ స్థలాన్ని పరిశీలించారు. ఘటకేసర్ బస్టాండ్ నుంచి ప్రతినిత్యం 280కిపైగా సిటీ, సబర్బన్, ఆర్డినరీ బస్సులు తిరుగుతుండడంతో బస్టాండ్ స్థలం సరిపోవటం లేదు. వరంగల్, హనుమకొండతో పాటు ఇతర జిల్లాలకు వెళ్లే బస్సులు నిలిపేందుకు స్థలం సరిపోక ప్రయాణికులు ఇబ్బందులకు గురికావడంతో పాటు ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను నివారించడానికి కొండాపూర్ రైల్వేగేట్ సమీపంలో ఉన్న స్థలాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సికింద్రాబాద్ డివిజనల్ డిప్యూటీ ఆర్ ఎం కృపాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ, ఘాట్ కేసర్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తే కఠిన చర్యలు

- తహశీల్దార్ సత్యనారాయణ

నవతెలంగాణ-శామీర్‌పేట

ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని శామీర్‌పేట తహశీల్దార్ సత్యనారాయణ హెచ్చరించారు. శామీర్ మండలం తూంకుంట మున్సిపాలిటీ, ఉప్పరపల్లి గ్రామ



పరిధిలోని ప్రభుత్వ భూమి 837 సర్వే నెంబరులో తోపుడు బండ్ల చిరు వ్యాపారుల సంఘం వారిమని మాకు ప్రభుత్వం ఇక్కడ ఇండ్ల పట్టాలు ఇచ్చిందని మొన్న రాత్రికి రాత్రే అక్రమంగా గుడిసెలు వేశారు. దీంతో గ్రామస్థులు ఆందోళన చేయడంతో ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని అక్రమ గుడిసెలు ఖాళీ చేయిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయి. కాగా మంగళవారం శామీర్‌పేట తహశీల్దార్ సత్యనారాయణ పోలీసుల సహాయంతో అక్రమ గుడిసెలు ఖాళీ చేయించి ప్రభుత్వ స్థలాన్ని రక్షించారు. దీంతో ఉప్పరిపల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నిరంజన్ రెడ్డి, ఆర్ఐ కుమార్, ఎస్సై మునీందర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి : మున్సిపల్ చైర్‌పర్సన్



నవతెలంగాణ-ఘట్కేసర్

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావనీ జంగా యాదవ్ అన్నా రు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ముడు రోజు లుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కుంటలు, చెరువులు, డ్రయినేజీలు నిండాయన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ తిగలకు దూరంగా ఉండాలన్నారు. వరద నీరు పోవడానికి తెరిచిన మ్యాన్‌హెూల్ గమనిస్తూ నడవాలన్నారు. అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటికి రావాలని కోరారు. చిన్నారుల పట్ల జాగ్రత్త వహిస్తూ వారిని బయటికి పంపకూడదని సూచించా రు. మరో2 రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వారు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. విద్యుత్ వైర్లను తాకవద్దని, చెట్ల కింద ఉండకూడదని చెప్పారు. పురాతన భవనాల్లో ఉండకూడదని చెప్పారు. రోడ్డు ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తగా వహించాలని సూచించారు. కరెంట్ షాక్, పిడుగులు, ప్రయాణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఘట్కేసర్ మున్సిపాలిటీ ప్రజలు ఏదైనా ఇబ్బంది కలిగితే కింద తెలిపిన అత్యవసర టీం ఇన్‌చార్జిలకు ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రెస్క్యూ టీం ఇన్‌చార్జిలు

1.రాజేష్‌కుమార్(ఎంవోర్మెంట్‌ఇంజనీర్) 9154083772
2. శ్రీనివాస్ (శానిటేషన్ ఇన్స్పెక్టర్) 7981833690

రెస్క్యూ టీం అసిస్టెంట్‌లు

1. తిక్క ధర్మేంధర్ ఘట్కేసర్. 9393595938
2. పంది రాములు బాలాజీ నగర్. 95538480826
3.బర్ల కృష్ణ కొండాపూర్. 7229005033
4. యాదగిరి ఎస్ ఎఫ్ సి నగర్. 8019660211

వరద సహాయక చర్యల్లో పాల్గొన్న కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో కురిసిన అకాల వర్షలకు ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ సిబ్బందితో సహాయక చర్యల్లో పాల్గొని వర్షపు నీటిని తొలగించారు. నాగారం చౌరస్తా నుంచి కుషాయిగూడ వెళ్లే దారిలో వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వాహన దారులు ఇబ్బందులు పడ్డారు.



'డబుల్' ఇండ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-కాప్రా

సర్వేనెంబర్ 710/1లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను స్థానికులకు కేటాయించాలని కాప్రా డివిజన్‌లోని సాయిరాంనగర్ వాసులు ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కలెక్టర్‌తో మాట్లాడి అర్హత కలిగిన లబ్ధిదారులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సాయిరాంనగర్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గజేంద్రరావు, జాయింట్ సెక్రెటరీ కొండల్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్, గరిక సుధాకర్, శ్రీ సాయిరాంనగర్ వాసులు, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడికి అరుదైన గౌరవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ఎం.గోపిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేసింది. మంగళవారం రవీంద్ర భారతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర ఇంటర్మీడియట్ కమిషనర్ నవీన్ మిట్టల్ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా గోపి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ గోపి మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు గోపికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెూం మినిస్టర్ మహమ్మద్ అలీ, ఆర్‌జేడీ జయప్రద, ఓబీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం



- రజక ఫెడరేషన్ ద్వారా అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

లాండ్రీ షాపు దగ్ధమైన కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం రజక ఫెడరేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ ఏరియా శ్రీకష్ణ నగర్‌కు చెందిన లిసట్ల యాదమ్మ, ఉపేందర్‌కు చెందిన లాండ్రీషాపు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఆర్థిక సహకారం అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం చొరవతో రజక ఫెడరేషన్ ద్వారా రూ.50వేల ఆర్థిక సహకారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.కేశురామ్ అందించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహకారం మంజూరు చేసిన రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, రజక ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌కు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎస్.సుభద్ర, జిల్లా కార్యదర్శి జ్యోతి ఉపేందర్, జిల్లా కోశాధికారి సట్టు రవి, జిల్లా కమిటీ సభ్యులు రావుల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

తడిసిన జంట కార్పొరేషన్లు

నవతెలంగాణ-బోడుప్పల్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోడుప్పల్, పీర్జాదిగూడ నగర పాలక సంస్థల పరిధిలోని పలు కాలనీలు, రోడ్లు నీటమునిగాయి. జంట కార్పొరేషన్ల పరిధిలోని పలు చోట్ల రోడ్లపై భారీగా వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. కార్పొరేషన్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టారు.



మౌనజాతుల ప్రజాసమితి పార్టీ ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా

మౌనజాతులకు రాజ్యాధికారం కోసమే భారతీయ మౌనజాతుల ప్రజాసమితి రాజకీయ పార్టీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు ముస్త్యాల రామ్ చంద్రం తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లైయన్స్ క్లబ్ ఈసీఐఎల్ లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ముస్త్యాల రామ్ చంద్రం మాట్లాడుతూ.. మహనీయులు ఆశయాలు, వారి పని విధానాన్ని కొనసాగిస్తూ ముందుకు వెళ్లాలని తెలియజేశారు. కొన్ని వేల సంవత్సరాల నుంచి ముక్కలు ముక్కలుగా విడదీసి పాలిస్తున్న అగ్రవర్ణ, మనవాదుల చేతులలో మోసపోయి ఓట్లు వేస్తూ బహుజను లు అధికారానికి దూరంగా ఉన్నారని తెలిపారు. అగ్రవర్ణాల పార్టీలు ఏ పేరుతో చలామణి అవుతున్నా వారంతా ఒక్కపుట్టలోని పాములు గా ఉన్నారని చెప్పారు. రాజకీయంగా వారిలో భిన్న ధోరణులున్నా ఆర్థిక పరమైన దోపిడిని సమర్థించేందుకు అంతా ఒకటవుతున్నారని చెప్పారు. 75 ఏండ్లుగా అగ్రవర్ణాలకు ఓటు వేస్తూ అన్యాయాలకు, అణిచివేతకు, మోసాల కు, మానభంగాలకు, దౌర్జానాలకు గురై కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరు మెదపని 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజ్యాధికారం కోసమే భారతీయ మౌనజాతుల ప్రజా సమితి పనిచేస్తుందన్నారు. సమావేశం లో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షు లు కటికల శ్రీహరి ముదిరాజ్, డాక్టర్ ఏ ఎస్ శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి గగన్ కుమార్, నత్తి లచ్చ య్య, వీఆర్ శ్రీనివాస్, కోశాధికారి తాడూరి సత్తయ్య కార్యదర్శి చౌడగారి సంజీవ, గాదే సురేష్, కే చంద్రశేఖర్ రెడ్డి మహమ్మద్ మోయి న్ మహమ్మద్ నసీం, చిత్తంపల్లి బాలయ్య, రాజు, కార్యవర్గ సభ్యులు జయ శ్రీ, మాడుగుల యాదయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
బుధవారం | సెప్టెంబరు 06, 2023 | www.navatelangana.com

సిరి బాలాజీ రోడ్డులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిరి బాలాజీ ప్రధాన రోడ్డులో మంగళవారం కురిసిన వర్షానికి రోడ్డుపై మోకాళ్ళ లోతు నీరు ప్రవహిస్తూ వాహనదారులకు, పాదచారులకు, అంతరాయం కలిగింది. ఇటీవల ఇక్కడ ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టారు. అయినా రోడ్డుపై నీరు రావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల నిధులతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టిన ఉపయోగమేమి లేకపోవడం చూస్తే, ఈ పనులు కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే తూ తూ మంత్రంగా చేపట్టారన్నది స్థానికులు తెలియజేస్తున్నారు.

బాచుపల్లిలో పర్యటించి ఎమ్మెల్సీ

- ప్రమాదకరమైన గోడపై సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి ప్రణీత్ అంటీలియాలో ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంగళవారం కురిసిన వర్షం కారణంగా పలు కాలనీలో బస్తీలలో పర్యటించారు. భారీ వర్షాల కారణంగా కూలిపోయేలా.. ప్రమాదకరంగా మారిన ప్రహరీ గోడని గుర్తించి పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం జరుగక ముందే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూలిన ప్రహరీ గోడను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించేది ఉపాధ్యాయులు

- టీచర్స్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిప్రదాతలుగా నిలవాలి
- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి మల్లారెడ్డి
- జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మనఊరు-మనబడి కింద పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు మంచి చదువులు బోధించి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందించేది ఉపాధ్యాయులు అని, ఈ విషయంలో విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు మార్గదర్శకులు అని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ ఉజ్వలమైన భవిష్యత్‌ను అందించి వారిని భావిభారత పౌరులుగా తీర్చదిద్దే అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందన్నారు. ఉపాధ్యాకులు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకులుగా నిలిచి రాబోయే తరాలకు మంచి భవిష్యత్‌ను అందించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులంటే తనకెంతో గౌరవమని, సమాజంలో వారికి ఎంతో ఉన్నత స్థానం, గౌరవం ఉంటాయని, ఈ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ ఇతరులకు మార్గనిర్దేశకులుగా నిలవాలని సూచించారు. ఉపాధ్యాయులుగా ఉన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ ఉపరాష్ట్రపతి అయ్యారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకెళ్ళాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి వారు అనుకున్న గమ్యాలను చేరుకోవడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందన్నారు. తల్లిదండ్రుల తర్వాత గురువులకు స్థానం కల్పించడం ద్వారా ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గౌరవాన్ని తెలియచేస్తోందని, వారి కృషి మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా నిలిపేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయులకు రెగ్యులరైజ్ చేసినట్టు గుర్తు చేశారు. ఇది ఎంతో శుభపరిణామమన్నారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా మనఊరు-మన బడి కింద 179 పాఠశాలలకు రూ.80 కోట్లు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో దూసుకెళ్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే విద్యారంగం, చదువు, ర్యాంకులు, అన్ని విషయాల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండటం మనకెంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మెన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను తమకు మార్గదర్శకులుగా, స్ఫూర్తిగా తీసుకుంటారని చెప్పారు. ఈ వృత్తి ఎంతో న్నతమైనదని, గౌరవప్రదమైందన్నారు. విద్యార్థులు సైతం తమకంటూ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని సాధించేందుకు కృషి చేస్తే అందుకు ఉపాధ్యాయుల తోడ్పాటు తప్పకుండా లభిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై మరింత బాధ్యత పెరుగుతుందని, వారు ఇతరులకు దిక్సూచిగా నిలవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకష్ణ 136వ జయంతి సందర్భంగా వారి జన్మదినం, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎంతో వైభవంగా జరుపుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మనఊరు-మనబడి కార్యక్రమం ద్వారా అనేక పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యాభివృద్ధికి కృషి చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులు పిల్లలను చదువులో ఆణిముత్యాలుగా తయారు చేస్తున్నారని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు ఎన్నటికీ మరువలేమని ఆమె కొనియాడారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 64 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేసి శాలువా, జ్ఞాపికలు, పూలమాలలతో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి, సంక్షేమ పథకాలలో రాష్ట్రం దేశానికే ఆదర్శం



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఏకైక నాయ కుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజ కవర్గంలోని శేషాద్రి నగర్ కమ్యూనిటీ హాల్లో 125 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో, లబ్ధిదారులకు భోజన ఏర్పాట్లు కల్పించి, ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజ కవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో, దాదాపు 16 వేల మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబా రక్, 40 వేల మందికి పెన్షన్లు, సీఎం రిలీఫ్ ఫండ్ అందించామన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటక రాజస్థాన్‌లలో, బీజేపీ పాలిస్తున్న మహారాష్ట్ర గుజరాత్ రాష్ట్రాలలో ఎక్కడైనా, కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్నారా అని ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌ను చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఓర్వలేక పోతున్నాయని, రాబోయే ఎన్నికల్లో కూడా మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని బలపరచాలని కళ్యాణ లక్ష్మి , షాది ముబా రక్ చెక్కులను అందుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే తెలిపారు.

మహిళా సంక్షేమానికి విప్లవాత్మక పథకాలు అమలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో



మహిళా సంక్షేమానికి దేశంలో మరే ఇతర రాష్ట్రం ప్రవేశపెట్టని విప్లవాత్మక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. నారపల్లిలోని ఆరోగ్య మహిళా క్లినిక్ నిర్వహణ, మహిళలకు చేసిన ఏర్పాట్లను మంగళవారం డీఎంఅండ్‌హెచ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణ, ప్రతి మహిళా ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో, వారు ప్రధానంగా ఎదుర్కొనే రక్త పరీక్ష నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ వరకు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకంగా ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని జిల్లాలోని 30 ప్రాథమిక / పట్టణ కేంద్రాలు, బస్తీ దవాఖానలో మహిళా వైద్యాధికారిణి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం అని తెలిపారు. సాధారణంగా మహిళలు ఎదుర్కొనే 8 రుగ్మతలకు సంబంధించి స్క్రీనింగ్, పరీక్షలు, చికిత్స, ప్రస్తుతం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు ప్రాథమిక పరీక్షలైన యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, బరువు పెరగడం, తగ్గడం, రుతుస్రావ సమస్యలు, ఎనీమియా, పీసీవోడీ తదితర పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఇవేగాకుండా అవసరం మేరకు మైక్రో న్యూట్రియెంట్ డెఫిషియెన్సీ, వెయిట్ మేనేజ్‌మెంట్, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్, మెనోపాజ్ మేనేజ్‌మెంట్, థైరాయిడ్, విటమిన్ డీ-3, బీ-12 వాటిని ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా స్క్రీనింగ్ చేయనున్నట్టు చెప్పారు. జిల్లాలోని ప్రతి మహిళా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం హాస్పిటల్ హాజరు, ఓపీ, స్టాక్, జెఎస్వై, జెఎస్ఎస్కె, ఏఎన్సీ, ఇమ్యునైజేషన్, టెలికన్సల్టేషన్ రిజిస్టర్‌లను, ఫార్మసీ స్టోర్ రూమ్, ల్యాబ్, యూపీహెచ్‌సీ పారిశుధ్యాన్ని ముమ్మరంగా తనిఖీ చేశారు.

వివేకనంద పాఠశాలలో గురుపూజోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన పరిధిలోని వివేకానంద విద్యా మందిర్ పాఠశాలలో గురుపూజోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థు లకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఏటా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకో వడం సంతోషదాయకమన్నారు. ఉపాధ్యాయ వృత్తి యొక్క గొప్పతనాన్ని సమాజంలో వారికి ఉండే గౌరవం మర్యాదలను వివరించి చెప్పారు. అంతేకాకుండా దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా కరెస్పాండెంట్ సునీత గౌడ్ , వైస్ ప్రిన్సిపాల్ లతా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్‌వై.ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలో (ప్రేమ్ విజయనగర) పీవీఎన్ కాలని ఎస్‌టీ.ఎఎన్ఎన్ స్కూల్ నాలా సత్తిరెడ్డి నగర్, సత్య రాఘవేంద్ర కాలని ఏరియాలలో వర్షానికి జలమయమైన ప్రాంతాల్లో కాలని ముంపు ప్రాంతాల్లో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ.శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు,సత్యనారాయణ, చుంకు శ్రీనివాస్ కాలని వాసులు నాగేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట్ మెట్రో స్టేషన్ కింద చేరిన వరద నీరు



- గంటల తరబడి ట్రాఫిక్ జంజాటంలో వాహన దారులు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

సోమవారం అర్ధరాత్రి నుండి ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షానికి కూకట్‌పల్లి ఆర్‌టీసీ డీపో ముందు ఉన్న జాతీయ రహదారి పూర్తి జలమయ మవడంతో, ట్రాఫిక్ జంజాటంలో ఇరుక్కున్న వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు నుండి వచ్చే కాలువలో వరద ఉధృతి పెరగడం వల్ల , మూసాపేట్ మెట్రో స్టేషన్ కింద వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. సోమవారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా, రోడ్డు పై వరద నీరు నడుముల్లోతు కు చేరడంతో, అక్కడకు చేరుకున్న డీఆర్ఎఫ్ బృందం వరద నీరు త్వరగా వెళ్లేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం అయినప్పటికీ వరద తగ్గకపోవడంతో కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపో వద్ద రహదారి పై వాహనాలు రాకపోకలలో వేగం తగ్గడంతో , ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహన దారులు అవస్థలు పడ్డారు. ఈ సందర్భంగా పలువురు వాహన దారులు మాట్లాడుతూ, వరదలు వచ్చినప్పుడల్లా వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని, ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వరద నీరు సాఫీగా ప్రవహించెందుకు నాలా అభివృద్ధి చేసి, వరద నీరు రోడ్డు పై ప్రవహించకుండా నిర్మించాలని తెలిపారు. వాహన దారులకు వర్షా కాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనీ కోరారు.

15న భారతీయ వాయుసేన క్లారికల్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- జిల్లాలోని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో



భారతీయ వాయుసేనలో అగ్నిపథ్ స్కీమ్లో క్లారికల్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 15వ తేదీన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఓపెన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగ యువకులకు మాత్రమే అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్నిపథ్ స్కీంలో సెలక్ట్ అయిన అభ్యర్థులకు నాలుగేండ్ల తర్వాత 25 శాతం మందికి వాయిసేనలో ప్రేరణ కింద తిరిగి కొనసాగించనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఈనెల 15న బేగంపేటలోని ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్, ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. పోస్టింగ్ జాబ్ నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు అధికారిక వెబ్ సైట్ htt://agnipathvayu.cdac.in /AV/ ద్వారా సంప్రదించాలని కోరారు.



ఎడతెరిపి కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి పలు ప్రాంతాల ప్రజలకు సూచించారు మంగళవారం ఉదయం కురిసిన వర్షాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలో బాలాజీ లేఔట్, రామ్కీ సంస్కృతి ఎంక్లేవ్ ,హోక్షిత ఎంక్లేవ్ ,ద్వారకా నగర్, పరిధిలో అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. తగిన ఏర్పాట్లను చేస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు.

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకం



- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ట్రస్మా అధ్యక్షులు కే.రామేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని విద్యార్థుల బంగారు భవితకు పునాదులు వేసే వారి కృషి ఎనలేనిదని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ట్రస్మా అధ్యక్షులు ఆర్.ఎస్.కె స్కూల్ కరస్పాండెంట్ కే. రామేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం (డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి) ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్, బాపూనగర్ లోని ఆర్.యస్.కే. హై స్కూల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయు లు విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయడంతోపాటు అజ్ఞానాన్ని తొలగించి, మంచి విజ్ఞానాన్ని పంచి ఉన్నతులుగా తీర్చిదిద్దే శక్తి యుక్తులు కేవలం ఉపాధ్యాయులకే ఉన్నాయన్నారు. తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించడంతోపాటు మహనీయుల త్యాగాలను , దేశం కోసం వీరమరణం పొందిన సైనికుల స్మరించుకునే విధంగా చిత్రపటాలను పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసి విద్యార్థులకు వారి గురించి వివరిస్తూ ఆత్మస్థైర్యం నింపుతున్నామన్నారు. విద్యార్థుల మనోభావాల కనుగుణంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రోత్సహించాలని అప్పుడే వారు అనుకున్న గమ్యం చేరుతారని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించి బహుమతులు ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ కె.అరుణ రెడ్డి, ఉపాధ్యాయులు శోభారాణి ,ఉష ,సరసమ్మ ప్రసన్న సరిత, వరప్రసాద్ ,సూర్యప్రకాశ్, దేవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇస్తూ ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఇంటింటికీ తిరిగి బస్తీ వాసుల క్షేమ సమాచారం తెలుసుకుంటూ దీనదయాళ్ నగర్‌లో పర్యటించారు. వరద బాధితులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా నిచ్చారు. ప్రకృతి విలయం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారని, ఊహిం చని వరద రావడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యా యన్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హుటాహుటిన అధికారులతో కలిసి వరదముంపు ప్రాంతాలలో జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి ఇంటింటికి తిరిగి బాధితులను పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానికులతో మాట్లాడుతూ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఎవ్వరూ శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండరాదని కోరారు. బాధితులకు పునరావాసం ఏర్పాటు చేసి వారికీ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, అదేవిధంగా 1000 మందికి అవసరమైన భోజన, తాగునీరు, తదితర సదుపాయాలను ఏర్పాట్లు కల్పించి ఆదుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, ఏఈ. పవన్, ఫతేనగర్ డివిజన్ జనరల్ సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్



ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దు

- కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటికి రావొద్దని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో కేపీహెచ్‌బీ డివిజన్ నాలుగో ఫేస్ లో రోడ్డుపైకి వరద నీరు పొంగి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా కార్పొరేటర్ మంగళవారం ఆ ప్రాంతాన్ని పర్యటించి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల డ్రైయినేజీలు పొంగిపొర్లుతున్నాయని అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్న కొంత ఇబ్బంది తలెత్తుతున్న మాట వాస్తవమేనన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి వాతావరణ శాఖ సూచన ప్రకారం బయటికి రాకుండా ఉండడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం డబ్ల్యు ఎస్ జీఎం ప్రభాకర్, మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సూపర్ వైజర్ వెంకటేష్, మహిళా నాయకులు భారతి ,లత ,మణి ,రమాదేవి సుకన్య , రామయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
12
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | సెప్టెంబర్ 06, 2023 | www.navatelangana.com

ఉపాధ్యాయులకు ఘనసన్మానం



నవతెలంగాణ-బేగంపేట

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లో రేజిమెంటల్ బజార్‌లోని ఇలిస్టేట్ హైస్కూల్లో టీచర్లను మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పాటలు చెప్పి దేశం గౌరైపడేలా విద్యార్థులను తీర్చిదిద్ద డంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైన ఆయన అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వారిని సూచించారు మదర్ తెరిసా విగ్రహం వద్ద పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి గౌరీ శంకర్, నాగేష్ యాదవ్, జూడు పాల్, సల్మాన్, శ్రీనాథ్,, నంది కంటి రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలన



నవతెలంగాణ-ఓయూ

నగరంలో ఎడతెరిపి కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలక భరోసా కల్పించేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హుటాహుటిన డిఆర్ఎఫ్ సిబ్బంది, జిహెచ్ఎంసి అధికారులు, వెటపెట్టుకొని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తార్నాక డివిజన్ లోని సత్య నగర్ మరియు లాలాపేట్ ప్రధాన నాలా వెంబడి పర్యటించారు. ఈ సందర్భంగా నిలిచిన వర్షం నీటిని, విరిగిన చెట్ల, వంగిన స్తంభాలను తొలగించి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అధికారులంతా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

కళ్యాణ్‌లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

● పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన నివాసం వద్ద షాదీముబారక్ క్రింద 14 మంది,కల్యాణ లక్ష్మీ క్రింద నలుగురికి ప్రభుత్వం నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అదే విధంగా 96 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. పేదింటి ఆడపడుచు పెండ్లికి లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రతినెలా పెన్షన్ క్రింద ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలతో లబ్ది పొందిన వారు తమ పరిసరాలలోని ప్రజలకు కూడా వివరించి సద్వినియోగం చేసుకొనే విధంగా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి. మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు ఆకుల రూప, నామన శేషుకుమారి, ఖైరతాబాద్ తహసీల్దార్ నయిమోద్దీన్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి, ఆంజనేయులు, కూతురు నర్సింహ, నారాయణరాజు పాల్గొన్నారు.

తలసాని ప్రజలను వరదల్లో వదిలేశారు : మర్రి ఆదిత్య రెడ్డి



నవతెలంగాణ-బేగంపేట్

లిసనత్ నగర్, హైదరాబాద్:లి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సనత్ నగర్ ప్రజలను వరదల్లోనే వదిలేశారని ఎంసీఆర్ఎఫ్ ఛైర్మన్, టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్య రెడ్డి అన్నారు. సోమ, మంగళవారాల్లో భారీగా కురిసిన వర్షాలకు బేగంపేట పరిధిలోని బ్రాహ్మణ్‌వాడీ, వడ్డెర బస్తీ, తదితర ప్రాంతాలు నీటి మునిగాయి. ఈ సందర్భంగా మర్రి ఆదిత్య రెడ్డి ముంపు ప్రాంతాలను సంద ర్శించి ప్రజలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. గడపగడపకు తిరిగి ఆహార పొట్లాలను, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు వచ్చినప్పుడల్లా ఇలాంటి ఇబ్బందులే పడుతున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎన్.విఠల్, నసీర్(అడ్డు), సత్యనారాయణ, రాము, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌టీ కాలనీలో కాంగ్రెస్ నాయకుల ప్రజాకోర్టు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సనత్‌నగర్ లోని ఎస్ఆర్‌టి క్వార్టర్స్‌లో ప్రజాకోర్టు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహర్ ఏఐసిసి పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన పుటినుండి మహిళలకు ఏం చేశారని వారికి ఏ విధమైన మేలు జరిగిందని మహిళలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని, కేవలం టిఆర్ఎస్ పార్టీ వాళ్లకే ఇచ్చారని , పెన్షన్లు ,రేషన్ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకున్న అనంతరం తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహర్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుం దని, ప్రజల ఆకాంక్షను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వంలో అవినీతి భారీగా పెరిగి పోయిందని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలు కేవలం పార్టీ నాయకులకి అందజేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు విజయ్ కుమార్, ఎలిసా, బబ్లు, సల్మాన్ తో పాటుగా భారీ సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

● 12 గేట్ల ద్వారా నీరు దిగువకు విడుదల

● అధికారులను అప్రమత్తం చేసిన ఎండీ దానకిశోర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో రెండు రిజర్వాయర్ల నీటి మట్టాలు పెరిగి నిండు కుండను తలపిస్తున్నాయి. ముఖ్యంగా మంగళవారం ఉదయం నుంచీ వర్షం అధికమవడంతో హిమాయత్ సాగర్‌కు 4000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా 6 గేట్ల ద్వారా 4120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉస్మాన్ సాగర్‌కు 1600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా మరో 6 గేట్ల ద్వారా 1380 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. రెండు జలాశయాలకు 5600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా 5500 క్యూసెక్కుల అవుట్ ఫ్లోను 12 గేట్ల ద్వారా మూసీ నదిలోనికి వదులుతున్నారు. ఈ నేపథ్యంలో మూసీ పరివాహక ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ దానకిశోర్ సూచించారు. ఇతర సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

శంకరన్ ఐఏఎస్ అకాడమీలో ఉపాధ్యాయ దినోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్.ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీలో మంగళవారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం, శ్రీ నారాయణ గురు169వ జయంతి కార్యక్రమం అకాడమీ ప్రిన్సిపాల్ కె.సురేందర్ రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ కమర్షియల్ ట్యాక్సెస్ వై.సత్యనారాయణ హాజరై మాట్లాడారు. మహనీయుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయడం ద్వారా స్ఫూర్తి పొందాలని, అలాంటి స్ఫూర్తి పొందే వారిలో శ్రీ నారాయణ గురు, మహాత్మ జ్యోతిబాపూలే, మహాత్మా సావిత్రిబాయి పూలే, సర్వేపల్లి రాధాకష్ణన్ వంటి ఎందరో మహనీయులు ముందు వరుసలో ఉంటారన్నారు. గౌతమ బుద్ధుడి లాంటి ఆలోచనా సరళిని పెంపొందించుకోవడం ద్వారా కుల, మత, ప్రాంతీయ తత్వాలకు వ్యతిరేకంగా దఢ సంకల్పంతో సమాజ అభ్యున్నతికి తోడ్పడే గొప్ప వ్యక్తులుగా మనల్ని మనం మరల్చుకోవచ్చని, అందుకోసమే మహనీయుల జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. శ్రీ నారాయణ గురు జీవిత చరిత్రని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సత్యనారాయణ వివరించిన తీరు బాగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి కె.సతీష్ కుమార్, కార్యాలయ సిబ్బంది అల్లు వెంకటేష్, టి.రాజా, బి.సంధ్యారాణి, సోషల్ మీడియా ఇన్‌చార్జి కె.మురళీ కష్ణ, విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పురానాపూల్ బ్రిడ్జిని పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పురానాపూల్ బ్రిడ్జిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. మంగళవారం జియాగూడ లోని కేఎస్ స్వామి నగర్‌లో లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల గురించి తెలుసుకున్నారు. అవసరమైతే సురక్ష ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్యప్రకాష్, ఎమ్మార్వో జ్యోతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్‌లోని రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 59లో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి మండల తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీవో నెంబర్ 58, 59లకు సంబంధించిన విషయాలను కలెక్టర్ చర్చించారు. జీవో 59కి సంబంధించి ఆమోదించిన లబ్ధిదారుల నుంచి వెంటనే డబ్బులను చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలోని 754 లబ్ధిదారులకు గాను 191 మంది లబ్ధిదారులు డబ్బులు చెల్లించారని, మరో 554 మంది లబ్ధిదారులు రెగ్యులరైజేషన్ డబ్బులు చెల్లించాల్సి ఉన్నారని తహసీల్దార్లు తెలిపారు. రెగ్యుల రైజేషన్ డబ్బులు లబ్ధిదారులు చెల్లించుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటాచారి, జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం











● అధికారులు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి : డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-బేగంపేట్

నగరంలో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. కొన్ని ఏరియాల్లో రోడ్ల, రహదారులు మునిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. సికింద్రాబాద్ పరిధిలోని బేగంపేట్ సర్కిల్ పికెట్ నాలను జిహెచ్ఎంసి అధికారులతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి గారు పరిశీలించారు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు గురి కాకుండా నీటి నిలువలను వెంటనే తొలగించే విధంగా చూడాలని, అలాగే నాలాలోని చెత్త పూడికలను వెంటనే తొలగించాలని బేగంపేట్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లకు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లల్లోకి చేరిన నీటిని వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రజలను అప్రమత్తం చేసి యుద్ధ ప్రాతిపదికన చర్యలు

జంటనగరాలలో గత రాత్రి కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి. ప్రజల బాధలు వర్ణనాతీతం.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సికింద్రాబాద్ రామ్‌గోపాల్‌పేట డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమమయ్యాయి. అందులో బీజేపీ స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ భర్త సనత్ నగర్ నియోజకవర్గం సీనియర్ బీజేపీ నేత చీర సత్యనారాయణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున డివిజన్ పరిధిలోని నల్లగుట్ట,మెక్లెడ్ గూడా,బాంబే హొటల్,నాలా లేన్,కళాసిగూడ ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికన లోతట్టు ప్రాంతాలు నిలిచిపోయిన నీటిని తొలగించడానికి ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు.

భారీ వర్షానికి రేజిమెంటల్‌బజార్‌లో పాత పోలీస్ స్టేషన్ పక్కనున్న పాత భవనం కుప్పకూలింది. అందులో ఎవ్వరు లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

● శ్రీలంక బస్తీలో పర్యటించిన శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

గత రెండు రోజులుగా కూర్చున్న భారీ వర్షాలకు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శ్రీగణేష్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీ గణేష్ మంగళవారం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రసూల్ పురా, శ్రీలంకబస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యలను శ్రీ గణేష్ దృష్టికి తీసుకువచ్చారు. వర్షం పడిన ప్రతిసారి వరద నీరు డ్రయినేజీ నీరు ఇండ్లలోకి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. నాలాల పూడికతీత పనులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వర్షాకాలం వరదల వలన నాలాల సమీపంలో ఉండే లోతట్టు ప్రజలు అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సిద్దప్ప, మల్లేష్, శ్రీకాంత్, హనుమంత్, చిన్ని, శ్రీనివాస్ పాల్గొన్నారులి

● లోతట్టు ప్రాంతాల్లో నందిత పర్యటన

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత పర్యటించారు. 2వ వార్డు పరిధిలోని అన్నానగర్, రసూల్ పురా, చంద్రబాబు నగర్, శ్రీలంక బస్తీ, మజీద్ ఇలాహే, హనుమాన్ టెంపుల్ లేన్, చిల్లా లేన్, పోచమ్మ టెంపుల్ లేన్‌లో పర్యటించి వరద పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. బాధితులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. లాస్యనందితతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, నివేదిత, టీఎస్ శ్రీనివాస్, పనస సంతోష్, వార్డు 2 ప్రెసిడెంట్ కుమార్, ఆంజనేయులు, జిలానీ, శ్రీను, ఉస్మాన్ ఉన్నారు.

● పాత భవనాన్ని కూల్చివేసిన అధికారులు

నవ తెలంగాణ-కంటోన్మెంట్

గత రెండు రోజులుగా ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు రెజిమెంటల్ బజార్‌లో ఉన్న పురాతన ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది పలువురు స్థానికులు తెలిపారు. అనంతరం వర్షా కారణంగా అధికారులకు సమాచారం ఇవ్వగా డిఆర్ఎఫ్ సిబ్బంది ఘటనస్థలికి చేరు కుని పాక్షికంగా కూలిన ఇంటిని పూర్తిస్థాయిలో నేలమట్టం చేశారు. ఇల్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని, గత కొన్నాళ్లుగా ఇంట్లో ఎవరు నివాసం ఉండడం లేదని స్థానికులు పేర్కొన్నారు. సంఘటన స్థానాలకి జిహెచ్ఎంసి అధికారులతో పాటు కార్పొరేటర్ దీపిక నరేష్ సందర్శించారు. డివిజన్లో ఇంకా ఏవైనా పాత భావం అంటే వెంటనే కూల్చివేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

నూతన కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని గౌరీ శంకర్ కాలనీ బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11 బంజారాహిల్స్ (వెంకటేశ్వర నగర్ డివిజన్)లో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఖైరతాబాద్ డివిజన్, కార్పొరేటర్ నియోజకవర్గ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర నగర్ డివిజన్ అధ్యక్షులు బి శ్రీనివాస్ యాదవ్,డిసిసి ఎస్టీ సెల్ చైర్మన్ ధనరాజ్ రాథోడ్,గౌరీ శంకర్ కాలనీ వెల్ఫేర్ కమిటీ అడ్వైజర్ రమేష్ యాదవ్,వర్కింగ్ ప్రెసిడెంట్ భీమ్ రావు,టెంపుల్ వైస్ చైర్మన్ అప్పారావు,వైస్ ప్రెసిడెంట్ పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీలు శ్యాంబాబు, శివశంకర్,గౌరీ శంకర్ నగర్ కాలనీ కార్యవర్గ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ మహిళా డివిజన్ల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోట శ్రీనివాస్‌కు ఘన సత్కారం



నవతెలంగాణ-ఓయూ

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్‌గా నియమితులైన ఓయూ రీసర్చ్ స్కాలర్ తెలంగాణ ఉద్యమకారుడు కోటా శ్రీనివాస్‌ని ఓయూవిద్యార్థి సంఘాల నేతలు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు, ఆర్ట్స్ కాలేజ్ ఎదుట ఘనంగా రాజకీయాలకు అతీతంగా సన్మానించారు. కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ రాజకీయాల్లో ఉన్న పీడిత ప్రజల పక్షాన ,విద్యార్థుల పక్షాన, ఉంటు తెలంగాణ సమాజాన్నీ మోసం చేసి, తాకట్టు పెట్టిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ఓయూకి సముచిత స్థానం పెద్దపీట కల్పించే విధంగా తోడ్పాటు చేస్తాన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్, శ్రీకాంత్ యాదవ్, విద్యార్థి సంఘం బారీ అశోక్, వివిధ విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఎంబిఏ విభాగం ఆధ్వర్యంలో టీచర్స్ డే



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలలో ప్రిన్సిపాల్ అండ్ ఎంబిఏ హెడ్ ప్రో.డి.శ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా టీచర్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో విభాగం ప్రొఫెసర్స్ జహంగీర్, సంపత్ కుమార్, స్మిత, సమున్నత పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉద్యో గులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి పునః ప్రతిష్టాత్మ మహోత్సవం



నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ పరిధిలో 1 నుండి శ్రీ శ్రీ శ్రీ శీతలాదేవీ (బొడ్రాయి) పునః ప్రతిష్ట నాలుగు రోజులుగా వివిధ ప్రత్యేక పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకొని మంగళవారం అఖండ అన్నదానం కార్యక్రమంతో ఉత్సవాలు ముగినాయి.. అన్నదాన కార్యక్రమం లో లాలపెట్ తార్నాక ప్రజలే కాకుండా జంట నగరాల్లో ప్రజలు, బంధువులు భారీగా తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమన్ని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వంజరి ముత్తయ్య, మురళీ యాదవ్, ధనరాజ్, సునీల్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, ఉపేందర్ యాదవ్,కురెల్లి.కిరణ్ గౌడ్,శ్రీను మామా, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు

● సెప్టెంబర్ 10నుంచి 17వరకు తెలంగాణ విలీన దినోత్సవాలు

● 10న సుందరయ్య పార్క్ వద్ద సీపీఐ(ఎం) సభ

● ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు ప్రదర్శన



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సందర్భంగా సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను నిర్వహిస్తోందని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం గోల్కొండ చౌరస్తాలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 10న చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా నగరంలోని సుందరయ్య పార్క్ వద్ద సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆర్టీసీ క్రాస్‌రోడ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలో సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యురాలు కామ్రేడ్ బృందా కరత్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం నిజాం నవాబుపై, జమీందారు, జాగిర్దారులపై జరిగిన పోరాటమని వివరించారు. తెలంగాణ రైతాంగం జరిపిన ఈ పోరాటాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంస్థలు వక్రీకరించి మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి వాడుకుంటున్నాయని మండిపడ్డారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోరాటమని, ఈ పోరాటంతో సంబంధంలేని సంఘ పరివార్ శక్తులు పోరాటానికి మతం రంగుపులిమి ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోరాటం సాధించిన ఘనవిజయాలు, వీరుల త్యాగాలు, వాస్తవాలను ప్రజల ముందుంచేందుకే ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఫోటో ఎగ్జిబి షన్లు, కళా సాంస్కృతిక ప్రదర్శనలతో సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరవాసులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.మహేందర్, ఎం.దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని భారత రత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఉత్సవాలను నిమ్స్ వైద్య ఆరోగ్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రప టానికి పూల మా లలు వేసి నివాళులు అర్పి ంచి అర్పించారు. నిజాం వైద్య విజ్ఞాన సంస్థ డీన్ డా" లిజా రాజశేఖర్ పాల్గొని పలువురు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా న్మానించారు.



మంగళవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఇఎస్‌సిఐ)లోని క్యాంపస్‌లో చాణక్య సెమినార్ హాల్‌లో ఉపాధ్యాయదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, ఇంజనీరింగ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- నవతెలంగాణ-సిటీబ్యూరో

నాలాలో పడి బాలుడు మృతి



నవతెలంగాణ-దుండిగల్

నాలాలో పడి బాలుడు మృతిచెందిన ఘటన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్ పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు జలమయమై పలు నాలాలు భారీగా నీటి ప్రవాహంతో నిండిపోయాయి. దీంతో ఎన్ఆర్ఐ కాలనీకి చెందిన బాలుడు మిథున్‌రెడ్డి (4) బయటకు వెళ్లి తిరిగి రాకపోవడం, కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికి బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంటల తరబడి పోలీసులు బాలుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. అనంతరం సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా బాలుడు నాళాలో పడి కొట్టుకుపోయినట్టు గుర్తించారు. అ మతదేహం నిజాంపేట్ రాజీవ్ గహకల్ప 45వ బ్లాక్ వద్ద కనిపించడంతో పోలీసులు పోలీస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాన్సీ నంబర్ల ద్వారా ఆర్టీఏకు ఒక్కరోజే 18.02లక్షల ఆదాయం

జేటీసీ పాండురంగ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖకు ఫ్యాన్సీ నెంబర్ల ద్వారా మరోసారి కాసుల వర్షం కురిసింది. మంగళ వారం ఈస్ట్‌జోన్ మలక్‌పేట్ ఆర్టీఏ కార్యాల యంలో నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల ఈ-వేలంలో ఆ శాఖకు భారీ మొత్తంలో ఆదా యం సమకూరింది. ఈ-వేలం ద్వారా ఫీజుల రూపంలో రూ.2.01లక్షలు, బిడ్డింగ్ ద్వారా 16.01లక్షలు రాగా మొత్తం 18.02లక్షల ఆదాయం వచ్చిందని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండు రంగ నాయక్ తెలిపారు. ఇందులో చర్చి ఎడ్యూకేషనల్ సొసైటీ తమ విలువైన కారు కోసం రూ.9.99లక్షల కుపైగా వెచ్చించి టీఎస్11 ఈజెడ్ 9999 నంబర్‌ను సొంతం చేసుకుంది. అదేవిధంగా కామినేనీ సాయి శివ నాగ్ అనే వ్యక్తి రూ.3.5లక్షలు చెల్లించి టీఎస్11ఎఫ్ఏ 0001 నంబర్‌ను దక్కించుకున్నారు. సామల రోహిత్ రెడ్డి అనే వ్యక్తి తమ విలువైన కారు కోసం రూ.1.55లక్షలు వెచ్చించి టీఎస్11ఎఫ్ఏ 0011 నంబర్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే ఎన్.కవిత రూ.80వేలు వెచ్చించి టీఎస్11ఎఫ్ఏ 0007ను, ఎం.సంధ్య రూ.56వేలు చెల్లించి టీఎస్11ఈజెడ్ 9990ను, సి.సిరాజ్ రూ.36వేలు వెచ్చించి 0027ను, ఆర్. పృథ్వీరాజ్ రూ.16వేలు చెల్లించి టీఎస్11ఈజెడ్ 0015 నంబర్‌ను దక్కించుకున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మత్తు పదార్థాలు సేవిస్తున్న ఐదుగురి అరెస్ట్

నవతెలంగాణ - ముషీరాబాద్

బహిరంగ ప్రదేశాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం గంజాయి మత్తు పదార్థాలు సేవిస్తున్నటువంటి మహాత్మా నగర్ కు చెందిన పవన్, ముషీరాబాద్ కు చెందిన శ్రావణ్, మేదర్ బస్తీకి చెందిన సమీర్ ఖాన్, చాపల మార్కెట్ కు చెందిన భరత్ కళ్యాణ్, రిసాల గడ్డ బషీరుద్దీన్ బోలక్ పూర్ రంగా నగర్ ప్రాంతంలో రాత్రి సమయంలో బహిరంగ ప్రదేశాలలో నిషేధిత గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవిస్తూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనీ కాలనీవాసుల ఫిర్యాదు మనకు ముషీరాబాద్ పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు వీరికి పది రోజుల జైలు శిక్ష విధించిగా పోలీసులు వారిని రిమాండ్ కు తరలించారు.

నూతన ఓటర్ నమోదుపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలి

నవతెలంగాణ-అంబర్ పేట

బర్కత్పురా లోని నగర బిజెపి కార్యాలయంలో ఈరోజు నగర పతాధికారులు మోర్చా అధ్యక్షులు కార్యదర్శులు రాష్ట్ర నాయకులు డివిజన్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ బూతు జీతో దేశ్ దిచో కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వెరిఫికేషన్ చేయవలసిందిగా సూచించారు. అదే రకంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కొన్ని ఓట్లను కూడ తొలగించింది. అలాంటి పొరబాటులను రాష్ట్ర ప్రభుత్వం పునరావృతం చేయకుండా తగు చర్యలను చేపట్టాలని డాక్టర్ ఎన్ గౌతమ్ రావు డిమాండ్ చేస్తూ ప్రసంగించారు.

మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ మేరా మాటి మేర దేశ్ కార్యక్ర మన్ని ప్రతి బూతులో నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి బూతు నుండి ప్రతి ఇంటి నుండి చిటికెడు మట్టి లేక నాలుగు గింజల బియ్యంను సేకరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద దేశ స్వతంత్రంలో తమ ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర సమర యోధుల మరియు దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికుల స్మారక చిహ్నాలతో కూడిన అమృతవనం పార్కును నిర్మించ తలపెట్టారు ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అమృత, మహాలక్ష్మి రామన్ గౌడ్ ప్రధాన కార్యదర్శులు సందీప్ సాయి కృష్ణ గౌడ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లంకా దీపక్ రెడ్డి రామన్ గౌడ్ నగర ఉపాధ్యక్షులు వనం రమేషు కన్నె రమేష్ యాదవ్ కీర్తి రెడ్డి కేశ బోయిన శ్రీధర్ అనంతలక్ష్మి సూర్యప్రకాష్ సింగ్ తదితరులు పాల్గొన్నరు.



ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించిన
పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వివిధ మండలాల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న టీచర్లు ఇష్రత్ సుల్తానా, సి.రమాదేవీ, సద్గుణా, నాగలత, విద్యారాణి, శ్రీలత, ఉమాలక్ష్మి దేవీ, హృదయమేరి, నీలిమ వాణిలను పీఆర్‌టీయూ టీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి. మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.తిరుపతి రెడ్డి అభినందించారు.

అత్యవసర సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్



నవతెలంగాణ-బంజారాహిల్స్
అకాల వర్షానికి ప్రహరి గోడకు కూలిన సంఘటన వెంకటేశ్వర కాలనీ డివిజన్ గౌరీ శంకర్ కాలనీలో చోటు చేసుకుంది. మంగళవారం ఆ ప్రాంతంలో మరోచోట ఇలాగే గోడ కులే పరి స్థితి ఏర్పడంతో స్థానిక కార్పొరేటర్ మన్నే కవితరెడ్డి స్థానికులతో ఆమె అత్యవ సర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏ ఒక్కరు అధైర్య పడవద్దని, తక్షణ సహకార చర్యలు అందించడానికి డిఆర్ఎఫ్, జిహెచ్ఎంసి సిద్ధంగా ఉందని తెలియజేస్తూ భారీ వర్షాలకు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఏది జరిగిన సమాచారం ఇవ్వాలని తెలిపారు.

మధుయాష్కిపై జరుగుతున్న దుష్ప్రచారం మానాలి



నవతెలంగాణ-అంబర్‌పేట
కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాట యోధులు, మాజీ ఎంపీ మధు యాష్కీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మంగళవారం బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎల్బీ నగర్ టికెట్ కోసం మధుయాష్కి దరఖాస్తు చేసుకున్న తరువాత జరుగుతున్న దుష్ప్రచారాన్ని పార్టీ కార్యకర్తలు, నేతలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బలహీన వర్గాలకు చెందిన మధుయాష్కిని స్క్రీనింగ్ కమిటీలో వేయనప్పుడు మాట్లాడని వారంతా ఇప్పుడు మాట్లాడడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ప్రచారానికి పాల్పడిన వారు తక్షణమే క్షమాపన చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం వెంటనే ఖండించాలని లేనియెడల పార్టీ అధిష్టానం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లవలసి వస్తుందని ఆయన అన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి అత్యంత గౌరవం

- అవార్డులు వచ్చినవారే కాదు.. అందరూ ఉత్తమ ఉపాధ్యాయులే : హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ
- జిల్లాలో 81 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక
- ఘనంగా సన్మానం, మెమెంటోల అందజేత





నవతెలంగాణ-సిటీబ్యూరో
సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి అత్యంత గౌరవ స్థానం ఉందని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది సమాజానికి ఉత్తమ పౌరులను అందజేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నారాయణగూడ కేశవ మెమోరియల్ పాఠశాలలోని సర్దార్ పటేల్ హాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ గురుపూజోత్సవ కార్యక్రమ ప్రారంభంలో హిమాయత్ నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, విద్యాశాఖ అధికారులతో కలిసి డీఈవో రోహిణి భారత మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేసి.. జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల బోల్లారం, మారేడుపల్లి పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. జిల్లాలో తమదైన ప్రత్యేక బోధనా పద్ధతులను వినియోగించి విద్యార్థులలో సామర్థ్యాలను పెం పొందించిన 81 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఘనంగా సన్మానించింది. వారికి జ్ఞాపిక, శాలువాతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేసింది. ఈ సందర్భంగా డీఈవో రోహిణి మాట్లాడుతూ సమాజంలో ఎన్ని వృత్తులు ఉన్న ఉపాధ్యాయ వృత్తిని మించింది లేదన్నారు. ఉత్తమ అవార్డులు వచ్చినవారే మాత్రమే ఉత్త మ ఉపాధ్యాయులు కాదని.. ప్రతి టీచర్ బెస్ట్ టీచరేనన్నారు. అవార్డులు ఉపాధ్యాయు ల్లో మరింత ఉత్సాహాన్ని, పని పట్ల నిబద్ధ తను పెంచుతాయని తెలిపారు. డిజిటల్ లైబ్రరీ రూపకల్పనతో పాటు పలు అంశాల్లో రాష్ట్రంలోనే హైదరాబాద్ జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటుదీటుగా విద్యాబోధన జరుగుతు ందని, మనబస్తీ-మనబడి కార్యక్రమం ద్వారా సర్కారు బడుల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేయాలన్నారు. ఒక ఉత్తమ విద్యార్థిని ఉపాధ్యాయుడు తయా రు చేయగలరని, ఉపాధ్యాయుని పాత్ర తరగతి గదికే పరిమితం కాదని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు చిరంజీవి, వెంకటేశ్వర్లు, శ్యామూల్ రాజ్, బాలు నాయక్, నెహ్రూ బాబు, రాధాకృష్ణ, కె.యాదయ్య, డిప్యూటీ ఐవోఎస్‌లు లక్ష్మన్ సింగ్, కమిటీ సభ్యురాలు రాణి, ఇతర సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామిక వ్యవస్థ కు ప్రమాదకరం



యంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్

నవతెలంగాణ-ముషీరాబాద్
దేశంలో జమిలి ఎన్నికలు తీసుకువచ్చి ప్రజాస్వామిక వ్యవస్థ స్థానంలో నియంతృత్వ పాశవిక వ్యవస్థను తీసుకురావాలని కేంద్రం లోని నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని బలపరచడం హేయమైన నిర్ణయం అని యంసీపీఐ(యు) జాతీయ కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం మంద రవి అధ్య క్షతన బాగ్ లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైనా పార్టీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు బీజేపీ తన నియంతృత్వ విదానాల ద్వారా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేసి అభాసుపాలవుతున్నది, ఆ అప్రతిష్ట నుంచి బయటకు రావడానికి ప్రజా ఎజెండా కాకుండా మనువాద, కార్పొరేట్ ఎజెండా అమలు చేస్తున్నదన్నారు. అని దీనికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు వామపక్ష సెక్యులర్ ప్రజాస్వామిక శక్తులు సంఘటితం కావాలని విజ్ఞప్తి చేశారు. బూర్జువా కార్పోరేట్ పార్టీల కు ప్రత్యామ్నాయం వామపక్ష కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడాలని, రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో యంసీపీఐ(యు) పార్టీ బహుజన లెఫ్ట్ ఫ్రంట్, సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ లతో కలిసి పోటీ చేస్తుందన్నారు. యంయల్ పార్టీలు, సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు కూడా ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేయటం మంచిదని, అందుకు సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు, యంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ కలిసి రావాలి అని లేఖలు రాసిందన్నారు. అని సిపిఐ,సిపిఎం లు ఇప్పటి వరకు స్పందించ లేదు అని యంసిపిఐ(యు) అన్నారు.సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన ఈ గడ్డ లో ఎర్రజెండా ఔన్నత్యం ను ఆత్మగౌరవం ను కాపాడుకోవాల్సిన కర్తవ్యం తెలంగాణ గడ్డపై ఉన్న అన్ని కమ్యూనిస్టు ఎర్రజెండా పార్టీల పై ఉన్నదని ఇప్పటికైనా ప్రజా ఉద్యమం కోసం, ఎన్నికల కోసం కలిసి పని చేద్దాం అని అన్నారు.ఈ సమావేశంలో యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి,వనం సుదాకర్, కుంభం సుకన్య, వరికుప్పల వెంకన్న. వడ్తియ తుకారాం నాయక్, వసుకుల మట్టయ్య, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్,ఎస్ రెడ్డి హంసా రెడ్డి, యస్ కే నజీర్ . గారలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వివిధ మండలాల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న టీచర్లు కె.అనిత (జీజీహెచ్ఎస్ కాచిగూడ), మేడే ప్రభాకర్(జీబీహెచ్ఎస్ న్యూబోయిగూడ), జె.హైమావతి (మార్కెట్ లాలాపేట్), పి.శ్రీమన్నారాయణ(జీహెచ్ఎస్, ఎంపీ బాగ్ అడ్డగుట్ట), సి.రామదేవీలను(జీజీహెచ్ఎస్ న్యూ ముసారాంబాగ్) టీఎస్‌యూటీఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.రాజారావు, ప్రధాన కార్యదర్శి ఏ.శ్యామ్ సుందర్ అభినందించారు.

తెలంగాణ స్కూల్ స్లీపర్స్ కు కనీస వేతనాలు పెంచాలి



తెలంగాణ స్కూల్ స్లీపర్స్ రాష్ట్ర అధ్యక్షులు గంటన్న

నవతెలంగాణ- ముషీరాబాద్
తెలంగాణ స్కూల్ స్వీపర్లకు కనీస వేతనం పెంచాలని రాష్ట్ర అధ్యక్షులు గట్టన్న అన్నారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ స్కూల్ స్లిప్పర్స్ సంఘం ఆధ్వర్యంలో మహా ధర్నాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఎఫ్‌టీ యు రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాలాగౌడ్, ఎస్ఎం.ఖలీల్, కే.శ్రీనివాస్ రావ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గట్టన్న మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనం తరం స్వపర్‌గా పనిచేస్తున్న మాకు జీతాలు పెంచకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్కూల్ స్వీపర్సులకు కనీస వేతనం 27 వేలకు పెంచా లన్నారు. పాత బకాయిలు రెండు లక్షల 33 వేల 112 రూపాయలు వెంటనే చెల్లించాలన్నారు. స్వీపర్లందరినీ ఫుల్ టైం స్లీపర్లుగా గుర్తించాలన్నారు. 61 సంవత్సరాలు నిండిన స్వీపర్ల కు రిటైర్మెంట్ బెనిఫిట్ కోసం 15 లక్షల ఇవ్వాలన్నారు. చనిపోయిన స్లీపర్ల వారి స్థానాల్లో వారి వారసులకు పర్మినెంట్ ఉద్యోగం కల్పించి అన్ని పాఠశాలలో స్వీపర్ల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్కూల్ స్వీపర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో స్లీపర్ల సంఘం నాయకులు తదితరులు మాట్లాడారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే లక్ష్మికి ప్రమాదం

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) ముషీరాబాద్ జోన్ కార్యదర్శి యం.దశరథ్



నవతెలంగాణ-ముషీరాబాద్
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే లక్ష్మికి ప్రమాదం జరిగింది అని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) ముషీరాబాద్ జోన్ కార్యదర్శి యం.దశరథ్ అన్నారు. కమాడగూడ డివిజన్ దామోదర సంజీవయ్య నగర్‌లో హుస్సేన్‌సాగర్‌నాలాలో ప్రమాదవశాత్తు పడిపోయిన లక్ష్మికుటుంబసభ్యులను పరామర్శించుట కోసం ప్రమా దం జరిగినస్థలాన్ని భారతకమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) ముషీరాబాద్‌కార్యదర్శి యం.దశరథ్ పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక సంవత్స రాల నుంచి హుస్సేన్ సాగర్ నాలాప్రహరీ గోడ నిర్మిం చాలని అధికారులకు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన ప్రహరీపూర్తి చేయలేదని, మనుషుల ప్రాణం పోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. పేదలు నివసించే బస్తీలలో నాలాల ప్రహరీలు, మ్యాన్ హెూల్స్ కారణంగా ఇప్పటికే ముషీరాబాద్‌లో అనేక ప్రమాదాలు జరిగాయని,ఎక్కడ వేసిన గొంగడి అక్కడే లాగే ఉందన్నారు. ఈ ఘటన కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నాలా ప్రహరీ గోడ నిర్మించకపో వడం వల్లనే జరిగిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాలా ప్రహరీ గోడ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ఓబీసీలో చేర్చాల్సిందే!
రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప



నవతెలంగాణ-సిటీబ్యూరో
రానున్న అసెంబ్లీ ఎన్నికల ముందే వీరశైవ లింగాయత్ లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాలను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చే విషయంపై మంగళవారం న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో నేషనల్ బీసీ కమిషన్ చైర్మెన్ ఆహిర్ గంగారం నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, పార్లమెంటరీ బోర్డు సభ్యులు బీబీ పాటిల్, బీసీ కమిషన్ మెంబర్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు హాజరై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ తెలంగాణలోని 90 శాతం మంది వీరశైవ లింగాయత్‌లకు లింగ బలిజలకు గత 14 ఏండ్ల నుంచి కేంద్ర ప్రభుత్వ పథకాలు అందడం లేదని వాపోయారు. విద్యా ఉద్యోగ సంక్షేమ పథకాల్లో జరుగుతున్న అన్యాయాన్ని సమావేశంలో గట్టిగా వినిపించామని, జాతీయ బీసీ కమిషన్ సభ్యులు అధికారులు ఇది వాస్తవమేనని గుర్తించారని తెలిపారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చుటకు కేంద్రానికి రెకమెండ్ చేస్తూ నివేదికలు పంపిస్తామని వారు హామీఇచ్చారని చెప్పారు. రానున్న ఎన్నికల కంటే ముందే ఓబీసీ జాబితాలో చేర్చుటకు కేంద్రం ప్రధాని మోడీతో మాట్లాడేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, దినేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

నాలా సమస్యను తక్షణం పరిష్కరించాలి-ఐద్వా

నవతెలంగాణ-సిటీబ్యూరో
కమాడిగూడ దామోదర సంజీవయ్య నగర్‌లో హుస్సేన్‌సాగర్ నాలాలో ప్రమాదవశాత్తు పడిపోయి ఆచూకీ దొరకకుండా పోయిన లక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని,నాలాకు తక్షణం ప్రహరీ గోడను నిర్మించాలని ఐద్వా హైద్రాబాద్ సెంటిల్ సిటీ అధ్యక్ష కార్యదర్సులు ఏ పద్మ,కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాల నుంచి హుస్సేన్ సాగర్ నాలా ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులకు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ఈ సంఘటన జరిగిందని వారు చెప్పారు.వర్షాకాలం వచ్చిందంటే అక్కడి ప్రజలు ఎప్పుడు ఎవరికి ఏ అపాయం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. ప్రాణం పోతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. పేదలు నివసించే బస్తీలలో నాలాల ప్రహరీ గోడలు, మ్యాన్ హెూల్స్ నిర్వహణ లేని కారణంగా ఇప్పటికే ముషీరాబాద్ లో అనేక ప్రమాదాలు జరిగాయి. అయినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే లాగే ఉంది. ఈ ఘటన కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే నాలా ప్రహరీ గోడ నిర్మించకపోవడం వల్లనే జరిగిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాలా ప్రహరీ గోడ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీ కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఐద్వా హైద్రాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న హృదయ మేరి



నవతెలంగాణ-సిటీబ్యూరో
జీపీఎస్ కాలాడేరా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న హృదయ మేరీకి తన సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ మండల డిప్యూటీ ఈవో రాధాకృష్ణ, ఇతర మండలాల డిప్యూటీ ఈవోలు, ఐవోఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



-నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
నగరంలో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హిమాయత్ సాగర్ రెండు గేట్లు ఎత్తడంతో మూసీ నది ఉవేత్తిన ప్రవహిస్తుంది. మంగళవారం జిహెచ్ఎంసి గోషామహల్ సర్కిల్ -14 పరిధిలో ముస్లిం జంగ్ బ్రిడ్జి, శివాజీ బ్రిడ్జి మూసీ నది పక్కన ఉన్న ప్రజలను జిహెచ్ఎంసి అధికారులు అప్రమత్తం చేశారు 45 కుటుంబాల ప్రజలకు పునరావాస కేంద్రం చుడి బజార్ లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ పునరావాస కేంద్రాన్ని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు వసతి. ఉచితంగా భోజనం (ఆహారం) అందిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెప్పారు ప్రజలకు కావలసిన అన్నిటిని ప్రభుత్వ అధికారులు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, ఏఎంహెచ్ఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, యుసిడిసీ ఒ.సమ్మయ్య రాజు. ఆర్‌పిలు నాగశ్రీ .అనుష. జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

6వ రోజు వినూత్నంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు నిరసన



నవతెలంగాణ-సుల్తాన్ బజార్
ఎన్‌హెచ్ఎం స్కీములో ప్రభుత్వ యుపిహెచ్‌సీ పని చేస్తున్న అకౌంటెంట్స్, డీఈఓ.సపోర్టింగ్ స్టాప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరి డీఎంహెచ్ఎస్ క్యాంపస్ ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న ఆందోళన 6వ రోజు వినూత్నంగా కొన సాగించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఉద్యగులకు సమన పనికి సమాన వేతనం (రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ పే వర్తింపజేయాలి) ఇవ్వాలని డిమాండ్, ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన సమ్మె కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాల సుబ్రహ్మణ్యం శ్రీమణి, శ్రీలక్ష్మి, భార్గవి, లోకేష్, ప్రకాష్, బాల్ రెడ్డి, డిఈఓ సరికొండ సురేష్, లక్ష్మి, వినోద్ .వసుంధర, అశ్విని, హైదరాబాద్ మేడ్చల్ రంగారెడ్డి జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బండ ప్రకాష్‌ను కలిసిన టి.శాక్స్ ఉద్యోగులు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్
తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉద్యోగులను తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని టి.శాక్స్ ఉద్యోగ నాయకులు మంగళవారం శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండ ప్రకాష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆర్ సుజిత్ గాంధీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.రంజిత్ కుమార్. ప్రెసిడెంట్ శ్యాంసుందర్ జిల్లాల ప్రెసిడెంట్‌లు సతీష్. కీర్తి సతీష్ వినతిపత్రం అందజేసి కొరిలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగులను రాష్ట్ర ఉద్యోగులుగా విలీనం చేసుకుంటే ఎలాంటి అభ్యంతరం లేదని, కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన డబ్బులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, ఈ అంశాన్ని సీఎం కేసీఆర్. దృష్టికి తీసుకు వెళ్లాలని బండ ప్రకాష్‌కు వివరించారు. దీనిపై స్పందించిన ఆయన సీఎం కేసీఆర్‌కు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుకు లేఖ రాసినట్లు తెలిపారు.

భారీ వర్షాల కు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సూచించారు. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రెండింటి గేట్లు ఎత్తడంతో ఆ నీరు మూసిలో కలుస్తుందని, మూసిలో వరద ప్రవాహం ఎక్కువైందని, ఈ నేపథ్యంలో అంబర్ పేట మూసారంబాగ్ బ్రిడ్జి వద్ద వరదనీటి ఉధృతిని జిహెచ్ఎంసి సర్కిల్ డిఎం సి మారుతి దివాకర్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం పరిశీలించారు. వరద ప్రవాహానికి అడ్డుగా నిలిచిన చెత్తాచెదారాన్ని తొలగించాలని డీసికి సూచించారు. వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరో రెండు రోజులు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కంచ మహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.



మూసి పరీవారక ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
-కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట
మూసి పరీవారిక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా ఇబ్బందులు వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం అంబర్ పేట డివిజన్ నాలా పరీవాహక ప్రాంతంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని పటేల్ నగర్,ప్రేమ్ నగర్ లో సంబంధిత జిహెచ్ఎంసి సిబ్బందితో కలిసి నాలా పరివాహక ప్రాంతంలో పర్యటించి నాలాలో వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు, నాలాలో ఉన్న చెత్తని మట్టికుప్పలను తొలగించినట్లు తెలిపారు. వర్షాలు తగ్గేవరకు డివిజన్ ప్రజలకు వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే తనకు సమాచారం అందించవలసిందిగా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ విశ్వజిత్,వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ, జీహెచ్ఎంసి, ఎస్ఎఫ్ఏ సిబ్బంది పాష,శ్రీనివాస్, పారిశుద్ధ సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రంగు సతీష్ గౌడ్,మహేష్ ముదిరాజ్,సంతోష్ చారి,స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులు జలమయం

నవతెలంగాణ-ముషీరాబాద్
గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన లోతట్టు ప్రాంతాలే కాకుండా ప్రధాన రహదారులు కూడా పూర్తి స్థాయిలో జలమయమయ్యాయి. ముషీరాబాద్ నియోజకవర్గం లోని రాంనగర్ చౌరస్తా నుంచి వి ఎస్ టి చౌరస్తా రోడ్డు మార్గంలో వర్షాల వలన ప్రధాన రహదారి జలమేమవడంతో వాహన రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి



నల్లని కురుల కోసం...



పోషకాల లోపాల వల్లనో ఇతరత్రా కారణాల వల్లనో కొందరికి చిన్న వయసులో జుత్తు తెల్లబడిపోతుంది. ఇందుకు కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే తెల్లబడిన హెయిర్ మళ్లీ నల్లబడుతుంది. ఓ సారి ప్రయత్నించి చూడండి...

- రెండు చెంచాల ఉసిరిక పొడి, చెంచాడు బాదం నూనె, అరచెంచా కొబ్బరి నూనె కలిపి పేస్ట్‌లా చేసి, రాత్రి తలకు రాసుకుని, ఉదయాన్నే తల స్నానం చేయాలి. వారానికి రెండు సార్లయినా ఇలా చేస్తే ఫలితముంటుంది.
- కరివేపాకు వేసి మరిగించిన కొబ్బరి నూనెను రోజూ తలకు రాసుకుని, పొద్దున్న తలస్నానం చేస్తూ ఉంటే సమస్య పరిష్కారమవుతుంది.
- ఉల్లిగడ్డను మిక్సీలో వేసి మెత్తని పేస్ట్‌లా చేసి, అందులో నిమ్మరసం కలిపి పడుకునే ముందు జుత్తుకు, తలకు బాగా రాయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడిగేసి, మైల్డ్ షాంపూతో తల స్నానం చేయాలి. కొన్ని రోజులు ఇలా చేస్తే ఫలితం ఉంటుంది.
- గోరింటాకు, మందార ఆకులు, కరివేపాకుల్ని సమపాళ్లలో తీసుకుని మెత్తగా రుబ్బి, తలకు రాసుకుని అరగంట తర్వాత తలస్నానం చేయాలి. తరచూ ఇలా చేస్తే తెల్లజుత్తు నల్లబడటమే కాదు, ఆరోగ్యంగా తయారవుతుంది కూడా.

బాదం నూనెతో మృతకణాలకు చెక్..



- బాదం నూనెలో ఎ, ఇ విటమిన్లు ఉంటాయి. ఈ నూనె మృతకణాల్ని తొలగించడంలో సాయపడుతుంది. సమపాళ్లలో బాదం, కొబ్బరినూనె కలిపి నల్లటి వలయాలపై రాస్తే కొద్ది రోజులకు అవి మాయమవుతాయి.
- రెండు చెంచాల బాదం నూనెలో చెంచా నిమ్మరసం వేయాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా వేసి అరగంట తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే ముఖం మెరిసిపోతుంది.
- ప్రతి రోజూ రాత్రి పడుకునే ముందు బాదం నూనె ముఖానికి రాస్తుంటే చర్మం మెరిసిపోతుంది. పావుగంట పాటు బాదం నూనెని ముఖానికి మర్దన చేశాక గంధంతో ఫేస్‌ప్యాక్ వేస్తే ముఖానికి అదనపు సొగసు చేరుతుంది.
- బాదంనూనె, తేనె మిశ్రమాన్ని సమపాళ్లలో తీసుకుని ముఖానికి రాస్తే మృదువైన చర్మం మీ సొంతమవుతుంది.
- చెంచా చొప్పున బాదం నూనె, చక్కెర తీసుకుని కలిపి, దాన్ని వేళ్లతో తీసుకుని ముఖంపై వలయాకారంగా పది నిమిషాల పాటు రుద్దాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీళ్లతో కడిగేయడం వల్ల మృతకణాలు తొలగిపోయి ముఖం శుభ్రంగా మారుతుంది.
- అరచెంచా చొప్పున బాదం నూనె, తేనె తీసుకుని మిశ్రమంలా చేసి నిద్రపోయే ముందు నల్లటి వలయాలపై రాస్తే చక్కటి ఫలితం ఉంటుంది. ఆముదం, బాదం నూనె మిశ్రమాన్ని నల్లగా మారిన పెదాలపై తరచూ రాస్తే అవి గులాబీ రంగులోకి మారతాయి.



ఇకపై ఆ పదాలు నిషేధం

పురుషాధిక్య సమాజంలో మహిళలను కించ పరిచే కొన్ని పదాలను అందరూ సర్వసాధారణంగా వాడుతుంటారు. అయితే ఇకపై అలాంటి పదాలు నిషేధిస్తూ సుప్రీం కోర్ట్ ఓ చక్కటి నిర్ణయం తీసుకుంది. ఆ పదాలు ఎందుకు నిషేధించాల్సి వచ్చిందో, ఆ పదాలు స్త్రీల వ్యక్తిత్వాన్ని ఎలా తగ్గిస్తున్నాయో వివరిస్తూ ఒక హ్యాండ్ బుక్‌ను కూడా విడుదల చేసింది. ఇకపై కోర్టుల్లో మహిళల గురించి ప్రస్తావించేటపుడు కొన్ని రకాల పదాలను ఉపయోగించ కూడదని ఈ పుస్తకంలో స్పష్టం చేసింది. ఆ వివరాలేంటే తెలుసుకుందాం...

ఇటీవల దేశంలోని న్యాయవాదులు, న్యాయ మూర్తులు న్యాయపరమైన సంభాషణలో ఉపయోగించే పదాలు, పదబంధాలలో ప్రతి బింబించే "పితృస్వామ్య అండర్ టోన్‌లతో కూడిన పురాతన ఆలోచనలను" తొలగించే ప్రయత్నంలో 30 పేజీల హ్యాండ్‌బుక్‌ను సుప్రీంకోర్టు విడుదల చేసింది. ఉంపుడుగత్తె, వేశ్య, పవిత్ర మహిళ, అత్యాచారం వంటి పదాలు మహిళలను కించ పరిచే విధంగా ఉన్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అయితే కొంతమంది మానవ హక్కుల కార్యకర్తలు, న్యాయ వాదులు ఈ మార్పు వల్ల మహిళలపై దాడులకు పాల్పడిన వారి నేరాలు పలుచన చేయవచ్చనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. అయితే జస్టిస్ చంద్రచూడ్ హ్యాండ్‌బుక్‌లో ఈ పదాలు సాంస్కృతిక, సామాజిక పరిస్థితులలో ఎలా ప్రవేశిస్తాయో వివరించారు.

స్త్రీల వ్యక్తిత్వాన్ని తగ్గిస్తాయి

"ఒక మహిళ ఎంపికలు (ఉదా... ఆమె ధరించే బట్టలు), లైంగిక చరిత్ర ఆధారంగా ఆమె ప్రవర్తన గురించి ఊహించుకుం టుంటాం. న్యాయ విచారణలో ఆమె చర్యలు, ప్రకటనలు ఎలా అంచనా వేయబడతాయో కూడా ప్రభావితం చేయవచ్చు. స్త్రీ పాత్ర, ఆమె ధరించే దుస్తులపై ఆధారపడిన ఊహలు, లైంగిక సంబంధాలలో సమ్మతి ప్రాముఖ్యతను అలాగే స్త్రీల వ్యక్తిత్వాన్ని తగ్గిస్తాయి. సాధారణంగా స్త్రీలను లైంగి కంగా వేధించే పురుషులు అపరిచితులు, వారు స్త్రీకి తెలియదు అని అనుకుంటాం. వాస్తవానికి పురుషులు తమకు తెలిసిన స్త్రీని లైంగికంగా వేధిస్తారు. స్త్రీ సహోద్యోగి, యజమాని, ఉద్యోగి, పొరుగువారు, కుటుంబ సభ్యులు, స్నేహితురాలు ఇలా ఎవరైనాకావచ్చు. అలాగే అణగారిన కులాల స్త్రీలతో పురుషులు లైంగిక సంబంధాలలో పాల్గొనడానికి ఇష్టపడరు అని ప్రచారంలో వుంది. కానీ నిజానికి లైంగిక హింస చాలా కాలంగా సామాజిక నియంత్రణ సాధనంగా ఉపయోగించబడు తున్నాయి. ఆధిపత్య కుల పురుషులు లైంగిక హింసను కులాన్ని బలోపేతం చేయడానికి ఒక సాధనంగా ఉపయో గించారు" అని ఈ హ్యాండ్ బుక్‌లో జస్టిస్ చంద్రచూడ్ ప్రస్తావించారు.



చట్టాలను ఆసరా చేసుకుని

చెన్నైకి చెందిన చిత్ర నిర్మాత, కుల వ్యతిరేక ఉద్యమకారిణి దివ్య భారతి మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో లోతుగా పాతుకుపోయిన పక్షపాతాలే కొన్నేండ్ల కిందట నన్ను లా ప్రాక్టీస్‌ను విడిచిపెట్టేలా చేశాయి. చట్టాలను ఆసరా చేసుకుని కులం, లింగ వివక్ష ఇప్పటికీ ప్రధాన నమ్మకాలు ఉన్నాయి. ఇవి అధికార దుర్విని యోగానికి దారితీస్తాయి. అట్టడుగు వర్గా లను అట్టడుగున ఉంచే సామాజిక నిబంధ నలను శాశ్వతం చేస్తాయి. కోర్టులలో మహిళలు, లింగ వివక్ష, లైంగికతపై చాలా మూర్ఖపు అభిప్రాయాలు కొన సాగుతున్నాయి. ఈ హ్యాండ్‌బుక్ ఒక ప్రారంభం అయితే మరిన్ని మార్పుల కోసం కఠినమైన, నిరంతర ప్రయత్నాలు అవసరం" అని చెప్పారు.




వారి దృష్టిలో ఇవి నేరాలు కావు

1992లో రాజస్థాన్‌కు చెందిన ప్రభుత్వ సామాజిక కార్యకర్త భన్వారీ దేవి బాల్య వివాహాన్ని నిరోధించేం దుకు కృషి చేస్తున్నారు. అణగారిన కులానికి చెందిన తనపై అనేక మంది ఆధిపత్య కులాల వారు లైంగికంగా దాడి చేశారని ఆమె ఫిర్యాదు చేశారు. 1995లో ఈ పరిశీలనల ఆధారంగా ట్రయల్ కోర్టు నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. ఎందుకంటే ఆధిపత్య కులానికి చెందిన వారు అణగారిన కులానికి చెందిన మహిళపై లైంగిక దాడి చేయరు, వృద్ధులు సామూహిక లైంగిక దాడిలో పాల్గొనరు, ఒక స్త్రీ తన భర్త సమక్షంలో లైంగికదాడికి గురికావడం అసంభవం వంటి నమ్మకాలు మన దగ్గర ఉన్నాయి. ఏప్రిల్ 2021లో గౌహతి పోలీసులు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) గౌహతికి చెందిన ఒక విద్యార్థిని అరెస్టు చేశారు. ఒక మహిళా విద్యార్థినితో బలవంతంగా మద్యం తాగించి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడటమే దీనికి కారణం. ఆ ఏడాది ఆగస్టులో గౌహతి హైకోర్టు 'సాంకేతిక కోర్సును అభ్యసిస్తున్న ప్రతిభావంతుడైన విద్యార్థి, దేశానికి అతను గొప్ప ఆస్తి' అనే కారణంతో అతనికి బెయిల్ మంజూరు చేసింది. అదే నెలలో ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ఓ భర్త తన భార్యపై లైంగిక దాడికి పాల్పడితే నిర్దోషిగా ప్రకటించింది. ఐపీసీ సెక్షన్ 375 కింద 'ఒక వ్యక్తి తన భార్యకు 15 ఏండ్లు దాటినట్లయితే ఆమెతో బలవంతంగా లైంగిక చర్యకు పాల్పడినా దాన్ని దాడిగా పరిగణించరు.



ఆలోచనల్లో మార్పు రావాలి

న్యాయవాది, మహిళా హక్కుల పోరాట యోధురాలు సుధా రామలింగం మాట్లాడుతూ 'న్యాయవ్యవస్థ లోతుగా పాతుకుపోయిన వివక్ష, పితృ స్వామ్యంతో నిండి ఉంది. దానిని అలాగే ఉంచే నిబంధనల గురించి మాట్లాడేముందు న్యాయ వాదులు, న్యాయమూర్తులు ఒకటికి రెండుసార్లు ఆలోచించేలా ఈ హ్యాండ్ బుక్ చేస్తుంది. మహిళ లపై జరుగుతున్న మాటల దాడులను మార్చే దిశలో హ్యాండ్‌బుక్ ఒక చిన్న అడుగు మాత్రమే. ఇది విప్లవం కాదు. వరకట్నానికి వ్యతిరేకంగా చట్టం ఉన్నప్పటికీ అది ఎలా నిరాటంకంగా కొనసాగుతోందో ఇదీ అంతే. ఆలోచనా ధోర ణుల్లో మార్పు సాధించాలని మనం లక్ష్యంగా పెట్టుకోవాలి" అంటున్నారు.



లింగ నిర్ధారణ హ్యాండ్‌బుక్ అంటే ఏమిటి?

లింగ మూస పద్ధతు లను ఎదుర్కోవడానికి సుప్రీం కోర్ట్ హ్యాండ్‌బుక్ 'వేశ్య', 'హుకర్' అనే పదాల స్థానంలో 'సెక్స్ వర్కర్'తో భర్తీ చేసింది. దీని ద్వారా ఒక పురుషుడు సెక్స్ వర్కర్‌పై లైంగిక దాడి చేయలేడు అనే మూస పద్ధతులను ఛేదించింది. 'వనరులు, విద్య ఉపాధిలో సమానమైన అవకాశాలు పొందలేకపోవడం వారిని లైంగిక పనిలోకి నెట్టివేస్తుంది. ఆ తర్వాత వారు మరో జీవితాన్ని ఎంచుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సెక్స్ వర్కర్ కేసు విచారణకు వెళ్లే ఏకైక మార్గం వారిని బాధితులుగా చూడడం. కాబట్టి 'సెక్స్ వర్కర్' అనే పదం వారికి కొంత శక్తిని ఇస్తుంది అని సౌత్ ఇండియా ఎయిడ్స్ యాక్షన్ ప్రోగ్రామ్ (ఎస్ఐఏపీ)కి చెందిన శ్యామలా నటరాజ్ అన్నారు.



ఆచరణలోకి రావాలంటే...

"హ్యాండ్‌బుక్ ఒక ముఖ్యమైన మార్గదర్శకం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. కానీ అది ఆచరణలోకి రావాలంటే దేశవ్యాప్తంగా ఉన్న న్యాయ కళాశాలలకు, పోలీసులకు ఇది చేరుకోవాలి. చట్టపరమైన సోదరభావాన్ని సున్నితం చేయాలి. న్యాయపరమైన పాత్రల కోసం రిక్రూట్ మెంట్ ప్రక్రియలు ప్రావీణ్యం పొందాలి. ఎస్ఐఏపీ మహిళలు, ట్రాన్స్‌జెండర్స్, సెక్స్ వర్కర్లతో సన్నిహితంగా పనిచేస్తోంది. వారి హక్కుల గురించి వారికి అవగాహన కల్పిస్తోంది. వారికి భద్రత, ఆరోగ్య సంరక్షణ కల్పించడంలో సహాయం చేస్తుంది. స్త్రీల లైంగికతపై పితృస్వామ్య నియంత్రణను విచ్ఛిన్నం చేయడం, మహిళలు తమ శరీరాలను వారు కోరుకున్న విధంగా ఉపయోగించుకునే సామర్థ్యాన్ని, ఎంపిక శక్తిని పునరుద్ధరించే ఉద్దేశ్యంతో పరిభాషలో వ్యత్యాసం చేయవచ్చు. అయితే ఇది చట్టపరమైన ఫ్రేమ్ వర్క్‌లో ఇప్పటికే నిర్వచించబడిన కొన్ని నిబంధనలను ఉపయోగించు కునే ప్రమాదం ఉందని మానవ హక్కుల కార్యకర్త, హైదరాబాద్‌లోని అక్రమ రవాణా నిరోధక సంస్థ ప్రజ్వల వ్యవస్థాపకురాలు సునీత కృష్ణన్ అన్నారు. అలాగే 'సెక్స్ వర్కర్' అనే పదాన్ని ఉపయోగించడం కార్మికుల హక్కులు, భద్రత, పన్నుల వంటి సమస్యల సందర్భంలో కార్మికుల ఉద్యమ భావజాలం నుండి కూడా వచ్చింది. నిర్బంధ ఎంపికల కారణంగా వ్యభిచారాన్ని ఎంచుకో వలసి వస్తుంది. అక్రమంగా రవాణా చేయబడిన ఒక మహిళ గురించి మనం మాట్లాడుతున్నప్పుడు దీన్ని ఉపయోగించలేరు" అని ఆమె అన్నారు. హ్యాండ్‌బుక్‌లో ఈ నిబంధనలు, వాటి అర్థాల గురించి 'మనసుతో కూడిన అవగాహన' కోసం కృష్ణన్ సీజేఐకి ఒక లేఖ రాశారు.

ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులు

- ఆన్‌లైన్‌లోనే డీఎస్సీ రాతపరీక్షలు : విద్యాశాఖ నిర్ణయం
- నేడో, రేపో మార్గదర్శకాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులని పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వ ఆమోదానికి పంపించింది. ఏయే పోస్టులకు ఎవరు అర్హులు, స్థానికత వంటి అంశాలకు సంబంధించి విధివిధానాలతో కూడిన మార్గదర్శకాలు బుధవారం లేదా గురువారం విడుదలయ్యే అవకాశమున్నది. అయితే ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులంటూ ఇటీవల రాజస్థాన్ కేసులో సుప్రీం కోర్టు కీలకమైన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన సమాచారాన్ని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) కూడా వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. దాని ప్రకారం ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులే అర్హులు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ ఎస్జీటీ పోస్టులకు డీఎడ్ అభ్యర్థులకే అవకాశం కల్పించాలని విద్యాశాఖ నిర్ణయించింది. 5,089 ఉపాధ్యాయ, 1,523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు కలిపి మొత్తం 6,612 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వాటి భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల రెండో వారంలో విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తున్నది. డీఎస్సీ రాతపరీక్షలను ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. అయితే అభ్యర్థులకు ఎక్కువ సమయం కేటాయించకుండా నోటిఫికేషన్ విడుదలైన 45 రోజుల్లోనే రాతపరీక్షలు నిర్వహించే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ టీఆర్టీ నిర్వహణకు సంబంధించి 2017 అక్టోబర్ పదిన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే 2018, ఫిబ్రవరిలో రాతపరీక్షలను నిర్వహించింది. అంటే నాలుగు నెలలపాటు సమయం తీసుకుంది. దీనికి కారణం టీఎస్‌పీఎస్సీకి ప్రత్యేకంగా జిల్లాల వారీగా అధికారులు, సిబ్బంది లేకపోవడమే. విద్యాశాఖకు అదనపు సంచాలకులు, సంయుక్త సంచాలకులు, ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలున్నారు. విద్యాశాఖ తీసుకునే ఏ నిర్ణయమైనా వెంటనే అమలు చేసేందుకు అవకాశమున్నది. అందుకే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాక వీలైనంత తొందరగానే రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వెబ్‌ఆప్షన్ల నమోదుకు రేపే ఆఖరు

- ఎంసెట్ బైపీసీ కౌన్సెలింగ్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు

15,388 మంది

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్, బయో టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంసెట్ బైపీసీ విద్యార్థులకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం నాటికి ధ్రువపత్రాల పరిశీలన గడువు ముగిసింది. అయితే వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు గురువారంతో ముగియనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలనకు 15,388 మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు. ఇప్పటి వరకు 3,442 మంది అభ్యర్థులు 90,251 వెబ్‌ఆప్షన్ల నమోదు చేశారని తెలిపారు. ఒక అభ్యర్థి అత్యధికంగా 188 ఆప్షన్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఈనెల 11 నాటికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tseamcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

తొలగించే హక్కు లేదని, మరోమారు తొలగించే ప్రయత్నం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య హెచ్చరించారు. వరంగల్ నగరంలోని ఎంహెచ్‌నగర్ 2లో పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు దౌర్జన్యంగా నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఆ గుడిసెలను మంగళవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీశ్‌తో కలిసి వీరయ్య పరిశీలించారు. గుడిసెవాసులతో మాట్లాడి వారిలో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే నిలువ నీడ లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వమే ఇంటి స్థలాలు, ఇండ్లను నిర్మించి పేదలకు ఇస్తే గుడిసెలు వేసుకునే అవసరమెందుకు వస్తుందని ప్రశ్నించారు. హైకోర్టు జీవించే హక్కు ఇచ్చిందని, ఈ తీర్పు ఇచ్చి రెండు, మూడు నెలలు కాకముందే పోలీసులు, రెవెన్యూ అధికారులు గుడిసెలు వేసుకున్న నిరుపేదలపై దాడులు చేస్తూ ఈ తీర్పును నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వరంగల్ జిల్లాలోని జక్కలొద్దిలో ప్రారంభమైన ఈ పోరాటం జిల్లాలో 7 ప్రాంతాల్లో విస్తరించి, రాష్ట్రంలో 65 భూ పోరాట కేంద్రాలు ఏర్పడ్డాయని, సుమారు లక్ష మంది పేదలు గుడిసెలు వేసుకొని ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సర్వేలో 30 లక్షల మందికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేవని, దీన్ని ఆధారం చేసుకునే రాష్ట్ర ప్రభుత్వం 5.60 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించిందన్నారు. కానీ ఎనిమిదేండ్లయినా నేటికీ పావువంతు మందికి కూడా ఇండ్లు రాలేదని ఆరోపించారు. 158, 159 జీవోలిచ్చి.. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మరిచిపోవాలని చెబుతున్నారన్నారు. గృహలక్ష్మి పథకంలో మహిళ పేరిట సొంత భూమి రిజిస్ట్రేషన్ ఉంటేనే రూ.3 లక్షలు ఇస్తామంటున్నారని, ఎక్కడైనా మహిళల పేరిట భూములు రిజిస్ట్రేషన్ ఉన్నాయా అని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికే రూ.7 లక్షలు అవసరమవుతుందని ప్రభుత్వమే చెబుతుందని, గృహలక్ష్మి పథకం కింద ఇచ్చే రూ.3 లక్షలతో ఇల్లు నిర్మించడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. నిరుపేదలు ఇండ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంద ఎకరాలున్న చిన్నవడ్డేపల్లి చెరువు కింద.. 40 ఎకరాలకుపైగా పెద్దపెద్దోళ్లు ఆక్రమించుకొని బిల్డింగులు కట్టుకుంటే కండ్లు మూసుకున్న అధికారులు, ఇప్పుడు ఈ ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలపై అధికారులు దాడి చేయడం సమంజసం కాదన్నారు. మీ పోరాటానికి సీపీఐ(ఎం) అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అనంతరం సాగర్ మాట్లాడుతూ.. నిరుపేదలకు జాగలు, ఇండ్లు ఇచ్చేంత వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న సంపన్నులను వదిలేస్తున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు.. 60 గజాల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై దౌర్జన్యం చేయడం సమంజసం కాదన్నారు. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని నిరుపేదల గుడిసెలు తొలగించకుండా చూడాలని కోరారు. జగదీశ్ మాట్లాడుతూ.. గుడిసెలు వేసుకున్న పేదలపై బుల్డోజర్లు ఎక్కిస్తున్న వారికి ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు బాబు, మాలోత్ సాగర్, ముక్కెర రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. యాదగిరి, అరూరి కుమార్, నాయకులు ఎండీ బషీర్ అహ్మద్, జన్ను సురేష్, వై. రమేష్, సుమన్, కల్పన, రజిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

(మొదటిపేజీ తరువాయి)

పోటీపడేలా తీర్చిదిద్దాలని కోరారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ ఏడాదీ సీఎం కేసీఆర్ గైర్హాజరయ్యారు. 142 మంది ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు ట్యాంక్‌బండ్‌పై ఉన్న మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలవేసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యారంగ కుటుంబం చాలా పెద్దదనీ, కేజీ టూ పీజీ వరకు 30 లక్షల మంది విద్యార్థులతోపాటు 1.50 లక్షల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది పనిచేస్తున్నారని వివరించారు. భగవంతుడు లేడనే నాస్తికులుంటారు కానీ గురువుల్లేరనే వారు ఉండబోరని చెప్పారు. నాస్తికులకూ గురువులుంటారని అన్నారు. అత్యంత గౌరవప్రదమైనది ఉపాధ్యాయ వృత్తి అని వివరించారు. ఉపాధ్యాయులు కారణజన్ములనీ, సమాజ నిర్మాతలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను తక్కువ చేసి మాట్లాడొద్దనీ, వారిని సానపడితే జాతిరత్నాలుగా తయారు చేయొచ్చని సూచించారు. సర్కారు బడుల బాగుకోసం సీఎస్ఆర్ నిధులను అడిగే పరిస్థితి ఉండేదన్నారు. కానీ సీఎం కేసీఆర్ మన



ఊరు-మనబడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి మౌలిక వసతుల కల్పనకు రూ.7,289 కోట్లు ఖర్చు చేస్తున్నారని వివరించారు. ప్రాచీన కాలంలో గురుకులాలకు ఎంత ప్రాధాన్యత ఉందో, రాష్ట్రంలో వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేసి కేజీ టూ పీజీ విద్య అందిస్తున్నామని చెప్పారు. అదే తరహాలో వసతుల కల్పనకు ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు కూడా పోటీపడుతున్నాయని అన్నారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నామనడం సరైంది కాదన్నారు. 2017లో 8,792 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా 5,089 పోస్టులను భర్తీచేస్తామని చెప్పారు. గురుకులాల్లో గతంలో 11 వేల పోస్టులను భర్తీ చేశామని వివరించారు. ప్రస్తుతం 12 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని అన్నారు. ఇక టీఎస్‌పీఎస్సీ ద్వారా మూడు వేల అధ్యాపక పోస్టుల భర్తీ చేస్తున్నామని చెప్పారు. మరో 3,896 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించామని గుర్తు చేశారు.

ఉత్తమ పౌరులుగా తయారు చేసేది ఉపాధ్యాయులే : మహమూద్ అలీ

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేసేది ఉపాధ్యాయులేనని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. రాయిని శిల్పి శిల్పంగా ఎలా తయారు చేస్తారో సామాన్యమైన విద్యార్థులను ఉపాధ్యాయులూ అదే తరహాలో తీర్చిదిద్దుతారని చెప్పారు. విద్యారంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. తెలంగాణ వచ్చాక విద్యాభివృద్ధి కొనసాగుతున్నదని వివరించారు. బడుల్లో సౌకర్యాల మెరుగు కోసం మన ఊరు- మనబడి కార్యక్రమమే అందుకు నిదర్శనమని చెప్పారు. అయితే రంజాన్, క్రిస్మస్, దీపావళి పండుగలను కొంత మందే జరుపుకుంటారనీ, అన్ని మతాలు, వర్గాల వారు జరుపుకునే పండుగ గురుపూజోత్సవమని అన్నారు. సమాజంలో పోలీసులు, డాక్టర్లు, ఇంజినీర్లు ఎవరు తయారు కావాలన్నా ఉపాధ్యాయులతోనే సాధ్యమని చెప్పారు. ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉంటే సమాజం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు సురభి వాణీదేవి, కూర రఘోత్తం రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మెన్ రావుల శ్రీధర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, వివిధ వర్సిటీల వీసీలు డి రవీందర్, టి రమేష్, సిహెచ్ గోపాల్‌రెడ్డి, లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీలోకి తెచ్చేందుకు చేరికల కమిటీ చైర్మెన్ హోదాలో ఈటల రాజేందర్ పూర్తిస్థాయి కసరత్తు చేశారు. ఆయన పార్టీలో చేరడం దాదాపు ఖరారైంది. కృష్ణయాదవ్ కూడా తాను ఆగస్టు 30న బీజేపీలో చేరుతున్నానని ప్రకటించారు. దానిలో భాగంగా హైదరాబాద్ సిటీలో తనతో పాటు ఈటల రాజేందర్, మోడీ, అమిత్‌షా, నడ్డాల ఫోటోలతో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆగస్టు 30వ తేదీ నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్‌హాల్‌లో తన మద్దతుదారులు, కార్యకర్తలు, సన్నిహితులతో బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీర్యాలీకి ఏర్పాట్లు చేశారు. పార్టీలో చేరేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాక, అనూహ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి అడ్డుపడినట్టు సమాచారం. తన నియోజకవర్గంలో తనకు సమాచారం లేకుండా కృష్ణయాదవ్‌ను పార్టీలోకి ఎలా తీసుకుంటారని ఆయన ఈటలతో వాగ్వివాదానికి దిగినట్టు తెలిసింది. దీనితో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి, పార్టీలో చేరేందుకు రెడ్‌రోజ్ ఫంక్షన్ హాల్ దగ్గర ఎదురు చూస్తున్న కృష్ణయాదవ్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఈటల వెళ్లిపోయినట్టు తెలిసింది. అయితే అదే రోజు ఉదయం మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగరరావు కుమారుడిని కాషాయకండువా కప్పి కిషన్‌రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకు ముందే విద్యాసాగరరావు ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతో భేటీ అయ్యి, వేములవాడ టిక్కెట్‌ను తన కొడుక్కి కన్ఫామ్ చేయించుకొచ్చారనే ప్రచారం జరిగింది. ఈ విషయం తెలిసిన ఈటల రాజేందర్ ఈ చేరికకు దూరంగా ఉన్నారు. దీనికి ప్రతిగా కృష్ణయాదవ్‌ను పార్టీలోకి తీసుకొనేందుకు కిషన్‌రెడ్డి అభ్యంతరం చెప్పారనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతుంది. అయితే మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమకు వేములవాడ టిక్కెట్ ఇప్పిస్తాననే హామీతో ఈటల రాజేందర్ తనతోపాటు బీజేపీలోకి తెచ్చారనీ, ఇప్పుడు విద్యాసాగరరావు కుమారుడు అక్కడి నుంచి పోటీలో ఉంటారనే విషయాన్ని ఈటల జీర్ణించుకోలేకపోతున్నారనే ప్రచారం జరుగుతుంది. మరోవైపు తాను గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తే, తన భార్య జమునను హుజూరాబాద్ నుంచి బరిలో దింపాలని ఈటల రాజకీయ వ్యూహం ఖరారు చేసుకున్నారు. కానీ కుటుంబపాలన అంటూ బీఆర్ఎస్‌పై దాడి చేస్తున్న బీజేపీ అధిష్టానం ఒకే కుటుంబంలో భార్యాభర్తలకు టిక్కెట్లు ఇచ్చే పరిస్థితులు లేవనీ చెప్తున్నారు. మొత్తానికి బీజేపీలో ఉన్న బీఆర్ఎస్ వ్యతిరేకులంతా గ్రూపు కట్టి, కాంగ్రెస్‌వైపు చూస్తున్నారని తెలుస్తుంది. సీఎం కేసీఆర్‌ను తీవ్రంగా వ్యతిరేకించే దుబ్బాక ఎమ్మెల్యే రఘునందనరావు కూడా బీజేపీ రాజకీయ నిర్ణయాలు, కిషన్‌రెడ్డి నాయకత్వంపై ఒకింత అసహనంతో ఉన్నట్టు సమాచారం. తాను బీజేపీలోనే ఉంటాననీ, వచ్చే ఎన్నికల్లో దుబ్బాక నుంచే పోటీచేస్తానని ఆయన పలుమార్లు చెప్పినా, ఆయన అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని బీజేపీ కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. మరో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్టు సమాచారం. బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన సిట్టింగ్ ఎమ్మెల్యే రాజాసింగ్ తన రాజకీయ భవిష్యత్ ఏంటనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. కొత్త నేతలు వచ్చి, పాత నేతలను డామినేట్ చేస్తున్నారని ఆయన మొదటి నుంచీ మొత్తుకుంటున్న విషయం తెలిసిందే. బీజేపీ కాదంటే...బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలని రాజాసింగ్ భావిస్తున్నారు. సీఎం కేసీఆర్ కూడా దీనికి సానుకూలంగా రాజాసింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గోషామహల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని ప్రకటించని విషయం తెలిసిందే. ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు బీజేపీ తరఫున పోటీచేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. మరి బీజేపీ అభ్యర్థులుగా గోషామహల్ నుంచి రాజాసింగ్‌కు, అంబర్‌పేట నియోజకవర్గం నుంచి సీ కృష్ణయాదవ్‌కు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఇస్తారా లేదా అనే దానిపై చర్చ జరుగుతుంది. మొత్తానికి ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ బీజేపీలో అలజడి తీవ్రరూపం దాలుస్తున్నది.

'మహిళా రిజర్వేషన్లు చారిత్రక అవసరం'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు చారిత్రక అవసరమని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం దేశంలోని ప్రతి రాజకీయపార్టీ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే ఎంతో మంది మహిళలు ప్రజాప్రతినిధులుగా ప్రజా సేవలో ఉన్నారనీ, వారి సంఖ్య మరింత పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మన రేసు గుర్రాలు!

స్వదేశంలో మరో ప్రపంచకప్ వేటకు రేసు గుర్రాలు సిద్ధం. ఆసియా కప్‌కు ప్రకటించిన 17 మంది సభ్యుల జట్టు నుంచే ప్రపంచకప్ జట్టును ఎంచుకున్న సీనియర్ సెలక్షన్ కమిటీ.. తెలుగు తేజం తిలక్ వర్మ, పేసర్ ప్రసిద్ కృష్ణలను పక్కనపెట్టింది. మిగతా 15 మందితో కూడిన జట్టును యథాతథంగా వన్డే వరల్డ్‌కప్‌కు ఎంపిక చేసింది. ఈ మేరకు చీఫ్ సెలక్టర్ అజిత్ అగర్కార్ మంగళవారం ప్రకటించారు. భారత్ వేదికగా అక్టోబర్ 5 నుంచి ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ జరుగనుంది.

- ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన
- సూర్యకుమార్, రాహుల్‌కు చోటు

తెలుగు తేజం తిలక్ వర్మకు నిరాశ

నవతెలంగాణ-ముంబయి

ఐసీసీ 2023 వన్డే వరల్డ్‌కప్‌కు బీసీసీఐ గెలుపు గుర్రాలను ప్రకటించింది. స్వదేశంలో జరుగుతున్న మెగా ఈవెంట్‌లో విజయమే లక్ష్యంగా జట్టు కూర్పు చేసిన సెలక్షన్ కమిటీ.. టీమ్ ఇండియాకు సమతూకం తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. బ్యాటింగ్, బౌలింగ్, వికెట్ కీపింగ్ విభాగాల్లో అందుబాటులో ఉన్న అత్యుత్తమ ఆటగాళ్లనే ఎంచుకున్న సెలక్టర్లు.. మరోసారి మిడిల్ ఆర్డర్ డైలామాను కొనసాగించారు!. 15 మందితో కూడిన భారత జట్టును మంగళవారం సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. అక్టోబర్ 5 నుంచి ఆరంభం కానున్న వరల్డ్‌కప్‌లో ఆతిథ్య భారత జట్టు గ్రూప్ దశలో తొమ్మిది మ్యాచులు ఆడనుంది. అక్టోబర్ 8న చెన్నై వేదికగా ఆస్ట్రేలియాతో పోరుతో వరల్డ్‌కప్ టైటిల్ వేట షురూ చేయనున్న టీమ్ ఇండియా.. గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌ను నవంబర్ 12న చిన్నస్వామిలో నెదర్లాండ్స్‌తో తలపడనుంది. దాయాదులు భారత్, పాకిస్థాన్ అక్టోబర్ 14న అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియంలో ఢీకొట్టనున్నాయి.

సూర్యకు అవకాశం

భారత జట్టులో ప్రధానంగా ఆసక్తి రేపిన ఎంపిక మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ లైనప్. యువరాజ్ సింగ్, సురేశ్ రైనాల అనంతరం భారత్‌కు ఈ స్థానాల్లో సరైన ఆటగాళ్లు లభించలేదు. టీ20 సూపర్‌స్టార్ సూర్యకుమార్ యాదవ్.. వన్డేల్లో విలువైన అవకాశాలు లభించినా నిరూపించుకోలేదు. 50 ఓవర్ల ఆటలో సూర్య కుమార్ సగటు 25 కంటే తక్కువే. ఇదే సమయంలో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఆకర్షణీయ గణాంకాలు నమోదు చేసి, టీ20 ఫార్మాట్‌లో నిలకడగా రాణించిన యువ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ తిలక్ వర్మకు మొండి చేయి చూపించారు. ఛేదనలో లోయర్ ఆర్డర్‌లో సూర్య కుమార్ ఉపయుక్తంగా ఉంటాడని జట్టు మేనేజ్‌మెంట్ భావించినా.. ఆరంభంలో వికెట్లు కూలిన క్లిష్ట పరిస్థితుల్లో ముందే క్రీజులోకి వచ్చే సందర్భాల్లో సూర్య కుమార్ యాదవ్‌పై ఏమాత్రం ఆధారపడ లేని పరిస్థితి. 50 ఓవర్ల ఆటలో రాణించగల సత్తా తిలక్ వర్మకు ఉందని తెలిసినా.. సెలక్షన్ కమిటీ అనుభవానికే ఓటేసింది. 2019 వరల్డ్‌కప్‌లో తెలుగు తేజం అంబటి రాయుడిని విచిత్ర సమీకరణాలతో ఎంపిక చేయని సెలక్షన్ కమిటీ అందుకు భారీ మూల్యం చెల్లించింది. ఇప్పుడు సెలక్షన్ కమిటీ మరో తెలుగు తేజం తిలక్ వర్మను ఎంపిక చేయకపోయినా.. 2019 ఫలితం పునరావృతం కాకూడదనే ఆశిద్దాం.



అశ్విన్, చాహల్‌కు నో

భారత్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌లో స్పిన్ అత్యంత ప్రధాన భూమిక పోషించనుంది. మిడిల్ ఓవర్లలో స్పిన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే జట్టు, స్పిన్‌తో ప్రత్యర్థులను వణికించే జట్టు అంతిమంగా పైచేయి సాధించనుంది. ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ జట్టులో స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా నిలిచాడు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ చోటు దక్కించుకున్నారు. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, మణికట్టు మాయగాడు యుజ్వేంద్ర చాహల్‌లు ప్రపంచకప్ జట్టులో చోటు ఆశించారు. ఆసియా కప్ జట్టులో చోటు దక్కని ఈ ఇద్దరికి.. తాజాగా ఇప్పుడు వరల్డ్‌కప్ జట్టులోనూ మొండిచేయి తప్పలేదు.

ప్రసిద్ కృష్ణ అవుట్

పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రాతో పాటు ఇటీవల ఫిట్‌నెస్ సాధించి.. జట్టులోకి వచ్చిన పేసర్ ప్రసిద్ కృష్ణ. ఐర్లాండ్ పర్యటనలో రాణించిన ప్రసిద్ కృష్ణకు ఆసియా కప్ జట్టులో చోటు దక్కింది. కానీ, 15 మందితో కూడిన ప్రపంచకప్ జట్టు ఎంపిక విషయంలో.. తిలక్ వర్మతో పాటు ప్రసిద్ కృష్ణను సైతం పక్కనపెట్టారు. పేస్ విభాగంలో జశ్‌ప్రీత్ బుమ్రాకు తోడుగా మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమిలు ఎంపికయ్యారు. పేస్ ఆల్‌రౌండర్లు శార్దుల్ ఠాకూర్, హార్దిక్ పాండ్య జట్టులో నిలిచారు. హార్దిక్ పాండ్య వైస్ కెప్టెన్సీ బాధ్యతలు సైతం చూసుకోనున్నాడు.

ఇషాన్ ఇన్

బ్యాటింగ్ లైనప్‌లో టాప్ ఆర్డర్‌లో ఎటువంటి మార్పులు లేవు. కెప్టెన్ రోహిత్ శర్మ శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్‌లు టాప్-4 స్థానాలు కైవసం చేసుకున్నారు. వికెట్ కీపర్, బ్యాటర్‌గా సంజు శాంసన్‌తో పోటీపడిన ఇషాన్ కిషన్ ఆసియా కప్‌లో పాకిస్థాన్‌పై బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ప్రపంచకప్ జట్టులోకి ప్రవేశించాడు. పూర్తి ఫామ్ సాధించని కెఎల్ రాహుల్ సైతం జట్టులో చోటు సాధించాడు. సంజు శాంసన్‌కు సెలక్షన్ కమిటీ అవకాశం ఇవ్వలేదు. ఇటీవల భారత జట్టు టాప్ ఆర్డర్ అనూహ్యంగా పతనం అవుతున్న పరిస్థితులు చూస్తున్నాం. కీలక బ్యాటర్లు పెవిలియన్‌కు చేరితే స్కోరు బోర్డు ముందుకు కదలని దుస్థితి. దీంతో జట్టుకు సమతూకం తీసుకొచ్చేందుకు సెలక్షన్ కమిటీ ప్రయత్నించింది. లోయర్ ఆర్డర్‌లో నాణ్యమైన ఆల్‌రౌండర్లకు అవకాశం కల్పించింది. హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, శార్దుల్ ఠాకూర్‌లు జట్టులోని ఆల్ రౌండర్లు. ఈ నలుగురు స్పెషలిస్ట్ బ్యాటర్ల పాత్ర పోషించగలరు. టెయిలెండర్లలో మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి, బుమ్రాలు సైతం బ్యాట్‌తో మెరవగల సమర్థులు. దీంతో మూడు విభాగాల్లోనూ సమతూకం పాటించి ప్రపంచకప్ జట్టును ఎంపిక చేసినట్టు కనిపిస్తుంది.





2023 వన్డే వరల్డ్‌కప్‌కు భారత జట్టు

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య (వైస్ కెప్టెన్), రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, శార్దుల్ ఠాకూర్, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి.

భారత షట్లర్లకు నిరాశ

- ప్రణయ్, లక్ష్య పరాజయం
- చైనా ఓపెన్ సూపర్ సిరీస్



చాంగ్జౌ (చైనా) : ఆసియా క్రీడల ముంగిట భారత స్టార్ షట్లర్లు నిరాశపరిచారు. చైనా ఓపెన్ సూపర్ సిరీస్ 100 టోర్నీలో మన రాకెట్లకు చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్‌లో వరల్డ్ నం.6 హెచ్.ఎస్ ప్రణయ్, యువ ఆటగాడు లక్ష్యసేన్ తొలి రౌండ్లోనే ఓటమి చెందారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్స్ మెడలిస్ట్ ప్రణయ్ 12-21, 21-13, 18-21తో మూడు గేముల పోరులో మలేషియా షట్లర్ జె యాంగ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. 66 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్ ఓడిన ప్రణయ్.. రెండో గేమ్‌లో గెలుపొంది లెక్క సమం చేశాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రణయ్ చివరి వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. వరల్డ్ నం.22 జె యాంగ్ అనూహ్యంగా ప్రణయ్‌పై గెలుపొందాడు. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో వరల్డ్ నం.1 విక్టర్ అక్సెల్సన్‌కు షాక్ ఇచ్చి పతకం సాధించిన ప్రణయ్.. చైనా ఓపెన్‌లో అంచనాలను అందుకోలేదు. యువ ఆటగాడు లక్ష్యసేన్ 21-13, 21-16, 9-21తో ఆంటోన్సెన్ (డెన్మార్క్)కు తలొగ్గాడు. 78 నిమిషాల మారథాన్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ పోరాడినా ఫలితం లేకపోయింది. మెన్స్ సింగిల్స్‌లో మరో మ్యాచ్ ప్రియాన్షు రజావత్ 13-21తో 24-26తో ఇండోనేషియా షట్లర్ హిరెన్‌తో పోరాడి ఓడారు. మహిళల డబుల్స్‌లో ట్రిసా జాలీ, పుల్లెల గాయత్రి జంట 18-21, 11-21తో వరుస గేముల్లో టాప్ సీడ్ చైనా జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్‌లో ఎం.ఆర్ అర్జున్, ధ్రువ్ కపిల జోడీ 21-23, 19-21తో జపాన్ షట్లర్లతో పోరాడి ఓడారు.

స్కూల్ ప్రీమియర్ లీగ్ ట్రోఫీ ఆవిష్కరణ



హైదరాబాద్: ఎం.ఎస్ ధోని క్రికెట్ అకాడమి (ఎంస్‌డీసీఏ) స్కూల్ ప్రీమియర్ లీగ్ సీజన్-1 ట్రోఫీ మంగళవారం ఆవిష్కరించారు. ఎనిమిది జట్లు పోటీపడుతున్న స్కూల్ ప్రీమియర్ లీగ్ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమానికి ధోని తొలి కోచ్ కేశవ్ బెనర్జీ, హెచ్‌సీఏ స్కోరర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతిభావంతులైన వర్ధమాన క్రికెటర్లను గుర్తించేందుకు స్కూల్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నట్టు ఎంఎస్‌డీసీఏ మార్కెటింగ్ డైరెక్టర్ రషీద్ బాషా తెలిపారు. లీగ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పది మంది క్రికెటర్లకు పల్లవి ఫౌండేషన్ తరఫున రూ. 5 లక్షల ఉపకారవేతనం అందజేస్తామని, ధోని అకాడమిలో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ అందజేస్తామని పల్లవి విద్యాసంస్థల సీఓఓ యశస్వి పేర్కొన్నారు. పల్లవి రాయల్స్, డీపీఎస్ వారియర్స్, ఎంఎస్‌డీసీఏ డామినేటర్స్, ఎంఎస్‌డీసీఏ స్ట్రయికర్స్, ఎంఎస్‌డీసీఏ ఫొనిక్స్, ఎంఎస్‌డీసీఏ స్కార్పియన్స్, ఎంస్‌డీసీఏ నైట్స్, ఎంఎస్‌డీసీఏ హరికేన్స్‌లు తొలి సీజన్‌లో పోటీపడుతున్నాయని 7హెచ్ స్పోర్ట్స్ డైరెక్టర్ బి.వెంకటేష్ తెలిపారు.



నూపుర్ సనన్, రవితేజ

5 భాషల్లో ఏక్ దమ్..

రవితేజ టైటిల్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రం నుంచి మంగళవారం మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'ఏక్ దమ్ ఏక్‌దమ్'ను హిందీతో కలిసి నాలుగు దక్షిణాది భాషల్లో విడుదల చేయడం ద్వారా మ్యూజికల్ ప్రమోషన్‌లను గ్రాండ్‌గా ప్రారంభించారు. 'సంగీత దర్శకుడు జి.వి.ప్రకాష్ తన ఇన్‌స్ట్రుమెంటేషన్, కంపోజిషన్‌తో పాటకు రెట్రో అనుభూతిని తెచ్చారు. భాస్కరభట్ల సాహిత్యం నేటివిటీని జోడించగా, అనురాగ్ కులకర్ణి అద్భుతంగా ఆలపించారు. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ పాటలో తన ప్రేయసి నూపుర్ సనన్‌ని ఆట పట్టిస్తూ రవితేజ కనిపించారు. ట్రాక్‌లోని ఎనర్జిటిక్ బీట్‌లకు సరిగ్గా సరిపోయే ఎలక్ట్రిఫైయింగ్, ట్రెండీ హుక్ స్టెప్‌ను శేఖర్ మాస్టర్ క్రియేట్ చేశారు' అని చిత్ర బృందం తెలిపింది. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్ మరో కథానాయిక. దసరా కానుకగా ఈ చిత్రాన్ని అక్టోబర్ 20న విడుదల చేస్తున్నారు.

ఉపేంద్ర గాడి అడ్డా.. పక్కా మాస్ సినిమా



కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో ఎస్. ఎస్.ఎల్. ఎస్. క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్ర గాడి అడ్డా'. ఈ చిత్ర ప్రారంభోత్సవం ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. హైదరాబాద్‌లోని వివిధ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతున్నారు.

ఈ సందర్భంగా నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, 'ప్రస్తుతం హీరో, హీరోయిన్‌ల మీద సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. షూటింగ్ మొత్తం పూర్తయ్యేవరకు సింగిల్ షెడ్యూల్ జరుపుతున్నాం. ఇందులో నాలుగు పాటలు ఉన్నాయి. వాటి రికార్డింగ్ జరుగుతోంది' అని అన్నారు.

'చక్కటి కమర్షియల్ అంశాలతో ఉండే మాస్ సినిమా ఇది. ఇప్పుడున్న ట్రెండ్‌కు తగ్గట్టు యూత్ ఫుల్ మెసేజ్ ఓరియెంటెడ్ సినిమా. హీరో పాత్ర పక్కా మాస్ అయితే, హీరోయిన్ పాత్ర బాగా డబ్బున్న అమ్మాయిగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. చెప్పారు.

హీరో, హీరోయిన్లు మాట్లాడుతూ, 'నటించడానికి ఎంతో అవకాశం ఉన్న పాత్రలను పోషిస్తున్నాం. కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుంది' అని తెలిపారు.

డీజే పిల్లా.. సందడి



రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్

రక్షిత్ అట్లూరి, కోమలి ప్రసాద్ హీరో, హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'శశివదనే'. గౌరి నాయుడు సమర్పణలో ఎ.జి.ఫిల్మ్ కంపెనీ, ఎస్.వి.ఎస్ స్టూడియోస్ బ్యానర్స్ పై అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహిస్తున్నారు. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో అందమైన ప్రేమకథగా రూపొందుతున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ 'డీజే పిల్లా..' పాటను విడుదల చేశారు. "నా దిల్లే నీ వల్లే టూరింగు టాకీసులా మారెనే, నా కల్లో నీ బొమ్మనే..' అంటూ సాగే ఈ పాటకు కిట్టు విస్సా ప్రగడ సాహిత్యాన్ని అందించగా, వైషాగ్ పాటను పాడారు. శరవణ వాసుదేవన్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, "మా 'శశివదనే' సినిమా విడుదలకు సన్నద్ధమవుతోంది. హార్ట్ టచింగ్ లవ్ కాన్సెప్ట్‌తో సినిమా తెరకెక్కింది. మంచి లవ్ మూవీ చూడాలనుకునే వారి కోరిక ఈ సినిమాతో తీరుతుందని అనుకుంటున్నాం. మా హీరో రక్షిత్, హీరోయిన్ కోమలి ప్రసాద్ తమ పాత్రల్లో అలా ఒదిగి పోయారంతే' అని అన్నారు.

నవచిత్రం

100% నవ్విస్తుంది : చిరు



చిరంజీవి, నవీన్ పోలిశెట్టి

'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని చిరంజీవి కితాబిచ్చారు. నవీన్ పోలిశెట్టి, అనుష్క శెట్టి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమిది.

ఈ సినిమా చూసిన అనంతరం చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'ఈ సినిమా చూశాను.. మొదటి నుంచి చివరి దాకా ఎంతగానో ఆకట్టుకున్న హిలేరియస్ ఎంటర్‌టైనర్. నేటి యువత ఆలోచనా విధానాన్ని రిఫ్లెక్ట్ చేస్తూ తీసుకున్న సరికొత్త కథాంశం. 'జాతి రత్నాలు'కి రెట్టింపు ఎనర్జీని, వినోదాన్ని అందచేసిన నవీన్ పోలిశెట్టి, కొంచెం గ్యాప్ తర్వాత కనిపిస్తున్నా మరింత అందంగా, బ్యూటిఫుల్‌గా ఉన్న మనందరి 'దేవసేన', అనుష్క శెట్టిలు ఈ చిత్రానికి ప్రాణం పోశారు. ఫుల్ లెంగ్త్ ఎంటర్టైనర్ అవటంతో పాటు ఎమోషన్స్‌ని కూడా అద్భుతంగా మిక్స్ చేసి రక్తి కట్టించేలా రూపుదిద్దిన డైరెక్టర్ మహేశ్ బాబుని అభినందించాల్సిందే. ఈ చిత్రానికి తొలి ప్రేక్షకుడ్ని నేనే.. ఆ హిలేరియస్ మూమెంట్స్ ఎంత గానో ఎంజాయ్ చేశాను. మరోసారి థియేటర్‌లో ప్రేక్షకులందరితోనూ ఎంజాయ్ చేయాలన్న బలమైన కోరిక నాకు కలిగింది. మిస్ శెట్టి - మిస్టర్ పోలిశెట్టి వందశాతం ఆడియన్స్‌ని నవ్వుల బాట పట్టిస్తారనటంలో సందేహం లేదు' అని ట్వీట్‌లో చిరంజీవి పేర్కొన్నారు.

ఈ చిత్రం ఈ నెల 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వరల్డ్ వైడ్‌గా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

డిఫరెంట్ సినిమా

సత్యరాజ్, వసంత్ రవి ప్రధాన పాత్ర ధారులుగా నటిస్తోన్న సస్పెన్స్ థ్రిల్లర్ 'వెపన్'. మిలియన్ స్టూడియో బ్యానర్ పై గుహన్ సెన్నియప్పన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర గ్లింప్స్‌ను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ, 'ఇదొక డిఫరెంట్ కాన్సెప్ మూవీ. నిర్మాతలైతే మరో ఆలోచన లేకుండా ఖర్చు పెట్టి సినిమాను అద్భుతంగా రూపొందిస్తున్నారు. డైరెక్టర్ గుహన్ సరికొత్త విజన్‌తో సినిమాను ఆవిష్కరించారు' అని తెలిపారు. నిర్మాత మన్సూర్ మాట్లాడుతూ, 'మా బ్యానర్‌లో వస్తోన్న తొలి సినిమా. అవుట్ అద్భుతంగా వస్తోంది' అని అన్నారు.



శివ నిర్వాణ, విజయ్ దేవరకొండ, నవీన్ యెర్నేని

నా ఫ్యాన్స్ అంతా మా దేవర ఫ్యామిలీనే..

- విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మూడు రోజుల్లో 70.23 కోట్ల రూపాయలు కలెక్ట్ చేయడంతో 'ఖుషి' బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్ విశాఖలో ఘనంగా జరిగాయి.


ఈ సందర్భంగా నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ, 'మా సంస్థకు 'ఖుషి' లాంటి మెమొరబుల్ మూవీ ఇచ్చిన విజయ్, సమంత, శివకి థ్యాంక్స్. మణిరత్నం 'రోజా' లాంటి ఫీల్ ఇచ్చే సినిమా ఇది. ఇలాంటి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను నిర్మించినందుకు గర్వంగా ఉంది. విజయ్ కెరీర్‌లోనే హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచే సినిమా ఇది' అని అన్నారు.

'నా సినిమాల్లో 'ఖుషి' ఎందుకు స్పెషల్ అంటే.. 'అర్జున్ రెడ్డి' సినిమా చూశాక ఆ హ్యాంగోవర్ నుంచి బయటకు రాలేకపోయాను. రెండు, మూడేళ్లలో విజయ్‌తో సినిమా డైరెక్ట్ చేయాలని గట్టిగా అనుకున్నాను. ఇవాళ 'ఖుషి' లాంటి మంచి సినిమాను రూపొందించ గలిగాను' అని డైరెక్టర్ శివ నిర్వాణ చెప్పారు.

హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ,'ఈ సినిమా మీద మీరు చూపిస్తున్న ప్రేమ నాకు తెలుస్తోంది. మీ ప్రేమకు కృతజ్ఞతగా చాలా చాలా చేయాలని అనిపిస్తోంది. ఈ వేదిక మీద నుంచి చెబుతున్నా. నా సంపాదన నుంచి, 'ఖుషి' సంపాదన నుంచి కోటి రూపాయలు నా ఫ్యామిలీ అయిన మీకు ఇస్తున్నా. మరో పది రోజుల్లో వంద ఫ్యామిలీస్‌ను సెలెక్ట్ చేసి ప్రతి ఫ్యామిలీకి లక్ష రూపాయల చెక్ అందిస్తా. నా హ్యాపీనెస్‌లాగే నా సంపాదన కూడా మీతో షేర్ చేసుకుంటా. మీరంతా దేవర ఫ్యామిలీ' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

జమిలి ఎన్నికలకు జూన్‌లోనే మొదలైన కసరత్తు



ముంబయి : జూన్ 2...కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం జరిగిన నాలుగు రోజులకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నివాసానికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. వారిలో ఒకరు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కాగా మరొకరు ప్రధాని నరేంద్ర మోడీ ప్రిన్సిపల్ కార్యదర్శి డా॥పి.కె.మిశ్రా.

ప్రస్తుతం బాగా చర్చ జరుగుతున్న అంశమైన 'ఒక దేశం, ఒక ఎన్నిక' పథకానికి కోవింద్ ఆధ్వర్యంలో కసరత్తు ప్రారంభించేందుకు ఈ సమావేశం ఉద్దేశించబడిందని ఈ పరిణామం గురించి తెలిసిన వర్గాలు పేర్కొన్నాయి. కర్నాటక ఎన్నికల్లో బిజెపి పరాజయం పాలైన వెంటనే ఈ కసరత్తు ప్రారంభమైంది. నిజానికి కర్నాటక ఎన్నికల ఫలితాలు పార్టీని బాగా దెబ్బతీశాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వచ్చే సీట్ల గురించి ఆందోళన పెరిగేలా చేశాయి. దాంతో ఒకేసారి ఎన్నికల నిర్వహణ అనే అంశం తెరపైకి వచ్చింది.

అయితే కోవింద్‌ను ఎందుకు ఎంచుకున్నారు?

మాజీ రాష్ట్రపతి అయిన రామ్‌నాథ్ కోవింద్ పెద్దగా ప్రజా సంబంధాలు కలిగిన వ్యక్తి కాదు, కానీ జఠిలమైన చట్టసంబంధమైన అంశాలను నిర్వహించ గలిగే సామర్థ్యం వుంది. మోడీకి ఆయన అంటే గురి, విశ్వాసం వుంది. "2024 ఎన్నికలకు ముందుగా ప్రతిపక్షాలు సంఘటితం కావడాన్ని దెబ్బ తీయడానికి గానూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు భూమికను సిద్ధం చేయాల్సిందిగా మోడీ విశ్వసనీయులైన తన పార్టీ కార్యకర్తలను కోరారు." అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

"ఒక దేశం, ఒక ఎన్నిక" కమిటీకి అధినేతగా కోవింద్ పేరును శుక్రవారం లాంఛనంగా ప్రకటించారు. ఆ మరుసటి రోజు కమిటీలోని సభ్యులు పేర్లను ప్రకటించారు. ప్యానెల్ సన్నాహక కార్యకలాపాల కోసం ఆదివారం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ అధికారులు కోవింద్‌ను కలిశారు. అయితే, మాజీ రాష్ట్రపతి కోవింద్ ఈ సన్నాహక కార్యకలాపాలను జూన్ 2 నుండే ప్రారంభించినట్లు కనిపిస్తోంది.

సోషల్ మీడియాలో ఆయన టైమ్‌లైన్‌ను ఒక్కసారి చూసినట్లైతే ఇందుకోసం ఆయన అవసరమైన సన్నాహాలను ఎలా చేశారనేది తెలుస్తుంది. గత మూడు మాసాల్లో ఆయన 10మంది గవర్నర్లతో భేటీ అయ్యారు. రిటైరైన రాష్ట్రపతులకు బిజీగా వుండే షెడ్యూల్ వుండదు. సాధారణంగా వారు తమ చివరి కాలాన్ని ఆస్వాదిస్తూ గడుపుతారు. లేదా తమ జ్ఞాపకాల దొంతరలను పేరుస్తూ ఒకటి రెండు పుస్తకాలు రచిస్తారు. కానీ, దీనికి విరుద్ధంగా కోవింద్ రాజ్‌భవన్‌ల చుట్టూ ప్రయాణించడం ఆరంభించారు. గవర్నర్లను, పార్టీ నేతలను కలుసుకోవడం వారితో చర్చించడం మొదలుపెట్టారు.

జూన్ 9 నుండి ఆగస్టు 29 మధ్య కాలంలో, కోవింద్ కనీసం 10మంది గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్లతో సమావేశమయ్యారు. వారిలో కొంతమందితో ఒకటి కన్నా ఎక్కువసార్లే భేటీ అయ్యారు. దీనికి తోడు, సీనియర్ పార్టీ నేతలను, ఆర్‌ఎస్‌ఎస్ అధినేతను కూడా కలిసి చర్చలు జరిపారు. ప్యానెల్ నియామకాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఒకేసారి ఎన్నికల నిర్వహణకు తన ప్రతిపాదనలను పటిష్టం చేసే పనిని కమిటీ ఇప్పటికే ప్రారంభించింది. సెప్టెంబరు 18 నుండి 22 వరకు ఐదు రోజుల పాటు జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ కమిటీ నివేదికను ప్రవేశపెట్టనున్నారు.

2025 దరిదాపుల్లో పదవీ కాలాలు ముగుస్తున్న అసెంబ్లీల (మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటివి)ను రద్దు చేయాలన్నది ఈ ముసాయిదా వెనుక గల ఆలోచనగా వుంది. మరోపక్క ఇటీవలే ఎన్నికలు జరుపుకున్న కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం ఒక ఏడాది పొడిగించబడుతుంది. తద్వారా వచ్చే సైకిల్‌లో అంటే 2029లో అక్కడ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు.

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం వల్ల ప్రతిపక్షాల ఇండియా ఫోరమ్‌ను గందరగోళంలో నెట్టవచ్చని సీనియర్ బిజెపి నేత ఒకరు వ్యాఖ్యానించారు. "పశ్చిమ బెంగాల్‌లో, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కోసం పొత్తు పెట్టుకోవడానికి తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీకి, కాంగ్రెస్, వామపక్షాలకు కష్టసాధ్యమవుతుంది. ఎందుకంటే ప్రతి పార్టీ కూడా తమ స్థానిక ప్రయోజనాలను ముందుగా కాపాడుకోవాలని భావిస్తుంది. అలాగే ఢిల్లీ, పంజాబ్‌ల్లో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య ఇటువంటి సమస్యలే వస్తాయి. కాంగ్రెస్‌తో వున్న ప్రాంతీయ పార్టీలు పరస్పరం ఘర్షణ పడతాయని బిజెపి ఆశిస్తోంది. ఫలితంగా కాషాయ పార్టీకి మరింత వెసులుబాటు దక్కుతుంది." అని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏ పార్టీలో చేరేది త్వరలో స్పష్టతనిస్తా..

- కాంగ్రెస్‌తో చర్చలు జరుగుతున్నాయి..
- బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే...
- ఉద్యమకారులంతా ఏకం కావాలి : బీజేపీ బహిష్కృత నేత యెన్నెం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాను ఏ పార్టీలో చేరేది త్వరలోనే స్పష్టతనిస్తానని బీజేపీ బహిష్కృత నేత యెన్నెం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతో కాంగ్రెస్ పార్టీ చర్చలు జరుపుతున్నదని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటేననీ, బీజేపీ బీఆర్‌ఎస్‌ను ఓడించడం ఒక కల అని తెలిపారు. కేవలం కార్యకర్తలను మభ్యపెడుతూ బీజేపీ కాలం గడుపుతున్నదని విమర్శించారు. ఇప్పటికైనా బీజేపీ శ్రేణులు అబద్ధాల వెంట పరుగులు తీయడం మానుకోవాలని సూచించారు. మునుగోడులో గెలిచే అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేత రాజీనామా చేయించి మోసం చేశారని విమర్శించారు. ఐదు సార్లు గెలిచిన వ్యక్తిని కింద కూర్చొబెట్టి వార్డు మెంబర్ కాని వ్యక్తి ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలో బీజేపీలో పాఠాలు నేర్పుతారని ఎద్దేవా చేశారు. ఈటల రాజేందర్ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని సూచించారు. బీజేపీ ఏనాడైనా పేదల అంశంపై పోరాడిందా? అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్, వివేక్, రాజగోపాల్ రెడ్డి, రవీంద్రనాయక్ వంటి నేతలందరు బయటికి వస్తే ఒకే జెండా కింద పని చేద్దామని ఆయన ఆహ్వానించారు. తామంతా కాంగ్రెస్‌తో చర్చలు జరిపామని యెన్నెం తెలిపారు. కాంగ్రెస్‌కు మాటిచ్చి ఈటల, రాజగోపాల్ రెడ్డి, రవీంద్రనాయక్, వివేక్ మాట తప్పారని తెలిపారు.

జి-20 సదస్సు జయప్రదానికి కలిసి పనిచేస్తాం : చైనా వెల్లడి

బీజింగ్ : ఈ ఏడాది జి-20 సదస్సును నిర్వహించడంలో భారత్‌కు మద్దతిస్తున్నామని చైనా మంగళవారం పేర్కొంది. ఈ వారంలో న్యూఢిల్లీలో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సు జయప్రదం కావడానికి గానూ అన్ని పక్షాలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా వున్నామని తెలిపింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు బదులుగా ప్రధాని లీ కియాంగ్ జి-20 సదస్సుకు హాజరవుతారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. జి-20 గ్రూపు కార్యకలాపాలకు చైనా ఎల్లప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, చురుకుగా పాల్గొంటుందని విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. అంతర్జాతీయ ఆర్థిక సహకారానికి జి-20 ప్రధాన వేదిక అని ఆమె వ్యాఖ్యానించారు.

సరిహద్దు వివాదాన్ని ప్రస్తావించకుండా, ఇరు దేశాల మధ్య సంబంధాలు మొత్తమ్మీద సుస్థిరంగా వున్నాయని ఆమె పేర్కొన్నారు. వివిధ స్థాయిల్లో ఇరు పక్షాలు చర్చలు జరుపుతున్నాయన్నారు. చైనా-భారత్ మధ్య సంబంధాలు మెరుగవుతూ వుండడం ఇరు దేశాల ఉమ్మడి ప్రయోజనాలకు ఎంతో ముఖ్యమని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరిచి, ముందుకు తీసుకెళ్ళడానికి భారత్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు.

సెప్టెంబరు 5-8 తేదీల్లో జకార్తాలో జరుగుతున్న ఆసియాన్ సదస్సుకు హాజరైన చైనా ప్రధాని అక్కడ నుండి నేరుగా న్యూఢిల్లీకి వస్తారు.

'పాలేరు' నాదే..!

నియోజకవర్గంలో కీలక నేతలకు తుమ్మల ఫోన్లు..!

- నేడు కాంగ్రెస్‌లో చేరిక వాయిదా
- 16 లేదా 17న చేరవచ్చని సమాచారం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్‌ఎస్ నుంచి పాలేరు టిక్కెట్ విషయంలో భంగపడ్డ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఓడిన చోటే గెలవాలనే లక్ష్యంతో ఉన్న ఆయన పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని, నియోజకవర్గ కాంగ్రెస్ టిక్కెట్ తనదేనని ఆ పార్టీకి చెందిన కీలక నేతలకు ఫోన్లు చేసి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారని సమాచారం.



ఎప్పటి నుంచో గ్రౌండ్‌వర్క్..

పాలేరు బీఆర్‌ఎస్ టిక్కెట్ తనకు రానిపక్షంలో ఎలాంటి వ్యూహంతో వెళ్లాలి.. వస్తే అవతలిపార్టీ నేతలను తనవైపు ఎలా తిప్పుకోవాలి.. ఇలాంటి అంశాలపై ఆయన ఎప్పటినుంచో కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ టిక్కెట్ నిరాకరించడానికి ముందునుంచే తన అనుచరులు, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అనుచరులు పలువురితో నేలకొండపల్లి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ కీలక నేత ఇంట్లో తుమ్మల రహస్య సమావేశం ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఆ సమావేశానికి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కీలక నేతలు ఒకరిద్దరు కూడా హాజరయినట్టు తెలుస్తోంది. హాజరైన నేతలందరూ దాదాపు తుమ్మల సామాజిక తరగతికి చెందినవారే కావడం గమనార్హం. ఈ మీటింగ్‌కు వచ్చిన కాంగ్రెస్ నేతల్లో ఒక్కరు.. పాలేరు టిక్కెట్ ఆశావహుల్లో ఉన్నారు. కాంగ్రెస్ టిక్కెట్ తనకు కాకుండా వేరొకరికి వచ్చి.. బీఆర్‌ఎస్ టిక్కెట్ తుమ్మలకు వస్తే మాత్రం తాను అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారని సమాచారం. అలాగే కందాల గ్రూపునకు చెందిన నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, కూసుమంచి మండలాల తమ్మల సామాజిక తరగతి నేతలు కూడా ఆయన ఏ పార్టీ నుంచి పోటీ చేసినా తమ సహకారం ఉంటుందని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. వారందరికీ మళ్లీ ఫోన్లు చేసి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారని సమాచారం.

పది రోజుల తర్వాత చేరిక!

మరోవైపు ఈనెల 6వ తేదీన మాజీ మంత్రి తుమ్మల కాంగ్రెస్‌లో చేరతారని అందరూ భావించారు. 7వ తేదీ నుంచి రాహుల్‌గాంధీ యూరప్ పర్యటన ఉన్న నేపథ్యంలో తుమ్మల ఈలోపే జాయిన్ అవుతారని అనుకున్నారు. కానీ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలు ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే తదితర ఏఐసీసీ నేతలు అందరూ హాజరవుతున్న దృష్ట్యా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తుమ్మల చేయందుకుంటారని సమాచారం.

రష్యాలో పర్యటించనున్న ఉత్తర కొరియా నేత కిమ్

ప్యాంగాంగ్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ త్వరలో రష్యాలో పర్యటించే అవకాశం వుందని మీడియా వార్తలు తెలిపాయి. ఈ పర్యటనా సమయంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయి ఆయుధ ఒప్పందంపై చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. గుర్తు తెలియని అమెరికన్, సంకీర్ణ దేశాల అధికారులను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ ఈ మేరకు సోమవారం వార్తా కథనాన్ని ప్రచురించింది. కిమ్ వచ్చేవారం వ్లాదివొస్తాక్ వెళతారని పేర్కొంది. బహుశా సాయుధ రైల్లో ఆయన ప్రయాణించవచ్చని తెలిపింది.

వ్లాదివొస్తాక్‌లో సెప్టెంబరు 10-13 తేదీల్లో జరగనున్న ఈస్ట్రన్ ఎకనామిక్ ఫోరం సమావేశాలకు ఇరువురు నేతలు హాజరయ్యే అవకాశం వుంది. కాగా ఈ కథనాన్ని ధృవీకరించేందుకు వైట్‌హౌస్ జాతీయ భద్రతా మండలి నిరాకరించింది. అయితే కిమ్ రష్యాలో ఉన్నత స్థాయి చర్చలు జరిపే అవకాశం వుందని తెలిపింది. ముందుగా హెచ్చరించినట్లుగానే రష్యా, ఉత్తర కొరియా మధ్య ఆయుధ చర్చలు క్రియాశీలంగా ముందుకు సాగుతున్నాయని మండలి ప్రతినిధి వాట్సన్ తెలిపారు. ఈ జులైలో రష్యా రక్షణ మంత్రి ప్యాంగాంగ్‌లో పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు.

సెమీకండక్టర్ సాంకేతికతపై అమెరికా గుత్తాధిపత్యం అంతం

నెల్లూరు నరసింహారావు

సాంకేతికతపైన గుత్తాధిపత్యం ఎక్కువ కాలం నిలవదనటానికి చరిత్రలో చాలా ఉదాహరణలు ఉన్నాయి. అత్యాధునిక అమెరికా సెమీకండక్టర్లతో పోల్చదగిన చిప్స్‌ను చైనా తయారుచేస్తున్నది. తాజాగా గతవారాంతంలో హువెయి టెక్నాలజీ కంపెనీ ఒక స్మార్ట్ ఫోన్‌ను విడుదల చేసింది. ఈ ఫోన్‌లో ఉపయోగించిన చిప్‌ను షాంగై స్థావరంగావున్న సెమీకండక్టర్ మ్యాన్యుఫాక్చరింగ్ ఇంటర్నేషనల్ కార్ప్(ఎస్ఎమ్ఐసీ) తయారుచేసింది. కిరిన్ 9000పేరుగల ఈ చిప్ 7నానోమీటర్ల స్థాయిది. అంటే అత్యాధునిక అమెరికా సెమీకండక్టర్లతో పోల్చదగినదని అర్థం. సాంకేతికతపైన గుత్తాధిపత్యం ఎల్లకాలం నిలువదని చరిత్ర చెబుతున్నది. పట్టు పరిశ్రమను చైనా వేల సంవత్సరాల క్రితమే నిర్మించింది. పట్టు పురుగులు ఉత్పత్తి చేసే పట్టుతో వస్త్రాలు నేయటమనే సాంకేతికతపైన చైనాకు చాలా కాలం గుత్తాధిపత్యం ఉండేది. 6వ శతాబ్దంలో ఇద్దరు క్రైస్తవ భిక్షువులు పట్టుపురుగుల గుడ్లను, మల్బరీ చెట్ల విత్తనాలను బైజాన్ టైన్ చక్రవర్తి జస్టినియన్‌కు అందజేయగా ఆయన తన సామ్రాజ్యంలో పట్టు పరిశ్రమను అభివృద్ధి చేశాడు. అలాగే చైనా కాగితం తయారీలో తనకున్న సాంకేతికతను ఒక యుద్ధంలో ఓడిపోయిన సైన్యం ద్వారా కోల్పోయింది. అలా కాగితం తయారీ సాంకేతికత ముందుగా మధ్యప్రాచ్యానికి, ఆ తరువాత పశ్చిమ దేశాలకు పాకింది. అలాగే తుపాకి మందు(గన్ పౌడర్), పింగాణీ తయారీలకు సంబంధించిన చైనా సాంకేతకత కూడా మధ్యప్రాచ్యం గుండా పశ్చిమ దేశాలకు చేరి ఉండొచ్చు. పారిశ్రామిక విప్లవానికి ముందు ప్రపంచంలో చైనానే అత్యంత అభివృద్ధి చెందిన దేశమనే వాస్తవం ఇక్కడ గమనార్హం.



ఆగస్టు 29వ తేదీనాడు హువెయి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అత్యంత ఆధునిక 'మేట్60 ప్రో' సెల్ ఫోన్ ను అమ్మటం మొదలు పెట్టింది. ఈ స్మార్ట్ ఫోన్ 4జి ఫోన్ గా అమ్ముతున్నప్పటికీ ఇది 5జి గా కూడా పనిచేస్తుంది. అమెరికా ఆక్షల నుంచి తప్పించుకోవటానికి హువెయి ఈ ఫోన్ ను 5జి గా ప్రకటించలేదని పేర్కొంది. దీనికున్న శక్తివంతమైన లక్షణాలవల్ల ఈ ఫోన్ వెనకవున్న కంపెనీల షేర్లు చైనా స్టాక్ మార్కెట్ లో సంచలనంగా మారాయి. అమెరికాలో కూడా ఈ ఫోన్ చాలామందిని ఆకర్షించింది. చైనా సెమీకండక్టర్ దిగుమతులపైన అమెరికా విధించిన ఆంక్షలు చైనా ప్రగతిని అడ్డుకుంటాయని ఆశించిన అమెరికా సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ దీనిని 'విజయవంతమైన కుట్ర'గా అభివర్ణించింది.

ఈ ఫోన్ లోని సాంకేతికతను గురించి హువెయి పెద్దగా వివరించలేదు. ఆన్‌లైన్ లో అందుతున్న సమాచారాన్ని బట్టి హువెయి ఫోన్‌లో క్వాల్ కోమ్ చిప్‌కు బదులుగా కిరిన్ 9000ఎస్ చిప్‌ను ఉపయోగించారు. ఈ కిరిన్ చిప్ 5ఎన్ ఎమ్ సాంకేతికత ఆధారంగా తయారైంది. దీనితో చైనాలోనే తయారైన స్టాకింగ్ టెక్నాలజీతో కూడిన తాయ్ షన్ సిపియు ఆర్కిటెక్చర్ ను వాడారు. అంతేకాకుండా హువెయి స్వయంగా అభివృద్ధి చేసిన 'హార్మొనీ ఓఎస్' ఆపరేటింగ్ సిస్టమ్ ను ఈ ఫోన్ లో ఉపయోగించారు. అంటే ఈ ఫోన్ పూర్తిగా చైనాలో తయారవటమే కాకుండా దీని ఆపరేటింగ్ సిస్టమ్ కూడా చైనాదే కావటం గమనార్హం.

సెమీ కండక్టర్ సాంకేతికతపైన అమెరికా గుత్తాధిపత్యంపైన చైనా చేసిన మెరుపుదాడిగా దీన్ని భావించవచ్చు. అంటే హువెయి తనదైన మార్గంలో, స్వతంత్రంగా సాంకేతికను సాధించినదని చెప్పవచ్చు. చైనాను 28-ఎన్ ఎమ్ తయారీ ప్రక్రియ స్థాయిలోనే నిలువరించాలనే అమెరికా లక్ష్యం దీనితో నీరుగారిపోయింది. సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో వేసిన ఈ ముందడుగు ప్రభావం చైనా సెమీ కండక్టర్ పరిశ్రమపైన అత్యంత అనుకూలంగా ఉంటుంది.

చైనాను సెమీకండక్టర్ రంగంలో ముందుకు రాకుండా నిలువరించాలని కలలుగన్న అమెరికా కంపెనీలు, రాజకీయ పార్టీలు, చైనాకు చిప్స్ ఎగుమతులను ఆపిన కంపెనీలు హువెయి ఉత్పాదనతో గందరగోళానికి లోనయ్యాయి. ఒకవేళ చైనీస్ కంపెనీలు గనుక 5, 7ఎన్ ఎమ్ చిప్స్ ను తయారు చేయటంలో విజయవంతమైతే చిప్స్ ఉత్పత్తిపైన, ఉత్పత్తి సాధనాలపైన పశ్చిమ దేశాల గుత్తాధిపత్యం క్షీణించి ధరలు అందుబాటులోకి వస్తాయి. చైనాను చిప్స్ ఉత్పత్తి నుంచి మినహాయించాలనే అమెరికా ఆశ అడియాసగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 1000 చైనా కంపెనీలపైన అమెరికా ఆంక్షలను విధించింది. ఇంతకంటే అమెరికా చేయగలిగేది చాలా పరిమితంగా ఉంటుందని చెప్పక తప్పదు. ఇప్పటికైనా చైనాపైన అమెరికా విధించిన ఆంక్షలను సడలించి చైనా మార్కెట్ లో హువెయి తో పోటీపడటానికి అమెరికా కంపెనీలు సిద్ధపడాలి. లేకపోతే చైనా తన ఉత్పత్తుల స్థాయిని సర్దుబాటు చేసుకుని అంతర్జాతీయ మార్కెట్ లో అమెరికాతో తలపడవలసి వస్తుంది. అదే జరిగితే ప్రపంచ సెమీకండక్టర్ సంపద పశ్చిమ దేశాల నుంచి చైనాకు చేరుతుంది. అప్పుడు అమెరికా ఎంతగా వగచినా ఏమీ లాభం ఉండదు.

పాలమూరు-రంగారెడ్డిపై సీఎం దృష్టి

- నేడు సచివాలయంలో సమీక్ష
- 15 లేదా 18న వెళ్లే అవకాశం ?

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని వేగంగా పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నది. ఈ మేరకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు బుధవారం సచివాలయంలో సమీక్ష చేయనున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌తోపాటు నల్లగొండ జిల్లాకు ఈ ప్రాజెక్టుతో ప్రయోజనం కలగనున్న సంగతి తెలిసిందే. ఇటీవల కేంద్ర అటవీ మంత్రిత్వశాఖకు చెందిన పర్యావరణ కమిటీ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అటవీ అనుమతులు సైతం ఇచ్చిన విషయం విదితమే. అయితే ఇంకా ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి అనుమతిని మాత్రం కేంద్రం పెండింగ్‌లోనే పెట్టింది. ఇదిలావుండగా ఇటీవల ఈ ప్రాజెక్టు పరిధిలోని ఒక మోటర్‌కు డ్రైరన్ నిర్వహించారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకపోవడంతో డ్రైరన్ సక్సెస్ అయింది. దీంతో ఈ మోటర్ ద్వారా నార్లపూర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేపట్టనున్నారు. ఈనెల 15 లేదా 18 తేదీల్లో నార్లపూర్ రిజర్వాయర్‌ను సీఎం సందర్శించ నున్నారు. ముఖ్య మంత్రి పంపింగ్‌ను ప్రారంభించనున్నారని సాగునీటి శాఖ అధికారుల సమా చారం. ఈమేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ తరుణంలో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో ఉన్నతస్థాయి సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భోజనం సైతం ఏర్పాటు చేయనుండటంతో దాదాపు రోజంతా సమీక్ష జరిగే అవకాశాలు లేకపోలేదు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సైతం రానున్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 6,864 దరఖాస్తులు

- ఆన్‌లైన్‌లో ముగిసిన గడువు
- 72,341 దరఖాస్తుల సవరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 6,864 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో దరఖాస్తు చేసిన వారిలో 72,341 మంది అప్లికేషన్లను సవరించారు. వీటితో కలిపి బదిలీల కోసం మొత్తం 79,205 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేశారు. ఒకే పాఠశాలలో సెప్టెంబర్ ఒకటి నాటికి కనీసం రెండేండ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసేందుకు అర్హులుగా ఉన్న విషయం తెలిసిందే. ఒకే పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంలు ఐదేండ్లపాటు మిగతా ఉపాధ్యాయులు ఎనిమిదేండ్లు పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఉద్యోగ విరమణకు మూడేండ్లలోపు సర్వీసు ఉన్న వారికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది. బుధ, గురువారాల్లో దరఖాస్తు ప్రతులను డీఈవో కార్యాలయాల్లో సమర్పించాలి. ఈనెల 8,9 తేదీల్లో దరఖాస్తు చేసిన వారి ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాను డీఈవో, ఆర్జేడీల వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. 10, 11 తేదీల్లో దానిపై ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. 12,13 తేదీల్లో డీఈవో కార్యాలయాల్లో సీనియార్టీ జాబితాను పొందుపరుస్తారు. గ్రేడ్-2 హెడ్మాస్టర్ పోస్టులకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలి. ఈనెల 15న మల్టీ జోన్ స్థాయిలో గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీలుంటాయి. 16న గ్రేడ్-2 హెచ్ఎం పోస్టుల ఖాళీల వివరాలను ప్రకటిస్తారు. 17 నుంచి 19 వరకు స్కూల్ అసిస్టెంట్లకు హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పిస్తారు. 20, 21 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను వెల్లడిస్తారు.

23,23 తేదీల్లో వారికి బదిలీలు చేపడతారు. 25న స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను ప్రకటిస్తారు. 26 నుంచి 28 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తారు. 29 నుంచి వచ్చేనెల ఒకటి వరకు ఎస్జీటీల ఖాళీలను వెల్లడిస్తారు. వచ్చేనెల మూడున ఎస్జీటీలకు బదిలీలు నిర్వహిస్తారు. అయితే బదిలీలు అయిన వెంటనే ఉపాధ్యాయులు కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. వచ్చేనెల ఐదు నుంచి 19 వరకు అభ్యంతరాలపై అప్పీళ్లకు అవకాశమున్నది.

మయన్మార్‌పై ఊగిసలాట

న్యూఢిల్లీ : మయన్మార్‌లో 2021 నుంచి అమలులో ఉన్న అత్యవసర పరిస్థితిని సైన్యం మరో ఆరు నెలల పాటు పొడిగించింది. దీంతో ఇప్పట్లో అక్కడ ఎన్నికలు జరిగే అవకాశం లేదని తేలిపోయింది. ఓ వైపు మయన్మార్‌లో అస్థిరత, మరోవైపు దక్షిణ, ఆగ్నేయాసియా ప్రాంతంలో పెరుగుతున్న చైనా భౌగోళిక-రాజకీయ ప్రభావం నేపథ్యంలో తాజా పరిణామాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఓ వైపు మయన్మార్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూనే మరో వైపు అక్కడి సైనిక ప్రభుత్వం పట్ల మోడీ ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోంది. తక్షణ లక్ష్యాలను సాధించుకోవడానికే భారత ప్రభుత్వం ఊగిసలాట వైఖరిని ప్రదర్శిస్తోందని పరిశీలకులు అంటున్నారు.

మయన్మార్‌లో నెలకొన్న అస్థిర పరిస్థితులపై భారత్ భద్రతాపరమైన ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా సరిహద్దు వెంబడి నెలకొన్న అస్థిరత మన దేశాన్ని కలవరపరుస్తోంది. చైనా, మయన్మార్ సైనిక పాలకుల మధ్య సంబంధాలు సంక్లిష్టంగానే ఉన్నప్పటికీ బలంగానే కొనసాగుతున్నాయి. మయన్మార్ సైనిక ప్రభుత్వాన్ని చైనా సమర్థిస్తోంది. అంతేకాక మయన్మార్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేస్తోంది. ఈ పరిణామాలను భారత్ తేలికగా తీసుకోవడం లేదు. మయన్మార్‌తో భారత్ సంబంధాలు ఇటీవలే మెరుగుపడ్డాయి. మయన్మార్‌కు చెందిన కోకో దీవులలో చైనా నిఘా వ్యవస్థ ను ఏర్పాటు చేయడంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. అండమాన్ నికోబార్ దీవులకు ఈ వ్యవస్థ కేవలం 45 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

మయన్మార్‌లో తక్షణమే పోరాటాన్ని నిలిపివేయాలంటూ ఐరాస భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్ జరిగినప్పుడు భారత్ గైర్హాజరైంది. అంతేకాక ప్రభుత్వ సంస్థలు సహా పలు భారత కంపెనీ లు మయన్మార్ సైన్యానికి, ఆయుధ డీలర్లకు ఆయుధాలు, ముడి పదార్థాలు సరఫరా చేశాయి. ఏదేమైనా మయన్మార్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి మాట్లాడుతూనే సైనిక పాలకులకు మద్దతు తెలపడం భారత ప్రభుత్వ ఊగిసలాట వైఖరికి నిదర్శనమని పరిశీలకులు వ్యాఖ్యానించారు.

జంతువుల దాడిని తట్టుకునేదెలా ?

- తలలు పట్టుకుంటున్న ప్రపంచ దేశాలు

పారిస్ : ప్రపంచ దేశాలలో కొన్ని జంతు జాతులు సృష్టిస్తున్న విధ్వంసం అంతా ఇంతా కాదు. వీటి దాడి కారణంగా పంటలు ధ్వంసమవుతున్నాయి. అడవులు సైతం కనుమరుగవుతున్నాయి. వ్యాధులు ప్రబలుతున్నాయి. పర్యావరణ వ్యవస్థలు దెబ్బ తింటున్నాయి. ఇలా అన్ని వైపుల నుంచి దాడులు చేస్తూ విధ్వంసం సృష్టించే జంతువులు ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతూ మానవాళికి ముప్పు కలిగిస్తున్నాయి. వీటిని నిలువరించడంలో వైఫల్యం కారణంగా సంవత్సరానికి 400 మిలి యన్ డాలర్ల మేర నష్టం వాటిల్లుతోంది. ఇది డెన్మార్క్ లేదా థాయ్‌లాండ్ జీడీపీతో సమానం. జీవ వైవిధ్యంపై అధ్యయనం కోసం ఏర్పడిన ఐక్యరాజ్యసమితి సలహా మండలి సోమవారం విడుదల చేసిన నివేదికలో ఈ వాస్తవాలను బయటపెట్టింది.

పెద్ద పెద్ద జంతువులు మొదలుకొని ఎలుకలు, గోధుమ రంగు పాముల వరకూ చేస్తున్న దాడుల కారణంగా పసిఫిక్ ప్రాంతంలో ఇప్పటికే కొన్ని పక్షి జాతులు అంతరించిపోయాయి. ఈ దాడుల కారణంగా జికా వైరస్, ఎల్లో ఫీవర్, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతూ మానవాళి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఈ జంతువుల మూలాలు ఎక్కడో ఉన్నప్పటికీ అవి వేగవంతంగా వ్యాప్తి చెందుతూ ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ఈ విధంగా ప్రపంచ వ్యాప్తంగా 37 వేలకు పైగా జంతువులు వివిధ ప్రాంతాలలోకి చొచ్చుకొని వెళ్లి అపార నష్టం కలిగిస్తున్నాయని నివేదిక తెలిపింది. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పుల కారణంగా జంతువుల వ్యాప్తి యథేచ్ఛగా సాగుతోంది. జంతువుల దాడిని ఎదుర్కొనేందుకు 17% దేశాలలో చట్టాలు కూడా అమలులో ఉన్నాయి. అయితే జంతువుల దాడికి మానవ తప్పిదాలే కారణమని నివేదిక తేల్చి చెప్పింది. ఒకవైపు మానవ కార్యకలాపాలు వేగంగా విస్తరిస్తుంటే మరోవైపు జంతువుల దాడి కూడా అంతే వేగంగా పెరుగుతోంది.

ఉదాహరణకు 19వ శతాబ్దిలో ఇంగ్లీ షు వలసవాదులు వేట కోసం, ఆహారం కోసం న్యూజిలాండ్‌కు ఎలుకలను తీసుకొచ్చారు. వీటి ఆగడాలను అడ్డుకునేందుకు అధికారులు మాంసాహార జంతువులను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈ జంతువులు పక్షి జాతు లపై దాడి చేసి తినడం ప్రారంభించాయి. ఏదేమైనా జంతువుల దాడిని ఎలా ఎదుర్కోవాలో తెలియక ప్రపంచ దేశాలు తలలు పట్టుకుంటున్నాయి.